ప్రజావీక్షణం
విలేకర్లు కావలెను
అసలైన అక్షర జ్ఞానాన్ని తెలియజేస్తూ విలువలతో కూడిన జీవన శైలిలో
ప్రేరణ కలిగించే విషయాలపై అవగాహన కలిగిస్తూ
ప్రజల పక్షాన నిలబడాలని అనుకుంటున్నారా.?
బాధ్యతయుతమైన జర్నలిజంలో రాణించాలనుకుంటున్నారా.?
అయితే రండి.. అక్షరాన్ని అనుకున్న విధంగా రాద్దాం..
తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా
జిల్లాలు, మండలాల వారీగా నిబద్ధతతో
పని చేసే విలేకరులు కావలెను
PJV ప్రజా వీక్షణం టీవి
9866330400

# ప్రజావీక్షణం
దినపత్రిక
ఎడిటర్ : కె. శ్రావణ్ కుమార్

PJV
ప్రజా వీక్షణం టీవి
Subscribe

www.prajaveekshanam.in సంపుటి:16 సంచిక :214 28 సోమవారం, జూన్ 2026 పేజీలు : 12 వెల:రూ.2/-

Published from : Vijayawada, Krishna, Guntur, Kakinada, Vishakhapatnam, Vijayanagaram, Prakasham, Kadapa, Kurnool, Tirupathi, Anantapur, East Godavari, West Godavari



# హైదరాబాద్‌లో డోనాల్డ్ ట్రంప్ అవెన్యూ

## - భారత్‌కు కృతజ్ఞతలు అంటూ ట్రూత్‌తో ట్రంప్ వెల్లడి

**వాషింగ్టన్,జూన్27 (ప్రజా వీక్షణం)**

భారత్‌కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కృతజ్ఞతలు తెలిపారు. హైదరాబాద్‌లోని అమెరికా కాన్సులేట్ పక్కనున్న రహదారికి 'డొనాల్డ్ ట్రంప్ అవెన్యూ' అని పేరు పెట్టిన నేపథ్యంలో ఆయన స్పందించారు. 'ఈ విధంగా గౌరవం పొందిన అమెరికా తొలి అధ్యక్షుడిని నేను. ధన్యవాదాలు భారత్' అంటూ ఆయన తన సామాజిక మాధ్యమ వేదిక 'ట్రూత్'లో పోస్టు చేశారు. అమెరికా 250వ స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 23న హైదరాబాద్‌లో ఓ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని యూఎస్ కాన్సులేట్ పక్కన ఉన్న రోడ్డుకు 'డొనాల్డ్ ట్రంప్ అవెన్యూ'గా నామకరణం చేశారు. ఆ ప్రత్యేక ఫలకాన్ని అమెరికా రాయబారి సెర్గియో గోర్‌తో కలిసి తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క ఆవిష్కరించారు. మెరికాకు చెందిన కీలక టెక్ కంపెనీలు అయిన మైక్రోసాఫ్ట్, గూగుల్, అమెజాన్‌లు ఈ రోడ్డుకు దగ్గర్లోనే ఉన్నాయి.

## ఆర్టీసీ కార్మికుల హామీలను నెరవేరుస్తున్నాం



### - వాస్తవాలను వక్రీకరించే ప్రయత్నం తగదు
### - మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టీకరణ

**హైదరాబాద్,జూన్27 (ప్రజా వీక్షణం)**

తెలంగాణ ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. శనివారం ఉదయం మీడియాతో మాట్లాడుతూ... 32 డిమాండ్లలో 29 పరిష్కారానికి చర్యలు పూర్తి అయ్యాయన్నారు.

వివరాలు 2లో

## గోదావరి వరదలపై అప్రమత్తం కండి

### - గతానుభవాలతో ముందస్తు నష్టనివారణ చర్యలు
### - పుష్కరాల సందర్భంగా గోదావరి తీరం పరిశుభ్రంగా ఉండాలి
### - అధికారులతో సమీక్షలో మంత్రి తుమ్మల ఆదేశాలు



**భద్రాద్రి కొత్తగూడెం,జూన్27 (ప్రజా వీక్షణం)**

గోదావరి వరదల వల్ల ప్రజానష్టం, పంట నష్టం లేకుండా సంబంధిత అధికారులు అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు ఆదేశించారు.

వివరాలు 2లో



## రెండేళ్లలో 500 నగరాలకు భారత్ ట్యాక్సీ సేవల

### - గుజరాత్‌లో ట్యాక్సీ సేవలు ప్రారంభించిన అమిత్ షా

**గాంధనగర్,జూన్27 (ప్రజా వీక్షణం)**

రెండేళ్లల్లో 500 నగరాలకు ఈ ట్యాక్సీ సేవలు విస్తరిస్తాయని హోం మంత్రి అమిత్ షా చెప్పారు. గుజరాత్‌లో తాజాగా భారత్ ట్యాక్సీ సేవలను ఆయన ప్రారంభించారు. కోఆపరేటివ్ మోడల్‌లో డ్రైవర్లే భాగస్వాములుగా ఉండే ఈ యాప్ ప్రారంభ వేడుకల్లో హోం మంత్రి ప్రసంగిస్తూ ట్యాక్సీ సేవలు ప్రస్తుతం నిత్యావసరంగా మారాయని అన్నారు.

వివరాలు 2లో

## రాష్ట్ర రోడ్లకు ఇక మహర్దశ

### ●హ్యామ్ రోడ్లకు నేడు సిఎం శంకుస్థాపన
### ●నల్లగొండ జిల్లా కనగల్‌లో నేడు శ్రీకారం

**నల్లగొండ,జూన్27 (ప్రజా వీక్షణం)**

తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా రహదారుల రూపురేఖలను మార్చేలా ప్రభుత్వం భారీ ప్రాజెక్టుకు శ్రీకారం చుడుతోంది. హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హ్యామ్) పద్ధతిలో చేపట్టనున్న ఈ ప్రతిష్టాత్మక రోడ్ల పనులకు 28న నల్గొండ జిల్లా కనగల్ వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు. రాష్ట్ర చరిత్రలోనే అత్యంత ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న ఈ మెగా రోడ్డు ప్రాజెక్టు కోసం ప్రభుత్వం సుమారు రూ. 13,006 కోట్ల భారీ బడ్జెట్‌ను కేటాయించింది. దీని ద్వారా రాష్ట్రంలోని అన్ని ప్రధాన ప్రాంతాలను అనుసంధానిస్తూ వేగవంతమైన, సురక్షితమైన , అత్యాధునిక రవాణా సౌకర్యాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడమే ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నారు.

వివరాలు 2లో



## నాలుగు జిల్లాల తలరాత మార్చే వెలిగొండ

### - భూములు ఇచ్చిన రైతులు త్యాగం మరువలేనిది
### - తొలివిడతలో నిర్వాసితులకు 300 కోట్ల పరిహారం
### - కృష్ణాజలాలు వస్తాయని ఎవ్వరూ ఊహించలేదు
### - గత ప్రభుత్వ పూర్తిచేయకుండానే ప్రారంభోత్సవం- వెలిగొండ ప్రాజెక్టు ద్వారా లక్షల ఎకరాలకు సాగునీరు
### - నిర్వాసిత రైతులతె సిఎం చంద్రబాబు భేటీ

02








## 14 నైబర్‌హుడ్ సెంటర్లకు ఉచిత రవాణా

### - ఈ- ఆటోలను ప్రారంభించిన - మంత్రి సీతక్క

**హైదరాబాద్,జూన్27 (ప్రజా వీక్షణం)**

దివ్యాంగుల కోసం రాష్ట్రంలోని 14 నైబర్‌హుడ్ సెంటర్లకు ఉచిత రవాణా సౌకర్యం కల్పించే లక్ష్యంతో ఈ-ఆటోల పంపిణీని తెలంగాణ ప్రభుత్వం ప్రారంభించింది. ఈ కార్యక్రమంలో మంత్రి సీతక్క పాల్గొన్నారు. హెలెన్ కెల్లర్ జయంతి సందర్భంగా దివ్యాంగుల రవాణా సదుపాయాలను మెరుగుపరిచే లక్ష్యంతో ఈ-ఆటోలను పంపిణీ చేయడం శుభపరిణామమని మంత్రి సీతక్క అన్నారు.

వివరాలు 2లో





## సీషెల్స్ చేరుకున్న ప్రధాని మోడీ

### - ఘనంగా స్వాగతం పలికిన ప్రవాస భారతీయులు

**న్యూఢిల్లీ,జూన్27 (ప్రజా వీక్షణం)**

భారత ప్రధాని నరేంద్ర మోదీ మూడు రోజుల పర్యటన నిమిత్తం సీషెల్స్ వెళ్లారు. శనివారం సాయంత్రం సీషెల్స్ ఇంటర్‌నేషనల్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. అక్కడ ఆయనకు ఘన స్వాగతం లభించింది.

వివరాలు 2లో

## పౌరసత్వానికి, పాస్‌పోర్టుకు తేడా తెలియదా?

### - బాధ్యతాయుత పదవిలో ఉన్న ఎంపి ఇలాగేనా వ్యాఖ్యలు
### - అసదుద్దీన్ వ్యాఖ్యలపై మండిపడ్డ లకేంద్రమంత్రి కిషన్ రెడ్డి



02

# గోదావరి వరదలపై అప్రమత్తం కండి

మొదటిపేజీ తరువాయి

గోదావరి పరివాహక ప్రాంతం భద్రాచలం, పినపాక నియోజకవర్గాల్లో వరదల పట్ల జిల్లా యంత్రాంగాన్ని సన్నద్ధం చేశామని తెలిపారు. కొత్తగూడెం జిల్లా కలెక్టర్ కార్యాలయలో గోదావరి వరదల నేపథ్యంలో ముందస్తు ప్రణాళికపై శనివారం జిల్లాస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు.వరదల సమయంలో ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ముందస్తు చర్యలు చేపట్టాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. గోదావరి వరదల సన్నద్ధతపై ప్రజాప్రతినిధులు, అధికారులతో సమావేశంలోపలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని జిల్లాను పరిశుభ్రంగా, సుందరంగా తీర్చిదిద్దాలన్నారు. కొన్ని ప్రాంతాల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని సూచించారు.గత వరదల అనుభవాలను పరిగణలోకి తీసుకుని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయం చేసుకోవాలని దిశానిర్దేశర చేశారు. వరదల వల్ల రహదారులు బ్లాక్ అయ్యే గ్రామాలను గుర్తించాలని సూచించారు. అత్యవసర వైద్యసేవలు, నిత్యావసర వస్తువుల రవాణాకు అడ్డంకులు లేకుండా యాక్షన్ ఎ÷–లాన్ ఉండాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున పారిశుద్ధ్య పనులను ముమ్మరం చేయాలని అధికారులను ఆదేశించారు. తాగునీరు, వైద్యం వంటి అత్యవసర సేవలపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ఈ సమీక్షకు ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, పాయం వెంకటేశ్వర్లు, జిల్లా కలెక్టర్ అంకిత్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్, ఐటీడీఏపీఓ రాహుల్, మేయర్ మూడ్ గణెళిశ్, ప్రభుత్వ శాఖల అధికారులు హాజరయ్యారు.

# రెండేళ్లలో 500 నగరాలకు భారత్ ట్యాక్సీ సేవల

మొదటిపేజీ తరువాయి

భారత్ ట్యాక్సీలో ఇలాంటి శ్రమదోపిడీ ఉండదని హోం మంత్రి హామీ ఇచ్చారు. ఒక న్యాయమైన ప్రత్యామ్నాయంగా నిలుస్తుందని అన్నారు. ఇటీవల కాలంలో ఈ రంగం గణనీయంగా విస్తరించిందని అన్నారు. ప్రస్తుతం ద్విచక్రవాహనాలు కూడా బైక్ ట్యాక్సీలుగా కుంభమేళా లాంటి భారీ ఈవెంట్స్‌లో ఉపయోగపడుతున్నాయని చెప్పారు. ఈ సందర్భంగా ప్రైవేటు రైడ్ హెయిలింగ్ యాప్స్‌పై కూడా విమర్శలు గుప్పించారు. కార్పొరేట్ యాప్‌లు ఒక క్రమపద్ధతితో శ్రమదోపిడీ చేస్తున్నాయని విమర్శించారు. రవాణా ఆపరేటర్లను డ్రైవర్లుగా పిలవడం కంటే సారథులని పిలుస్తానని చెప్పారు. ప్రైవేటు ఆపరేటర్లే అధిక శాతం లాభాలు దండుకుని వర్కర్లను వేధించిన ఘటనలు ఉన్నాయని అన్నారు. వినియోగదారులు, డ్రైవర్లకు ఎలాంటి నష్టం చేకూర్చని వ్యవస్థ ఇదేనని అన్నారు. ఇప్పటికే 7 లక్షల మంది డ్రైవర్లు ఈ యాప్‌లో భాగస్వాములయ్యారని అన్నారు. సుస్థిర ఆర్థిక భద్రతను సొంతం చేసుకున్నారని అన్నారు. భారత్ ట్యాక్సీలో రేట్లు ఎక్కువగా ఉన్నాయన్న వాదనలను కూడా హోం మంత్రి కొట్టిపారేశారు. ప్రత్యర్థి యాప్‌లు కావాలనే వ్యూహాత్మకంగా తమ ధరలను తగ్గిస్తున్నాయని కూడా హోం మంత్రి ఆరోపించారు.

# 14 నైబర్‌హుడ్ సెంటర్లకు ఉచిత రవాణా

మొదటిపేజీ తరువాయి

దివ్యాంగులు జీవితాన్ని సవాల్‌గా స్వీకరిస్తే అసాధారణ విజయాలను సాధించగలరని ఆమె పేర్కొన్నారు. ముఖ్యమంత్రి సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రత్యేక బడ్జెట్ కేటాయించి, వారి అభివృద్ధికి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. 'వైకల్యం అనేది కేవలం శారీరక లోపమే. మానవత్వంలేని వారే అసలైన దివ్యాంగులు. ఇతరులను అవమానించే అహంకారం కూడా ఒక రకమైన వైకల్యమే. పుట్టుకతో వచ్చిన లోపాలను తల్లిదండ్రుల ప్రోత్సాహం, సరైన శిక్షణ, సమాజం సహకారంతో అధిగమించవచ్చు. చూపు, వినికిడి లేకపోయినా హెలెన్ కెల్లర్ ప్రపంచానికి స్ఫూర్తిగా నిలిచారు' అని అన్నారు.'దివ్యాంగులను చీదరించకుండా వారికి అవకాశాలు కల్పిస్తే అన్ని రంగాల్లో అద్భుతంగా రాణిస్తారు. బ్రెయిలీ వంటి సాంకేతిక పరిజ్ఞానం ద్వారా అనేక మంది దివ్యాంగులు తమ లక్ష్యాలను చేరుకుంటున్నారు. తల్లిదండ్రులపై ఉన్న ఆర్థిక, రవాణా భారాన్ని తగ్గించడానికే ఈ–ఆటోల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టాం' అని సీతక్క చెప్పారు. ఈ సందర్భంగా ఐఓసీఎల్‌కు ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# సీషెల్స్ చేరుకున్న ప్రధాని మోడీ

మొదటిపేజీ తరువాయి

ప్రవాస భారతీయులు.. భారతీయ సంప్రదాయ నృత్యాలతో ఆయనకు స్వాగతం పలికారు. ఎయిర్‌పోర్టులోని జనం మోదీ, మోదీ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. సీషెల్స్ ఎయిర్‌పోర్టులో తనకు లభించిన ఘన స్వాగతంపై ప్రధాని మోదీ ఎక్స్ ఖాతాలో ఓ పోస్టు పెట్టారు. పోస్టులో.. 'అద్భుతమైన సాంస్కృతిక అనుబంధం. సీషెల్స్ ఎయిర్‌పోర్టులో లభించిన స్వాగతంలో కచ్ డ్యాన్స్ కూడా భాగమైంది. మన ప్రవాస భారతీయులు భారతదేశంలోని వివిధ ప్రాంతాల సంస్కృతులను కాపాడుకుంటున్న తీరు నిజంగా అభినందనీయం' అని పేర్కొన్నారు. ఇక, పర్యటన సందర్భంగా ఇరు దేశాల మధ్య జరిగిన పలు ఒప్పందాలపై ప్రధాని మోదీ సంతకాలు చేశారు. అనంతరం బొటానికల్ గార్డెన్‌కు వెళ్లారు. 194 ఏళ్ల తాబేలును వీక్షించారు. ఆ తర్వాత ప్రవాస భారతీయులతో మోదీ సమావేశం అయ్యారు.

# రాష్ట్ర రోడ్లకు ఇక మహర్దశ

మొదటిపేజీ తరువాయి

ఈ మెగా ప్రాజెక్టులో భాగంగా మొదటి విడత కింద రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 6,092 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న 441 రోడ్లను అభివృద్ధి చేయనున్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య రవాణా వ్యవస్థను మెరుగుపరచడంతో పాటు, వాణిజ్య పరంగా కీలకమైన మార్గాలను బలోపేతం చేసేందుకు ఈ నిధులను ఖర్చు చేయనున్నారు. హ్యామ్ విధానం లో చేపట్టడం వల్ల పనులు అత్యంత నాణ్యతతో, నిర్ణీత గడువులోగా పూర్తవుతాయని అధికారులు భావిస్తున్నారు. ప్రయాణ సమయాన్ని తగ్గించడంతో పాటు రోడ్డు ప్రమాదాల నివారణకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తూ ఈ రహదారుల రూపకల్పన జరిగింది. కనగల్‌లో జరిగే ఈ శంకుస్థాపన కార్యక్రమానికి మంత్రులు, ఉన్నతాధికారులు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరు కానున్నారు. ఈ పనులు పూర్తయితే తెలంగాణలో మౌలిక వసతుల రంగం సరికొత్త మైలురాయిని అధిగమిస్తుందని, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని ప్రభుత్వం ధీమా వ్యక్తం చేస్తోంది.

# పౌరసత్వానికి, పాస్‌పోర్టుకు తేడా తెలియదా?

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్,జూన్ 27 (ప్రజా వీక్షణం)

ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ భారత పాస్‌పోర్టులు, పౌరసత్వంపై ఇటీవల చేసిన వ్యాఖ్యలు చట్టపరంగా తప్పుదారి పట్టించేవిగా ఉన్నాయని కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఒక ప్రజాప్రతినిధిగా, న్యాయవాదిగా ఉన్న అసదుద్దీన్‌కు పాస్‌పోర్టుకు, పౌరసత్వానికి మధ్య ఉన్న చట్టపరమైన తేడాలు తెలిసి ఉండాలని ఆయన హితవు పలికారు. రాజ్యాంగ బద్ధమైన పదవుల్లో ఉన్నవారు బాధ్యతాయుతంగా మాట్లాడాలని పేర్కొన్న కిషన్ రెడ్డి.. ప్రజలను తప్పుదారి పట్టించే ముందు అసదుద్దీన్ ఒవైసీ పౌరసత్వ చట్టం1955, పాస్‌పోర్ట్ చట్టం1967లను మరోసారి క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని సూచించారు. అసదుద్దీన్ వ్యాఖ్యలు చట్టంపై ఆయనకున్న అవగాహన లోపాన్ని, రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజల్లో అయోమయం సృష్టించే ప్రయత్నాన్ని సూచిస్తున్నాయని మండిపడ్డారు. విదేశాంగ మంత్రిత్వ శాఖ ఇచ్చిన వివరణను కొందరు తప్పుగా చిత్రీకరిస్తున్నారని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు.

విదేశాంగ శాఖ వివరణ ప్రకారం భారత పాస్‌పోర్టు విలువలేనిదని అర్థం కాదని, పాస్‌పోర్టు ఒక్కటే భారత పౌరసత్వానికి తుది, ఖచ్చితమైన ఆధారం కాదని మాత్రమే ప్రభుత్వం పేర్కొందని ఆయన వివరించారు. భారత పౌరసత్వం అనేది ఎల్లప్పుడూ భారత రాజ్యాంగం , పౌరసత్వ చట్టం1955 ప్రకారమే నిర్ణయించబడుతుందని స్పష్టం చేశారు. పాస్‌పోర్ట్ చట్టం1967 ప్రకారం పాస్‌పోర్టు అనేది ప్రధానంగా విదేశీ ప్రయాణాల కోసం ఉపయోగించే ఒక పత్రం (÷ుసజీల। ఆనీఇ-బీప।నిబి) మాత్రమేనని కేంద్ర మంత్రి తెలిపారు. ఆ చట్టంలోని సెక్షన్ 20 ప్రకారం.. ప్రజాహితం దృష్ట్యా భారత పౌరుడు కాని వ్యక్తికి కూడా కేంద్ర ప్రభుత్వం పాస్‌పోర్టు లేదా ట్రావెల్ డాక్యుమెంట్‌ను జారీ చేసే ప్రత్యేక అధికారాన్ని కలిగి ఉంటుందని గుర్తుచేశారు. గతంలో కూడా ఇటువంటి ప్రత్యేక సందర్భాలు ఉన్నాయని, అందువల్ల పాస్‌పోర్టును మాత్రమే పౌరసత్వానికి తుది ప్రాతిపదికగా పరిగణించలేమని చెప్పారు. ఇది ఇప్పటికప్పుడు తెచ్చిన కొత్త నిబంధన కాదని, 1967లో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే ఈ చట్టం అమల్లోకి వచ్చిందని తెలిపారు. దాదాపు 60 ఏళ్లుగా అమల్లో ఉన్న చట్టపరమైన అంశాన్ని ఇప్పుడు మోదీ ప్రభుత్వంపై నెట్టడం అవగాహన లోపమో, లేదా వాస్తవాలను దాచిపెట్టే కుట్రో అవుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పౌరసత్వ చట్టం1955 ప్రకారం ఒక వ్యక్తికి భారత పౌరసత్వం అనేది జననం, వంశపారంపర్యం, నమోదు లేదా నేచురలైజేషన్ పక్రియల ద్వారా మాత్రమే లభిస్తుందని కిషన్ రెడ్డి వివరించారు. గతంలో 2013లో బొంబాయి హైకోర్టు ఇచ్చిన తీర్పును ప్రస్తావిస్తూ.. పాస్‌పోర్టు, జనన ధృవీకరణ పత్రం వంటి పత్రాలు మాత్రమే పౌరసత్వాన్ని నిరూపించడానికి పూర్తిగా సరిపోవని న్యాయస్థానం స్పష్టం చేసిందని, దేశంలోని ఇతర హైకోర్టులు కూడా ఇదే సూత్రాన్ని అనుసరించాయని గుర్తుచేశారు. విదేశాంగ మంత్రిత్వ శాఖ ఎలాంటి కొత్త విధానాన్ని లేదా నిబంధనను ప్రకటించలేదని, దేశ చట్టాలు, న్యాయస్థానాలు ఇప్పటికే స్పష్టం చేసిన పాత అంశాన్నే మరోసారి పునరుద్ఘాటించిందని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు.

# ఆర్టీసీ కార్మికుల హామీలను నెరవేరుస్తున్నాం

మొదటిపేజీ తరువాయి

11శాతం పీఆర్సీ జులై జీతాల నుంచే అమలు చేయనున్నట్లు తెలిపారు. గుర్తింపు సంఘాల ఎన్నికలను త్వరలో నిర్వహిస్తామన్నారు. విలీన కమిటీలో కార్మిక ప్రతినిధులకు చోటు కల్పిస్తామని చెప్పారు. గుర్తింపు సంఘం ఎన్నికల తర్వాతే విలీన కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి తెలిపారు. విలీన పక్రియపై ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకు వెళ్తుందన్నారు. కార్మికులను తప్పుదోవ పట్టించే ప్రచారాలను నమ్మొద్దన్నారు. ఎన్నికల నోడల్ అధికారిగా జేఎల్‌సీ సునీత నియామకం జరిగిందన్నారు. ఏపీ తరహా ఇబ్బందులు రాకుండా విలీన విధివిధానాలను రూపొందించనున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ఆర్టీసీ కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తోందని రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. కొంతమంది కార్మిక సంఘాల నాయకులు వాస్తవాలను వక్రీకరిస్తూ కార్మికులను, ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేయడం బాధాకరమని ఆయన అన్నారు. ఆర్టీసీ సమ్మె సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలో మంత్రులు పొన్నం ప్రభాకర్ , శ్రీధర్ బాబు, వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో లతో కలిసి చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు తో పాటు సీనియర్ ఐఏఎస్ అధికారులు ÷నాన్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, రవాణా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వికాస్ రాజ్, లేబర్ అండ్ ఎంప్లాయిమెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ దానా కిషోర్ , ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి ,ఇతర ఆర్టీసీ ఉన్నతాధికారులు, ప్రతి కార్మిక సంఘం నుంచి ఇద్దరు చొప్పున దాదాపు 30 మంది కార్మిక సంఘాల ప్రతినిధులతో సుదీర్ఘంగా 14 గంటల పాటు చర్చించి అందరి ఆమోదంతో ఏకగ్రీవ నిర్ణయాలు తీసుకున్నామని మంత్రి గుర్తుచేశారు. సమావేశంలో మొత్తం 32 డిమాండ్లలో 29 అంశాలు ఆర్టీసీ యాజమాన్యం పరిధిలో, మూడు అంశాలు ప్రభుత్వ పరిధిలో ఉన్నట్లు నిర్ణయించడం జరిగిందన్నారు. యాజమాన్యం పరిధిలో ఉన్న 29 అంశాల పరిష్కారానికి ఈడి ల కమిటీ ద్వారా ఇప్పటికే చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పరిధిలో ఉన్న మూడు కీలక అంశాలైన ఆర్టీసీ గుర్తింపు సంఘాల ఎన్నికలు, 2021 పీఆర్సీ, ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనం.పీఆర్సీ విషయంలో ప్రభుత్వం ప్రకటించిన 11 శాతం జూలై నెల జీతాల నుంచే అమల్లోకి రానుందని తెలిపారు. ఆర్టీసీ కార్మికుల మొదటి డిమాండ్ ఆర్టీసీ గుర్తింపు సంఘాలు ఎన్నికలు అని ఇప్పుడు మాట మార్చి ప్రజలను,కార్మికులను పక్కదోవ పట్టించడం సరికాదన్నారు. ఆర్టీసీ విలీనానికి సంబంధించి విధివిధానాలు రూపొందించే అధికారుల కమిటీలో కార్మిక ప్రతినిధులు తప్పనిసరిగా ఉండాలని సమావేశంలో కార్మికులు ఏకగ్రీవంగా నిర్ణయించారని మంత్రి పేర్కొన్నారు. అయితే ఆ కమిటీలో ఉండే కార్మిక నాయకులు గుర్తింపు పొందిన సంఘం నుంచి ఉండాలంటే ముందుగా గుర్తింపు సంఘాల ఎన్నికలు నిర్వహించాలనే నిర్ణయం అందరి సమక్షంలో తీసుకున్నామని వెల్లడించారు.దీనిలో భాగంగానే ప్రభుత్వం ఇప్పటికే గుర్తింపు సంఘాల ఎన్నికల పక్రియను ప్రారంభించిందని, లేబర్ జాయింట్ కమిషనర్ సునీతను ఎన్నికల నోడల్ అధికారిగా నియమించినట్లు తెలిపారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసి త్వరలోనే గుర్తింపు సంఘాల ఎన్నికలు నిర్వహించే దిశగా వెరిఫికేషన్ పక్రియ కొనసాగుతుందని చెప్పారు. కార్మికుల ప్రయోజనాలను కాపాడేందుకే ముందుగా గుర్తింపు సంఘాల ఎన్నికలు నిర్వహించి, ఆ సంఘం నుంచి ప్రతినిధులను విలీన కమిటీలో చేర్చే పక్రియను ప్రభుత్వం అనుసరిస్తోందన్నారు. ఆంధ్రప్రదేశ్ మాదిరి విలీనం తర్వాత ఇబ్బందులు కలగవద్దని గుర్తింపు కార్మిక సంఘాల నేతలను కమిటీ లో చేర్చి విధివిధానాలు రూపొందించేలా నిర్ణయం తీసుకున్నామన్నారు.ఈ పరిస్థితుల్లో కొంతమంది కార్మిక సంఘాల నాయకులు గుర్తింపు సంఘాల ఎన్నికలు జరగకుండా, విలీన పక్రియను కూడా వివాదాస్పదం చేసేలా వ్యవహరించడం సరికాదని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తోందని, కార్మికులు వాస్తవాలను గుర్తించి అసత్య ప్రచారాలను నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు. మాట మీద నిలబడే కాంగ్రెస్ ప్రభుత్వం విలీన పక్రియ గురించి భవిష్యత్ లో ఇబ్బందులు తలెత్తకుండా ఉండాలని గుర్తింపు సంఘం కార్మిక నేతలను కమిటీ లో చేర్చి విలీన విధివిధానాలు రూపొందించాలని భావిస్తుంది దీనిని సమస్త కార్మిక లోకం గమనించగలరని అన్నారు.

# నాలుగు జిల్లాల తలరాత మార్చే వెలిగొండ

మొదటిపేజీ తరువాయి

మార్కాపురం,జూన్ 27 (ప్రజా వీక్షణం)

నాలుగు జిల్లాల తలరాతలు మార్చే ప్రాజెక్టు వెలిగొండ అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. వెలిగొండ ప్రాజెక్టుకు భూములు ఇచ్చిన రైతుల త్యాగాలు వృథా కావని చంద్రబాబు అన్నారు. మార్కాపురం జిల్లా పర్యటనలో భాగంగా వెలిగొండ ప్రాజెక్టు ఫీడర్ కెనాల్ పనులను పరిశీలించిన అనంతరం నిర్వాసితులు, లబ్దిదారులతో సీఎం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. శనివారం దోర్నాల మండలం గంటావానిపల్లిలో వెలిగొండ ప్రాజెక్ట్ నిర్వాసితులు, రైతులతో సీఎం సమావేశమయ్యారు. అనంతరం మాట్లాడుతూ.. నీళ్ల లేక చాలా మంది ఫ్లోరైడ్ వాటర్ తాగుతున్నారని.. కృష్ణా నదీ జలాలు ఈ ప్రాంతానికి వస్తాయని ఎవరూ ఆలోచన చేసి ఉండరని తెలిపారు. రాయలసీమ, మార్కాపురం ప్రాంతానికి కృష్ణా జలాలు తీసుకురావాలని ఎన్టీఆర్ ఆలోచన చేశారని గుర్తుచేశారు.1996 మార్చి 26న వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణాన్ని ప్రారంభించామని.. రూ.900 కోట్లు పునరావాసం కోసం కేటాయించామని అన్నారు. రూ.300 కోట్లు మొదటి విడతలో నిర్వాసితులకు ఇస్తున్నామని చెప్పారు. ఏపీలో చాలా ఇబ్బందులు ఉన్నాయని సీఎం అన్నారు. వెలిగొండ ప్రాజెక్టు ద్వారా లక్షల ఎకరాలకు సాగునీరు ఇవ్వొచ్చు. సుంకేశుల గ్యాప్ పనులను 1998లోనే ప్రారంభించాం. గత ప్రభుత్వాలు కూడా మాలాగే చేసుంటే పరిస్థితి మరోలా ఉండేది. మార్కాపురం జిల్లాలో పండ్ల తోటలు బాగా రావాలన్నారు. భూములు ఇచ్చిన రైతుల త్యాగం గొప్పది. మీరు ఇచ్చిన భూముల వల్ల నాలుగైదు జిల్లాలు బాగుపడతాయి. వెలిగొండ నీళ్లు వచ్చాక చుట్టుపక్కల భూముల విలువ పెరుగుతుంది. మాది ప్రజా ప్రభుత్వం.. అందరికీ లబ్ది చేకూరుస్తాం. కరవు జిల్లా పరిస్థితులు తెలిసిన కలెక్టర్‌ను నియమించామని సీఎం తెలిపారు.మోసాలు చేయడంలో గొడ్డలి పార్టీ నేతలు దిట్ట. వైకాపా నేతలు కళ్లు ఆర్పకుండానే అబద్ధాలు చెబుతున్నారు. ఆ పార్టీ నేతలు ఇప్పుడు వితండవాదం చేస్తున్నారు. వెలిగొండ పేరుతో వైకాపా ప్రభుత్వం అనేక మోసాలు చేసింది. టన్నెల్–2లో బోరు ఇరుక్కు పోయినా ప్రాజెక్టును ప్రారంభించేశారని మండిపడ్డారు. నక్సలిజంపై పోరాటం చేశానని.. క్లైమోర్ బాంబులు పెడితే వేంకటేశ్వరస్వామి తనను కాపాడారన్నారు. గత పాలకులు రూ.10 లక్షల కోట్లు అప్పులు పెట్టిపోయారని విమర్శించారు. 3,351 వెలిగొండ నిర్వాసిత కుటుంబాలకు రూ.300 కోట్లు జమ చేశామన్నారు. నిర్వాసితుల త్యాగం వృథా కాదని.. అందరికంటే మెరుగైన జీవితం కల్పిస్తామని భరోసా ఇచ్చారు. వెలిగొండ ప్రాజెక్టుపై ఈ టర్మ్‌లో రూ.3,900 కోట్ల వ్యయం అవుతోందన్నారు. 2027 నాటికి మిగిలిన పనులన్నీ పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. ఫేజ్–1, ఫేజ్–2 పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. ఇడుపూరు, గోగులదిన్నె, తోకపల్లి తదితర పునరావాస కాలనీల్లో మౌలిక వసతులు పూర్తి చేశామన్నారు. మార్కాపురానికి ప్రత్యేక జిల్లా ఇచ్చామని.. కలెక్టరేట్ కూడా పునరావాస కాలనీ పక్కనే వస్తుందని తెలిపారు. పునరావాస కాలనీ భవిష్యత్తులో ఆదర్శ టౌన్‌షిప్‌గా అభివృద్ధి చెందుతుందని అన్నారు.4.47 లక్షల ఎకరాలకు సాగునీరు.. 23 లక్షల మందికి తాగునీరు అందేలా వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణం జరుగుతోందని సీఎం తెలిపారు. 43.5 టీఎంసీల నీటిని వినియోగంలోకి తీసుకువస్తామన్నారు. సుంకేసుల, గొట్టిపడియ డ్యామ్‌లకు రూ.120 కోట్ల పరిపాలనా అనుమతి ఇచ్చామని.. రూ.98 కోట్లతో సుంకేసుల పనులను ప్రారంభించినట్లు చెప్పారు. గత ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్లే వెలిగొండ ఆలస్యమైందని విమర్శించారు. పదేళ్ల ముందే ప్రాజెక్టు పూర్తయి ఉంటే రైతుల జీవితాలు మారిపోయేవన్నారు. గొడ్డలి పార్టీ మోసాలు డిజిటల్ మోసాలుగా ఉన్నాయని వ్యాఖ్యానించారు. ఎన్నికల ముందు డ్రామాలు, మోసాలతో ప్రజలను తప్పుదోవ పట్టించారని మండిపడ్డారు. డిజిటల్ అరెస్ట్ మోసాల తరహాలో వైసీపీ మోసాలు అంటూ దుయ్యబట్టారు. 2024లో కేటాయించిన నిధులను గత ప్రభుత్వం సరిగా వినియోగించలేదన్నారు. టన్నెల్–2లో యంత్రం చిక్కుకుపోయినా తొలగించకుండా ప్రారంభోత్సవం చేశారని విమర్శించారు. నిర్వాసితులకు న్యాయం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రాజెక్టుల కోసం భూములు ఇచ్చిన రైతులకు నష్టం జరగనివ్వమని.. బాధిత రైతులందరికీ న్యాయం చేయడం ప్రభుత్వ బాధ్యత అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. వెలిగొండ ప్రాజెక్టుతో నాలుగు జిల్లాల అభివృద్ధి, భూముల విలువ పెరుగుతుందని చెప్పారు. ప్రతి నిర్వాసిత కుటుంబానికి పూర్తి న్యాయం చేస్తామన్నారు. వెలిగొండ పెండింగ్ బిల్లులన్నీ చెల్లించామని తెలిపారు. మార్కాపురం జిల్లాకు కరువు పరిస్థితులు తెలిసిన కలెక్టర్‌ను నియమించామని.. ఈ ప్రాంతంలో హార్టికల్చర్‌కు పెద్దపీట వేస్తామన్నారు. మార్కాపురాన్ని హార్టికల్చర్ హబ్‌గా అభివృద్ధి చేస్తామని అన్నారు. హార్టికల్చర్ అభివృద్ధికి రూ.1 లక్ష కోట్ల ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. రూ.40 వేల కోట్లు ప్రభుత్వం, రూ.60 వేల కోట్లు ప్రైవేట్ పెట్టుబడులు పెట్టనున్నట్లు వెల్లడించారు. ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలతో స్థానిక యువతకు ఉద్యోగాలు లభిస్తాయన్నారు. ఎఫ్‌పీఓల ద్వారా రైతుల ఆదాయం పెంచే చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.రామాయపట్నం పోర్టు, ఎయిర్‌పోర్ట్‌తో ఎగుమతులకు అవకాశముందని సీఎం అన్నారు. రోడ్లు, రైల్వే కనెక్టివిటీతో ప్రాంత అభివృద్ధి వేగవంతం చేస్తామన్నారు. అన్నదాత సుఖీభవ పథకంలో రైతులకు ఏడాదికి రూ.20 వేల సాయం అందిస్తున్నామని.. మైక్రో ఇరిగేషన్‌కు మళ్లీ ప్రోత్సాహం అందిస్తామన్నారు. సాగునీటి ప్రాజెక్టులకు రూ.24 వేల కోట్లు ఖర్చు చేశామన్నారు. హంద్రీ–నీవా పూర్తి చేసి చివరి ప్రాంతాలకు నీళ్లు అందించామని వెల్లడించారు. పోలవరం ఆలస్యం వల్ల రాష్ట్రంపై భారీ ఆర్థిక భారం పడిందన్నారు. అమరావతిని నిలిపివేయడం రాష్ట్రానికి నష్టమన్నారు. 29 వేల మంది రైతులు 33 వేల ఎకరాలు స్వచ్ఛందంగా ఇచ్చారని గుర్తుచేశారు. రాష్ట్ర అభివృద్ధికి రాజధాని అత్యంత కీలకమన్నారు. తెలంగాణ అభివృద్ధి కోసం హైదరాబాద్‌ను తీర్చిదిద్దామని అన్నారు. వెలిగొండ ప్రాజెక్టుతో రైతుల జీవితాలు మారతాయని ధీమా వ్యక్తం చేశారు. జల్ జీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికి తాగునీరు అందిస్తున్నామ న్నారు. కులం, మతం ఆధారంగా కాకుండా అభివృద్ధిని చూసి ఓటు వేయాలని అన్నారు. తెలుగుదేశం ప్రభుత్వంలోనే మార్కాపురం అభివృద్ధి జరిగిందని చంద్రబాబు తెలిపారు. తుంగభద్ర డ్యాం గేట్ల మరమ్మతులతో నీటి వృథాను అడ్డుకున్నామన్నారు. 33 కొత్త గేట్లను ఏర్పాటు చేసి ముగ్గురు ముఖ్యమంత్రులం జాతికి అంకితం చేశామని తెలిపారు.

# మునిసిపల్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు విద్యా సామాగ్రి పంపిణీ

**బాపట్ల : జూన్ 27 (ప్రజా వీక్షణం)**

బాపట్ల పట్టణంలోని సీతా రావమ్మ మునిసిపల్ ప్రాథమిక పాఠశాలలో శనివారం సమాజ సేవకురాలు బంద్రెడ్డి రజని విద్యార్థులకు నోటు పుస్తకాలు,పెన్నులు మరియు స్కెల్ లను అందజేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... విద్యార్థులందరూ బాగా చదువుకుని తల్లిదండ్రులకి మరియు ఉపాధ్యాయులకి మంచి పేరు తీసుకురావాలని సూచించారు.వాన కాలంలో తీసుకువలసిన జాగ్రత్తల గురించి విద్యార్థులకు వివరించారు.భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్.ఏ.పీ.జె.అబ్దుల్ కలాం వర్ధంతి సందర్బంగా దేశానికి ఆయన చేసిన సేవల గురించి వివరించారు.ఒక పేద మహిళకు నిత్యవసర సరుకులను అందజేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.



# పోలియో రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి ఎమ్మెల్యే చిర్రి బాలరాజు

**జీలుగుమిల్లి జూన్ 27 (ప్రజా వీక్షణం)**

నేడు (ఆదివారం) దేశవ్యాప్తంగా నిర్వహించనున్న పల్స్ పోలియో చుక్కల కార్యక్రమాన్ని నియోజకవర్గంలోని ప్రతి తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని పోలవరం శాసనసభ్యులు చిర్రి బాలరాజు పిలుపునిచ్చారు. ఐదేళ్లలోపు చిన్నారులందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించి, వారి భవిష్యత్తుకు ఆరోగ్య రక్షణ కల్పించాలన్నారు.శనివారం బరింకలపాడులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పల్స్ పోలియో కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు.ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, మరియు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పోలియో బూత్‌లలో చుక్కల మందు ఉచితంగా లభిస్తుంది.0 నుండి 5 సంవత్సరాల వయస్సు గల ప్రతి చిన్నారికి ఈ చుక్కలు వేయించాలి.గతంలో పోలియో చుక్కలు వేయించినప్పటికీ, రేపటి కార్యక్రమంలో మరోసారి తప్పనిసరిగా వేయించాలని ఎమ్మెల్యే సూచించారు. పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రతి కుటుంబం బాధ్యతగా వ్యవహరించాలి. చిన్నారుల ఆరోగ్య పరిరక్షణలో పల్స్ పోలియో కార్యక్రమం అత్యంత కీలకమైంది అని పోలవరం నియోజకవర్గం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు చిర్రి బాలరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ సుమతీదేవి, డాక్టర్లు దిలీప్ సాయి చందు, చైతన్య, మణికంఠ, సురేష్ కుమార్, సీహెచ్ఓ శ్రీనివాసరాజు, ప్రసాద్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.







# నవతరం పార్టీ చీరాల కన్వీనర్ గా దామర్ల ప్రకాష్ బాబు

**బాపట్ల : జూన్ 27,( ప్రజా వీక్షణం )**

బాపట్ల జిల్లా చీరాల నియోజకవర్గం నవతరం పార్టీ కన్వీనర్ గా దామర్ల ప్రకాష్ బాబు నియమితులయ్యారు.పార్టీ జాతీయ అధ్యక్షులు రావు సుబ్రహ్మణ్యం పల్నాడు జిల్లా చిలకలూరిపేట పార్టీ కార్యాలయంలో ప్రకాష్ బాబుకి నియామక పత్రం అందజేశారు.నవతరం పార్టీ బాపట్ల జిల్లా అధ్యక్షులు ఎస్.కె.కరీం ఆధ్వర్యంలో జిల్లాలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని రావు సుబ్రహ్మణ్యం సూచించారు.



# చింతలపూడిలో ముగిసిన మలేరియా వ్యతిరేక మాసోత్సవాలు

## - ఘనంగా అవగాహన ర్యాలీ
## - పాఠశాలలు, కాలేజీలు, హాస్టళ్లలో విస్తృత అవగాహన
## - సబ్ యూనిట్ అధికారి ఎన్. ఎ. ప్రసాద్

**చింతలపూడి, జూన్ 27 (ప్రజా వీక్షణం)**

స్థానిక అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ పరిధిలో నెలరోజుల పాటు నిర్వహించిన మలేరియా వ్యతిరేక మాసోత్సవాలు విజయవంతంగా ముగిశాయి. ఈ ముగింపు కార్యక్రమాన్ని పురస్కరించుకుని చింతలపూడి (యుపీ హెచ్ సి)నుంచి ఫైర్ స్టేషన్ వరకు ఒక భారీ అవగాహన ర్యాలీని నిర్వహించారు. స్థానిక వైద్యధికారి డాక్టర్ అఫ్రిన్ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా చింతలపూడి సబ్ యూనిట్ మలేరియా అధికారి ఎన్. ఎ. ప్రసాద్ మాట్లాడుతూ, ఈ మాసోత్సవాల కాలంలో సబ్ యూనిట్ పరిధిలోని 10 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 88 గ్రామ/వార్డు సచివాలయాల పరిధిలో ప్రజలకు మలేరియా నివారణపై విస్తృతంగా అవగాహన కల్పించినట్లు తెలిపారు.ముఖ్యంగా ఈ మాసోత్సవాలలో భాగంగా కేవలం గ్రామాలకే పరిమితం కాకుండా.. స్థానిక పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కాలేజీలు మరియు ప్రభుత్వ, ప్రైవేటు విద్యార్థి వసతి గృహాల్లో (హాస్టళ్లలో) కూడా ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించినట్లు ప్రసాద్ పేర్కొన్నారు. విద్యార్థులకు జ్వరాలు వచ్చినప్పుడు రక్త పరీక్షలు చేయించుకోవాల్సిన ఆవశ్యకత, దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, దోమతెరల వినియోగం, వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా మలేరియాను ఎలా అరికట్టవచ్చో వివరించినట్లు ఆయన తెలిపారు.మలేరియా అవగాహనతో పాటు, నేడు జరగబోయే పల్స్ పోలియో కార్యక్రమంపై కూడా హెల్త్ సెంటర్ సిబ్బంది ప్రత్యేక ర్యాలీ నిర్వహించి ప్రజల్లో చైతన్యం నింపారు. ఐదేళ్లలోపు పిల్లలందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని కోరారు.ఈ ముగింపు మరియు అవగాహన కార్యక్రమాల్లో ఆరోగ్య శాఖ సిబ్బంది దిలీప్, కె. శ్రీనివాసరావు, ఇందిరా రాణి, బాలరాజ్, వివేక్ తదితరులు పాల్గొన్నారు.




# డ్రగ్స్‌కు దూరంగా ఉండండి బంగారు భవిష్యత్తును నిర్మించుకోండి

## - ఏలూరు జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్ పిలుపు




**ఏలూరు, జూన్ 27(ప్రజా వీక్షణం)**

మాదకద్రవ్యాలు యువత భవిష్యత్తును నాశనం చేసే ప్రమాదకరమైన ఆయుధాలని, ప్రతి విద్యార్థి వీటికి పూర్తిగా దూరంగా ఉండి తమ లక్ష్యాల సాధనపై దృష్టి పెట్టాలని ఏలూరు జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్, ఐపీఎస్ పిలుపునిచ్చారు.కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'నషా ముక్త్ భారత్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా ఏలూరు జిల్లా పోలీస్ శాఖ, జిల్లా పరిపాలన, ఎక్సైజ్ మరియు రెవెన్యూ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలో భారీ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుండి సుమారు 2,000 మంది విద్యార్థులు హాజరయ్యారు. మొదటగా విద్యార్థులందరూ డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. అనంతరం పోలీస్ పరేడ్ గ్రౌండ్స్ నుండి అమీనాపేట వరకు భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. "డ్రగ్స్‌కు నో చెప్పండి – ఉజ్వల భవిష్యత్తుకు ఎస్ చెప్పండి" అంటూ విద్యార్థులు చేసిన నినాదాలతో ఏలూరు పురవీధులు హోరెత్తాయి. అలాగే అలాగే జిల్లాలో గంజాయి, ఇతర మాదకద్రవ్యాల నిర్మూలనలో విశేష సేవలు అందించిన వివిధ పోలీస్ స్టేషన్ల అధికారులు, సిబ్బందిని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. సమాజ రక్షణ కోసం ప్రతిభ కనబరిచిన సదరు సిబ్బందికి ప్రశంసా పత్రాలను అందజేసి ఘనంగా సత్కరించారు.అంతేకాకుండా జిల్లాలో ఎక్కడైనా డ్రగ్స్, గంజాయి విక్రయాలు, రవాణా లేదా వినియోగం జరుగుతున్నట్లు సమాచారం తెలిస్తే వెంటనే కింది నంబర్లకు తెలియజేయాలని అధికారులు కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని హామీ ఇచ్చారు.టోల్ ఫ్రీ నంబర్లు:112, 1972 అలాగే వాట్సాప్ నంబర్: 9550351100







# నందిగామ సబ్ జైలు ను తనిఖీ చేసిన

## - కృష్ణాజిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి జి గోపి





**నందిగామ జూన్ 27 (ప్రజా వీక్షణం)**

ఎన్టీఆర్ జిల్లా నందిగామలోని సబ్ జైలును తనిఖీ చేసిన కృష్ణాజిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి మరియు/ కృష్ణాజిల్లా న్యాయ సేవాధికారి సంస్థ చైర్మన్ జి. గోపి ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ ఆయా కేసుల్లో శిక్ష పడి శిక్ష ను అనుభవిస్తున్న ఖైదీలను జైల్లో వారికి అందుతున్నటువంటి సౌకర్యాల గురించి వారి ఆరోగ్య సమస్యలను గురించి పలు అంశాలపై వివరణ ఇస్తూ జైలు లో క్రమశిక్షణ తో కూడిన జీవితాన్ని నేర్చుకోవాలని సూచనలు చేశారు ఖైదీలుగా జైలు శిక్ష అనుభవించిన మిమ్మల్ని మీ కుటుంబ సభ్యుల్ని సమాజం లో ఏ రకమైనటువంటి గౌరవ మర్యాదలు ఉంటాయి ఒకసారి జైలు శిక్ష అనుభవించినటువంటి వ్యక్తి మరలా జీవితంలో ఇంకొకసారి జైలుకి రాకుండా ఉండటానికి అవసరం అయినటువంటి జీవితంలో లో క్రమశిక్షణ విధానాలని నేర్చుకొని మరలా రెండోసారి జైలుకు రాకుండా ఉండటానికి తగు జాగ్రత్తలు తీసుకొని సమాజంలో మంచి వ్యక్తిగా గుర్తింపును పొందాలని వారికి సూచనలు చేశారు.ఈ కార్యక్రమం లో కృష్ణాజిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి వీ. వరలక్ష్మి , 16వ అదనపు జిల్లా జడ్జి పి. శ్రీనివాసరావు సీనియర్ సివిల్ జడ్జి వి. సత్య లక్ష్మి ప్రసన్న ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి షేక్. రియాజ్ అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ జి వందన, నందిగామ ఏసిపి శ్రీనివాసరావు, పట్టణ సిఐ పి శ్రీను రూరల్ సీఐ వైవి ఎల్ నాయుడు జైలు సూపర్నెంట్ సి హెచ్ సీతారామారావు,బార్ అధ్యక్షులు షేక్ కరిముల్లా కార్యదర్శి చెరుకుపల్లి రామారావు, న్యాయవాది అద్దంకి మణి బాబు తదితరులు పాల్గొన్నారు





# జంగారెడ్డిగూడెం గోకుల తిరుమలలో భక్తజన సందోహం

## - అసిస్టెంట్ కమిషనర్ ఆర్.వి. చందన పర్యవేక్షణలో ఘనంగా ఏర్పాట్లు





జంగారెడ్డిగూడెం:జూన్ 27(ప్రజా వీక్షణం)

స్థానిక ఉత్తర వైపు ఏడుకొండల ఆరో కొండపై వేంచేసియున్న గోకుల తిరుమల పారిజాత గిరి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం శనివారం భక్తుల గోవింద నామస్మరణలతో మారుమోగింది. స్వామివారికి ప్రీతికరమైన రోజు కావడంతో వేకువ జామునే సుప్రభాత సేవ, తోమాల సేవ, ఆరాధన, తీర్థప్రసాద గోష్టి, బాలభోగ నివేదనలను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం శ్రీ స్వామివారు భక్తులకు విశేష అలంకరణలో దర్శనమిచ్చారు. ఉదయం 5 గంటల నుండి గిరి ప్రదక్షిణ మొదటి మార్గంలో భూ వరాహస్వామి వారిని దర్శించుకున్న భక్తులు.. కంకణ ధారణ చేసి ఏడుకొండల చుట్టూ కాలినడకన గిరి ప్రదక్షిణ చేశారు. వేలాది సంఖ్యలో విద్యార్థులు, తల్లిదండ్రులు, భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని, ప్రత్యేక అష్టోత్తర పూజలు మరియు మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ (ఈఓ) ఆర్.వి. చందన పర్యవేక్షణలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక క్యూ లైన్లు, ఉచిత దర్శనాలు, అన్నదాన ఏర్పాట్లను దగ్గరుండి సమర్థవంతంగా నిర్వహించారు. ప్రతి శనివారం దాతల సహకారంతో అందించే ఉచిత అన్నప్రసాద వితరణ అత్యంత వైభవంగా సాగింది. ఈ వారం దాతలుగా వ్యవహరించిన ములేం సిద్ధార్థ రాయ్, ఎమ్. దుర్గారావు, దొర, రసూల్ రాయ్, కోలాట వెంకట కృష్ణారావు, అప్పల నాగేశ్వరరావు, గుల్లపూడి శ్రీనివాసరావులకు ఆలయ అర్చకులు నల్లూరి రవికుమార్ ఆచార్యుల వేద ఆశీస్సులతో, స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదాలు అందించి ఘనంగా సన్మానించారు. ఈ పూజా కార్యక్రమాల్లో ఆలయ చైర్మన్ అల్లూరి రామకృష్ణ, కొప్పుల నాగ సురేంద్ర, ముప్పిడి భాను, దండు భవానిలతో పాటు అభివృద్ధి కమిటీ సభ్యులు పెరిచర్ల జగపతి రాజు, రెడ్డి రంగప్రసాద్, జి. భాస్కర్ రాజు, వాసవి సాయి నగేష్, దండు ధనరాజు తదితరులు పాల్గొన్నారు. అలాగే శనివారం పూజా టిక్కెట్లు, విరాళాలు, ప్రసాదాల విక్రయం, అన్నదానం ద్వారా ఆలయానికి మొత్తం రూ. 1,25,900 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ ఆర్.వి. చందన ఒక ప్రకటనలో తెలిపారు.

# విశ్రాంత ఉపాధ్యాయుడు దుర్గం చరణ్ దాస్ భౌతిక కాయానికి సిపిఎం నాయకుల నివాళి

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా జూన్ 27 (ప్రజా వీక్షణం న్యూస్)

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ విశ్రాంత ఉపాధ్యాయుడు, వామపక్ష శ్రేయోభిలాషి దుర్గం చరణ్ దాస్ భౌతిక కాయానికి సిపిఎం జిల్లా కార్యదర్శి కుశన రాజన్న, జిల్లాకార్యదర్శివర్గ సభ్యులు కోట శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యుడు ముంజం ఆనంద్ కుమార్ నివాళులర్పించి,వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, దుర్గం చరణ్ దాస్ టీఎస్ యూటీఎఫ్‌లో ఖమ్మం జిల్లాలో కీలక బాధ్యతలు నిర్వహిస్తూ ఉపాధ్యాయ ఉద్యమానికి విశేష సేవలందించారని తెలిపారు. అనంతరం జనరల్ ట్రాన్స్‌ఫర్ ద్వారా స్వస్థలమైన కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాకు వచ్చి ఇక్కడే విశ్రాంతి పొందారని పేర్కొన్నారు. సొంత జిల్లాలో కూడా దాదాపు పది సంవత్సరాల పాటు ఉపాధ్యాయునిగా సేవలందిస్తూ, విద్యారంగ అభివృద్ధికి కృషి చేశారని అన్నారు. పదవీ విరమణ అనంతరం కూడా సామాజిక సేవ, ప్రజా సమస్యల పరిష్కారం, ప్రజాస్వామిక విలువల పరిరక్షణ కోసం నిరంతరం ప్రజల మధ్య ఉంటూ సేవలందించారని కొనియాడారు. దుర్గం చరణ్ దాస్ మరణం ఉపాధ్యాయ ఉద్యమానికి, ప్రజా ఉద్యమాలకు, సమాజానికి తీరని లోటని పేర్కొన్నారు. వారి కుటుంబ సభ్యులకు సిపిఎం నాయకులు ప్రగాఢ సానుభూతి తెలియజేసి, ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు.




# మహిళా పోలీస్ స్టేషన్‌కై స్థల పరిశీలించిన పోలీస్ కమిషనర్





ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ జూన్ 27 (ప్రజా వీక్షణం న్యూస్)

సుబేదారి పోలీస్ స్టేషన్ అవరణలో ప్రస్తుతం వున్న మహిళా పోలీస్ స్టేషన్-1 కై వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ శనివారం అధికారులతో కలసి స్థల పరిశీలన చేశారు. ఇందులో భాగంగా భీమారంలోని పూర్వ సి.ఆర్.పి.ఎఫ్ క్యాంపులో పలు ప్రదేశాలను పరిశీలించారు. ఇందులో భాగంగా హన్మకొండ జిల్లా నలుమూలల నుండి వచ్చే బాధితులను త్వరితగతిన మహిళా పోలీస్ స్టేషన్ చేరు కోవడంతో పాటు, పబ్లిక్ రవాణా సౌకర్యాలు సౌల భ్యం వుండే విధంగా నూతనంగా ఏర్పాటు మహిళా పోలీస్ స్టేషన్‌కు అవరమైన మౌళిక వసతులతో పాటు, ఇదే స్టేషన్ నందు నూతనంగా ఎర్పాటు చేయనున్న ఫ్యామిలీ కౌన్సి లింగ్ కేంద్రానికి అవరమైన స్థలాన్ని ఇక్కడి వచ్చే వారికి వాహన పార్కింగ్ లాంటి మొదలైన అంశాలు దృష్టిలో వుంచుకోని పోలీస్ కమిషన ర్ సంబంధిత పోలీస్ అధి కారులతో క్షేత్ర స్థాయిలో స్థల పరిశీలన నిర్వహించడంతో పాటు, నిర్మాణ పనులకు పోలీస్ కమికషనర్ అధి కారులతో చర్చించారు.

**పోలీస్ శాఖ అధీనంలోని స్థలాలను పరిశీలించిన వరంగల్ సి.పి**

వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ పోలీస్ అధికారులతో కలసి వరంగల్ గోపాలస్వామి దేవాలయం ప్రాంతంలో పూర్వ రీజినల్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌తో పాటు, కాకతీయ వైద్య కళాశాల వద్ద వున్న పోలీస్ శాఖ స్థలాన్ని పోలీస్ కమిషనర్ పరిశీలించారు. ప్రస్తుతం వరంగల్ కమిషన రేట్ పోలీస్ విభాగం అధీనంలో వున్న ఈ స్థలాలను రాబోవు రోజుల్లో ఎవిధంగా వినియోగించుకోవాలి, ఎలాంటి నిర్మాణాలు చేపట్టా లనే అంశంపై పోలీస్ కమిష నర్ అధికారులతో చర్చించా రు. వరంగల్ పోలీస్ కమిష నర్ వెంట క్రైమ్స్ అదనపు డిసిపి బాలస్వామి, క్రైమ్స్ ఏసిపి సదయ్య, ఏ.ఆర్ ఏసిపి సురేంద్ర, కెయంసి, సిసిఎస్, మట్టెవాడ, వరంగ ల్ ట్రాఫిక్ ఇన్స్ స్పెక్టర్లు రవికుమార్, రాఘవేందర్, కరుణాకర్, సుజాత, ఆర్.ఐ సతీష్ పాల్గోన్నారు.

# ముఖ్యమంత్రి ని కలిసిన దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి

దేవరకద్ర జూన్ 27 ప్రజా విక్షణం

దేవరకద్ర నియోజకవర్గంలో బ్రహ్మోస్ మిస్సైల్ యూనిట్ ఏర్పాటుకు సంబంధించి, ఇటీవల రక్షణ శాఖ మంత్రిని కలసిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,ని శనివారం కలిసి నియోజకవర్గ ప్రజల తరపున ధన్యవాదాలు తెలియజేసిన దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి,ఈ సందర్భంగా త్వరితగతిన బ్రహ్మోస్ యూనిట్ ఏర్పాటు చేసేందుకు కృషి చేయాలని ముఖ్యమంత్రి ని కోరారు, బ్రహ్మోస్ యూనిట్ ఏర్పాటు వల్ల స్థానిక యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభించే అవకాశం ఉన్నందున, ఈ ప్రాజెక్టు పై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ముఖ్యమంత్రి ని ఎమ్మెల్యే కోరారు.





# మన్యంకొండ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి సన్నిధిలో పాదయాత్ర చేసిన భక్తులు అన్నదాన కార్యక్రమం

దేవరకద్ర జూన్ 27 ప్రజా వి క్షణం

దేవరకద్ర గ్రామానికి చెందిన వారు ప్రతి శనివారము దేవరకద్ర నుండి మన్నె కొండకు పాదయాత్రగా వెళ్తున్న భక్తులు ఒక సంవత్సరం పూర్తి అయిన సందర్భంగా శనివారం ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజ కార్యక్రమం నిర్వహించి భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. వారికి ఆలయ సిబ్బంది వారికిశాలువాతో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు ఆంజనేయులు శెట్టి (పాలమూరు) రాజమూర్ శ్రీనివాస్ (టిపిసిసి రాష్ట్ర ఓబిసి వైస్ చైర్మన్), సంతోష్ కుమార్ ( నేటి విశ్వం రిపోర్టర్ ) నందకిషోర్ కాటశీ అశోక్ గౌడ్ , రఘు గౌడ్, శేఖర్ రెడ్డి, రాజు, శంకర్ గౌడ్ , అంజి , తదితరులు పాల్గొన్నారు.





# ఓటరు జాబితా ప్రక్షాళనలో అప్రమత్తంగా ఉండాలి

## - ఎమ్మెల్యే నాగరాజు

ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ జూన్ 27 (ప్రజా వీక్షణం న్యూస్)

అర్హులైన ప్రతి పౌరుడి పేరు ఓటరు జాబితాలో నమోదై ఉండేలా, అక్రమ నమోదులు తొలగించే లక్ష్యంతో చేపట్టిన ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమా న్ని వర్ధన్నపేట శాసన సభ్యు డు కేఆర్ నాగరాజు శనివా రం ప్రత్యక్షంగా పరిశీలించా రు. భీమారం 55వ విభాగం, హసన్‌పర్తి 66వ విభాగాల్లో ఇంటింటికీ తిరుగుతూ క్షేత్ర స్థాయిలో జరుగుతున్న ప్రక్రియను పరిశీలించి, సంబంధిత అధికారులకు, పార్టీ ప్రతినిధులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వా మ్యంలో ఓటు అత్యంత విలువైన హక్కు అని, అర్హు లైన ఒక్కరి పేరు కూడా జాబితా నుంచి తొలగి పోకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇంటింటికీ వచ్చే గణన పత్రాన్ని తప్పని సరిగా పూర్తిగా నింపి సంబంధిత అధికారులకు అందజే యాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఈ ప్రక్రియ పార దర్శకంగా, సమర్థవంతంగా జరిగేలా క్షేత్రస్థాయి అధికారు లు బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. ఇతర రాష్ట్రా ల్లో జరిగినట్లుగా తెలంగా ణలో అర్హులైన ఓటర్ల హక్కు లకు ఎలాంటి భంగం కలగ కుండా కాంగ్రెసు పార్టీ కార్య కర్తలు అప్రమత్తంగా ఉండి ప్రజలకు సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్య క్రమంలో 55వ విభాగం సీనియర్ నాయకుడు గడ్డం శివరాం ప్రసాద్, 56వ విభాగం అధ్యక్షుడు కొంకా హరిబాబు, పార్టీ ప్రతినిధి రాకేష్, క్షేత్రస్థాయి అధికారి రజిత, కనుపర్తి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



# నిషేధిత ప్లాస్టిక్ పై సమరశంఖం

## - రథంబజార్ లో మునిసిపల్ కమీషనర్ ఎం.హాసిని ఆధ్వర్యంలో ఆకస్మిక తనిఖీలు

బాపట్ల : జూన్ 27 (ప్రజా వీక్షణం)

నిషేధిత ప్లాస్టిక్ క్యారీ బ్యాగులకు బదులుగా గుడ్డ,కాగితపు సంచులను వినియోగించాలని వ్యాపారులకు బాపట్ల మునిసిపల్ కమీషనర్ మామిళ్లపల్లి హాసిని సూచించారు. శనివారం బాపట్ల పట్టణంలోని రథం బజార్ లో కమీషనర్ హాసిని ఆధ్వర్యంలో పలు దుకాణాలను ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కమీషనర్ హాసిని మాట్లాడుతూ...బాపట్ల పురపాలక సంఘ పరిధిలో నిషేధిత ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిర్మూలించేందుకు చర్యలు తీసుకుంటున్నా మన్నారు. వ్యాపారులు ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు వాడితే జరిమానాలు తప్పవన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.



# ధర్మసాగర్ ఇన్స్ స్పెక్టర్ ను అటాచ్డ్ చేస్తూ సిపి ఉత్తర్వులు జారీ

ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ జూన్ 27 (ప్రజా వీక్షణం న్యూస్)

వరంగల్ కమిషన్ పరిధిలోని ధర్మసాగర్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ శ్రీధర్ రావును ఏ. ఆర్ అటాచ్డ్ చేస్తూ వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇన్స్ స్పెక్టర్ శ్రీధర్ రావు పై పలు ఆరోపణలు రావడంతో వచ్చిన ఆరోపణ లపై ఉన్నతాధికారులు విచా రణ జరిపి జరిపి నివేదిక సమర్పించాల్సిందిగా అప్ప టి వరకు ఇన్స్ స్పెక్టర్ ను ఏ.ఆర్ అటాచ్డ్ చేస్తూ సీపీ ఉత్తర్వులు జారీ చేశారు.

# అంగన్వాడీల్లో చిన్నారుల ఆరోగ్యం, పోషణపై ప్రత్యేక దృష్టి

- కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి

ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ జూన్ 27 (ప్రజా వీక్షణం న్యూస్)

అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నా రుల ఆరోగ్యం, పోషణ, ప్రీ స్కూల్ హాజరుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి అధికా రులను ఆదేశించారు. శామ్, మామ్ పిల్లల సంఖ్య తగ్గించే లా ప్రత్యేక చర్యలు చేపట్టాల ని, ఫేస్ రికగ్నిషన్ ద్వారా హాజరు నమోదు, నాణ్యమై న పోషకాహారం, పరిశుభ్రత, సురక్షిత తాగునీరు, తల్లి దండ్రులకు అవగాహన కల్పనపై దృష్టి సారించాలని సూచించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ప్రతి అంగన్వా డీ కేంద్రాన్ని క్రమం తప్పకుం డా తనిఖీ చేయాలని ఆదేశించారు.



# కేటీఆర్ పర్యటనకు ఏర్పాట్లు

- భద్రకాళి పనులు పూర్తి చేయాలని బీఆర్ఎస్ డిమాండ్

ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ జూన్ 27 (ప్రజా వీక్షణం న్యూస్)

ఈ నెల 29న (సోమవారం) వరంగల్ తూర్పు నియోజక వర్గ కార్యకర్తల సమావేశానికి బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కల్వకుంట్ల తార క రామారావు ముఖ్య అతిథి గా హాజరవుతారని మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేంద ర్ తెలిపారు. సమావేశానికి 3,500 మంది కార్యకర్తలు హాజరవుతారని చెప్పారు. ఇదే సందర్భంగా మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ భద్రకాళి చెరువు పూడికతీత పనులను వెంట నే పూర్తి చేసి, వర్షాకాలానికి ముందు ముంపు నివారణ చర్యలు చేపట్టాలని ప్రభు త్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల పనులు ఆలస్యమవుతు న్నాయని, ప్రజల ప్రాణాలు ప్రమాదంలో పడుతున్నాయ ని విమర్శించారు.




# నందిగామ సబ్ జైలును తనిఖీ చేసిన జిల్లా న్యాయమూర్తి జి. గోపి

నందిగామ, జూన్ 27 (ప్రజా వీక్షణం )

ఎన్టీఆర్ జిల్లా నందిగామ సబ్ జైలును శనివారం కృష్ణా జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ శ్రీ జి. గోపి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీ కార్యక్రమంలో కృష్ణా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వి. వరలక్ష్మి, 16వ అదనపు జిల్లా జడ్జి శ్రీ పి. శ్రీనివాసరావు, సీనియర్ సివిల్ జడ్జి వి. సత్యలక్ష్మి ప్రసన్న, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి షేక్ రియాజ్, మరియు అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ జి. వందనలు పాల్గొన్నారు. వీరితో పాటు నందిగామ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ కరిముల్లా, కార్యదర్శి చెరుకుపల్లి రామారావు, నందిగామ ఏసీపీ చలసాని శ్రీనివాస్, సీఐ పి. శ్రీను, మరియు రూరల్ సీఐ నాయుడు తదితర పోలీస్, న్యాయశాఖ అధికారులు ఈ తనిఖీలో భాగస్వామ్యులయ్యారు. ఈ ఆకస్మిక తనిఖీ సందర్భంగా న్యాయమూర్తుల బృందం జైలులోని ఖైదీలకు కల్పిస్తున్న వసతులు, భద్రతా ఏర్పాట్లు, ప్రాంగణ పరిశుభ్రత, వారికి అందుతున్న వైద్య సేవలు మరియు రోజువారీ ఆహార నాణ్యత తదితర ముఖ్యమైన అంశాలను క్షుణ్ణంగా పరిశీలించింది. ఖైదీల సంక్షేమం, జైలు నిర్వహణ ప్రమాణాలు మరింత మెరుగుపడేలా చూడాలని, చట్టపరమైన నిబంధనలను ఖచ్చితంగా అమలు చేయాలని ఈ సందర్భంగా జిల్లా న్యాయమూర్తి జి. గోపి అక్కడి అధికారులు మరియు సిబ్బందికి పలు కీలక సూచనలు చేశారు.




# లక్ష్మీపల్లిలో వైభవంగా.... సామూహిక అక్షరాభ్యాసం..







దేవరకద్ర జూన్ 27 ప్రజా విక్షణం

దేవరకద్ర మండల పరిధిలోని లక్ష్మీపల్లి ప్రాథమిక పాఠశాలలో శనివారం సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి యం ఈ ఓ పి. బాలరాం, దేవరకద్ర జడ్పి హెచ్ ఎస్ బాలికల ఉన్నత పాఠశాల స్కూల్ కాంప్లెక్స్ జి హెచ్ యం కె. నాగేంద్రమ్మలు ముఖ్య అతిథులు గా హాజరయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన చదువుల తల్లి సరస్వతి దేవికి ప్రత్యేక పూజలు చేశారు. 2026 - 27 విద్యా సంవత్సరానికి సంబంధించి నూత నంగా ఒకటవ తరగతి లో చేరిన విద్యార్థులకు ఉచితంగా పలకలు, బలుపాలు పంపిణీ చేసి సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. అనం తరం యం ఈ ఓ బాలరాం, జి హెచ్ యం నాగేంద్రమ్మ లు మాట్లాడుతూ బడిఈడు కలిగిన ప్రతి ఒక్కరిని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని అన్నారు. ప్రభుత్వ బడుల్లో చదువు కునే విద్యార్థులకు అన్ని సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పెద్దమోని లక్ష్మీ ఆంజనేయులు, పాఠశాల హెచ్ యం ఎస్ కల్పన, ఉపాధ్యాయులు లయన్ అశ్విని చంద్రశేఖర్, రెడ్డి, బిజిలి విజయలక్ష్మి, తూడి నాగేశ్వర్ రెడ్డి, శ్రీకాంత్ యాదవ్,విద్యాభిమానులు కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

# రెండు పోలియో చుక్కలు జీవితాంతం రక్షణ!

- నేటి నుంచి పోలవరం మండలంలో పల్స్ పోలియో ఉధృతం
- ఐదేళ్ల లోపు చిన్నారులందరికీ చుక్కల మందు వేయించాలి
- వింజరం పీహెచ్‌సీ పరిధిలో 1,035 మంది చిన్నారులే లక్ష్యం
- వైద్యాధికారులు డా. మురళీధర్, డా. వాసు వెల్లడి

పోలవరం, జూన్ 27 (ప్రజా వీక్షణం):

పోలవరం మండలం వింజరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) పరిధిలో ఆదివారం (జూన్ 28) నుంచి మూడు రోజుల పాటు పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహించ నున్నట్లు వైద్యాధికారులు డాక్టర్ మురళీధర్, డాక్టర్ వాసు తెలిపారు. ఐదు సంవత్సరాల లోపు ప్రతి చిన్నారికి రెండు చుక్కల పోలియో మందు వేయించి, పోలియో వ్యాధిని సమాజం నుండి పూర్తిగా నిర్మూలిం చాలనే లక్ష్యంతో ఈ విడత కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు వారు పేర్కొన్నారు. వింజరం పీహెచ్‌సీ పరిధిలో మొత్తం 13 పల్స్ పోలియో కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వైద్యాధికారులు వివరించారు. ఈ కేంద్రాల ద్వారా పరిధిలోని 1,035 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని అన్నారు. మొదటి రోజు (జూన్ 28న) పోలియో బూత్‌కు రాలేకపోయిన చిన్నారులను గుర్తించి, వారికి రెండవ, మూడవ రోజుల్లో (జూన్ 29, 30 తేదీల్లో) సిబ్బంది నేరుగా ఇంటింటికీ వెళ్లి పోలియో చుక్కలు వేస్తారని అధికారులు స్పష్టం చేశారు. ఇందుకోసం ప్రత్యేక బృందాలను రంగంలోకి దించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా వైద్యాధి కారులు మాట్లాడుతూ.. "రెండు పోలియో చుక్కలు జీవితాంతం రక్షణ" అనే నినాదాన్ని ప్రతి తల్లిదండ్రులూ గుర్తుంచుకోవాలని పిలుపునిచ్చారు. తమ పిల్లల ఉజ్వల భవిష్యత్తు కోసం ఐదేళ్ల లోపు ఉన్న ప్రతి ఒక్కరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించి ఈ కార్యక్రమాన్ని సద్విని యోగం చేసుకోవాలని కోరారు. ఈ ముమ్మర కార్యక్రమంలో పీహెచ్‌సీ సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, ఆరోగ్య శాఖ సిబ్బందితో పాటు వాలంటీర్లు, ఇతర ప్రభుత్వ శాఖల సిబ్బంది చురుకుగా పాల్గొని సేవలందిస్తున్నారు.




# లింగాలపాడు జిల్లా పరిషత్ హైస్కూల్ ఘన విజయాలు

# ప్రెస్ మీట్‌లో హెచ్‌ఎం ఆళ్ల రాంబాబు వెల్లడి

లింగాలపాడు, జూన్ 27 (ప్రజా వీక్షణం):

ఎన్టీఆర్ జిల్లా నందిగామ మండలం లింగాలపాడు గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (పీఎంసీ) ప్రధానోపాధ్యాయులు ఆళ్ల రాంబాబు శనివారం మీడియా సమక్షంలో ఒక ప్రత్యేక ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల సాధించిన ప్రగతిని, విద్యార్థుల విజయాలను ఆయన విలేకరులకు వివరించారు. హెచ్‌ఎం ఆళ్ల రాంబాబు మాట్లా డుతూ.. ప్రస్తుత విద్యా సంవత్సరంలో తమ పాఠశాలలో మొత్తం 221 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారని తెలిపారు. పదో తరగతి విద్యార్థుల కోసం ప్రత్యేకంగా మార్నింగ్ స్టడీ అవర్స్, నిరంతర పరీక్షలు, మరియు '100 డేస్ ప్రోగ్రాం' వంటి ప్రత్యేక ప్రణాళికలను అమలు చేసినట్లు పేర్కొన్నారు. పబ్లిక్ పరీక్షలకు ముందే విద్యార్థులతో మూడుసార్లు ప్రీ-ఫైనల్ పరీక్షలు రాయించడం వల్ల వారు మంచి ఉత్తీర్ణత సాధించగలిగారని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. పదో తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను స్థానిక శాసనసభ్యురాలు శ్రీమతి తంగిరాల సౌమ్య చేతుల మీదుగా ఘనంగా సన్మానించడం జరిగిందని హెచ్‌ఎం తెలిపారు. ఎమ్మెల్యే సౌమ్య ప్రత్యేక చొరవతో టాప్-5 విద్యార్థులను హైదరాబాద్‌కు విమానంలో తీసుకెళ్లి, అక్కడ వారికి ఘనంగా తేనీటి విందు ఏర్పాటు చేయడం జరిగిందని.. ఈ విమాన యాత్రతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఎంతో సంతోషం వ్యక్తం చేశారని ఆయన కొనియాడారు. పాఠశాల అభివృద్ధికి ఎమ్మెల్యే సౌమ్య గారు అందిస్తున్న సహకారం మరువ లేనిదని హెచ్‌ఎం రాంబాబు పేర్కొ న్నారు. పాఠశాలకు ఇద్దరు ఒకేషనల్ టీచర్లను కేటాయించడంతో పాటు, విద్యార్థుల క్రీడా నైపుణ్యాలను పెంపొం దించేందుకు వీలుగా మైదానాల అభివృద్ధి పనులను కూడా ప్రారంభిం చినట్లు తెలిపారు. అలాగే పాఠశాలలో ప్రభుత్వ ప్రతిష్టాత్మక పథకమైన "డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం" అత్యంత అద్భుతంగా, నాణ్యంగా నడుస్తోందని ఆయన స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ విద్యా రంగాన్ని అభ్యుదయ పథంలో నడిపిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం కొణిదెల పవన్ కళ్యాణ్, మరియు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అలాగే స్థానిక ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య కి



నందిగామ మండలం లింగాలపాడు జిల్లా పరిషత్ హైస్కూల్ తరఫున హెచ్‌ఎం ఆళ్ల రాంబాబు మీడియా ముఖంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# వరంగల్‌లో ప్రపంచ స్థాయి డిజైన్ విద్యాసంస్థ ప్రారంభం

ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ జూన్ 27 (ప్రజా వీక్షణం న్యూస్)

ఎస్ఆర్ విశ్వవిద్యాలయం హామ్‌స్టెక్ సంయుక్త ఆధ్వ ర్యంలో తెలంగాణలో హైదరాబాద్ వెలుపల తొలి ప్రపంచ స్థాయి డిజైన్ విద్యా సంస్థను ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ నీతా లుల్లా ప్రారం భించారు. ఫ్యాషన్ డిజైన్, ఇంటీరియర్ డిజైన్‌లో డిగ్రీ కోర్సులు, పరిశ్రమ అవసరా లకు అనుగుణంగా ప్రాక్టికల్ శిక్షణ అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా నీతా లుల్లా సృజనాత్మక ఆలోచనలే విజ యానికి పునాదని పేర్కొన గా, ఎస్ఆర్ యూనివర్సిటీ ప్రతినిధులు ప్రపంచ స్థాయి నైపుణ్యాలతో విద్యార్థులను తీర్చిదిద్దడమే లక్ష్యమని వెల్లడించారు. కార్యక్రమంలో నిర్వహించిన ఫ్యాషన్ షో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.



# వచ్చే ఏడాది ఆరంభంలో భారత్‌కు ట్రంప్

## - ధృవీకరించిన అమెరికా విదేశాంగ మంత్రి మార్కో

## - భారత్ -యూఎస్ బంధం బలోపేతం అంటూ కితాబు

వాషింగ్టన్,జూన్27 (ప్రజా వీక్షణం)

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వచ్చే ఏడాది ఆరంభంలో భారత పర్యటనకు వచ్చే అవకాశం ఉందని అగ్రరాజ్య విదేశాంగ మంత్రి మార్కో రుబియో వెల్లడించారు. ట్రంప్ భారత్ పర్యటన కోసం ఇప్పటికే ఏర్పాట్లు ప్రారంభించామని, ఈ ఏడాది చివర్లో తాను భారత్‌కు వచ్చి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను సమీక్షిస్తానని తెలిపారు. భారత్-అమెరికా మధ్య సంబంధాలు అద్భుతమంటూ కొనియాడారు. అధ్యక్షుడి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లు ఖరారు చేయడానికి ఈ ఏడాది ముగిసేలోపే తాను భారత్‌కు వెళ్తానని పేర్కొన్నారు. రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ట్రంప్ మొదటి భారత పర్యటన ఇదే కానుంది. అమెరికాకు భారత్ అత్యంత సన్నిహిత భాగస్వామి అని.. ప్రధాని నరేంద్ర మోదీ- ట్రంప్ మధ్య మంచి అనుబంధం ఉందని మార్కో రూబియో తెలిపారు. దౌత్యపరంగా వారి బంధం చాలా ఉపయోగకరమన్నారు. ఇటీవల ఫ్రాన్స్‌లో జరిగిన జీ7 సదస్సులో వాణిజ్య ఒప్పందం గురించి మోదీ-ట్రంప్ చర్చించారని రూబియో వెల్లడించారు. ఇరుదేశాల మధ్య జరుగుతున్న వాణిజ్య చర్చలు త్వరలో పూర్తి కానున్నట్లు తెలిపారు. ఇంధన సరఫరాను పెంచడానికి భారత్-అమెరికా కలిసికట్టుగా పనిచేస్తున్నాయన్నారు. చమురు శుద్ధి చేయగల సామర్థ్యం ఉన్న కొన్ని దేశాలలో భారత్ కూడా ఒకటని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీపై రూబియో ప్రశంసలు కురిపించారు. తాను ఆయనకు అభిమానినని తెలిపారు. ప్రపంచ వేదికపై భారతదేశ స్థాయిని పెంచిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. మోదీ భారత్‌ను ఒక ప్రపంచ శక్తిగా మార్చారని కొనియాడారు. భారత్-అమెరికా బంధం ప్రస్తుతం ఎంతో బలంగా ఉందని మార్కో రుబియో పేర్కొన్నారు. వైట్ హౌస్‌లో ఐఏఎన్ఎస్‌కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో రుబియో మాట్లాడారు. 'వచ్చే ఏడాది ప్రారంభంలో అధ్యక్షుడు ట్రంప్, భారత్ పర్యటనకు వచ్చేలా ప్రయత్నాలు చేస్తున్నాం. అదే మా లక్ష్యం' అని చెప్పారు. అలాగే, అమెరికాకు భారత్ అత్యంత సన్నిహిత భాగస్వామి అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, అధ్యక్షుడు ట్రంప్ మధ్య ఉన్న స్నేహం ద్వైపాక్షిక బంధాలను మరింత బలోపేతం చేస్తోందని వ్యాఖ్యానించారు. లాగే ఇరు దేశాల మధ్య వాణిజ్య ఒప్పందంపై చర్చలు తుది దశకు చేరుకున్నాయని కూడా రుబియో తెలిపారు . ఈ ఒప్పందం త్వరలోనే ఖరారయ్యే అవకాశాలు ఉన్నాయని, దీనివల్ల భారత్-అమెరికా ఆర్థిక, వ్యూహాత్మక సంబంధాలు మరింత బలపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే క్వాడ్ దేశాల నేతల సమావేశం కూడా త్వరలో నిర్వహించాలని అమెరికా ఎదురుచూస్తోందని చెప్పారు.

# ఆదానీ లంచం కేసులో ఫెడరల్ కోర్టు కీలక నిర్ణయం

# కేసు ఉపసహంరణకు నివేదిక ఇవ్వాలని జడ్జి ఆదేశం

న్యూయార్క్,జూన్27 (ప్రజా వీక్షణం)

బిలియనీర్ గౌతమ్ అదానీ పై నమోదైన హై-ప్రొఫైల్ లంచం కేసులో అమెరికా ఫెడరల్ కోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. అదానీతోపాటు ఇతర నిందితులపై ఉన్న క్రిమినల్ ఆరోపణలను తక్షణమే కొట్టివేసేందుకు ఫెడరల్ జడ్జి నిరాకరించారు. ఈ కేసును ఎందుకు ఉపసంహరించుకోవాలని అను కుంటున్నారో తెలుపుతూ మరింత స్పష్టమైన, వివరణాత్మకమైన నివేదికను సమర్పించాలని అమెరికా జస్టిస్ డిపార్ట్‌మెంట్‌ను కోర్టు ఆదేశించింది. బ్రూక్లిన్ లోని యూఎస్ డిస్ట్రిక్ట్ జడ్జి నికోలస్ గరాఫిస్ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. కేసును ఉప సంహరించుకోవాలంటూ మే 18న జస్టిస్ డిపార్ట్‌మెంట్ దాఖలు చేసిన పిటిషన్ చాలా క్లుప్తంగా, ఎలాంటి బలమైన కారణాలు లేకుండా ఉందంటూ ఆయన అసంతృప్తి వ్యక్తంచేశారు. కేసును ఎందుకు డ్రాప్ చేయాలనుకుంటున్నారో సరైన ఆధారాలు, కారణాలతో కూడిన నివేదికను జూలై 13 లోగా కోర్టుకు సమర్పించాలని ప్రాసిక్యూటర్లను ఆదేశిం చారు. భారత్‌లో సౌర విద్యుత్ ప్రాజెక్టుల ఆమోదం కోసం ప్రభుత్వ అధికారులకు వందల మిలియన్ డాలర్ల లంచాలు ఇవ్వడానికి ప్రయత్నించారని, అలాగే అమెరికా ఇన్వెస్టర్లను తప్పుదోవ పట్టించారని గౌతమ్ అదానీ, ఆయన మేనల్లుడు సాగర్ అదానీపై 2024లో అమెరికాలో కేసు నమోదైంది. అయితే ఈ ఆరోపణలను అదానీ గ్రూప్ మొదటి నుంచీ తీవ్రంగా ఖండిస్తూ వస్తోంది. మే నెలలో ట్రంప్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత.. ఈ కేసుపై మరింత సమయం, వనరులను కేటాయించలేమని పేర్కొంటూ కేసును పూర్తిగా ఉపసంహరించుకోవాలని జస్టిస్ డిపార్ట్‌మెంట్ భావించింది. జూన్ 24న అదానీ తరపు న్యాయవాదులు కూడా ఈ కేసు అమెరికా అధికార పరిధిలోకి రాదని, లంచం ఇచ్చినట్లు నిరూపించడానికి తగిన ఆధారాలు లేవని పేర్కొంటూ కేసును అధికారికంగా కొట్టివేయాలని కోర్టును కోరారు. అయితే దీనిపై తుది నిర్ణయం తీసుకునే ముందు ప్రభుత్వం నుంచి పూర్తి వివరణ కావాలని న్యాయమూర్తి స్పష్టంచేశారు. ఈ క్రిమినల్ కేసు పక్రియ ఇలా ఉండగా.. దీనికి సమాంతరంగా నడుస్తున్న సివిల్ వివాదాల పరిష్కారానికి అదానీ గ్రూప్ అంగీకరించింది. ఇందులో భాగంగా గౌతమ్ అదానీ 6 మిలియన్ డాలర్లు, సాగర్ అదానీ 12 మిలియన్ డాలర్ల మేర సివిల్ సెటిల్‌మెంట్ కింద చెల్లించే ప్రతిపాదనలు కోర్టు అనుమతి కోసం వేచి ఉన్నాయి. ఇవి కాకుండా ఇరాన్ నుంచి ద్రవీకృత పెట్రోలియం గ్యాస్ దిగుమతులకు సంబంధించి అమెరికా ఆంక్షలను ఉల్లంఘించారనే ఆరోపణల పరిష్కారానికిగాను అదానీ ఎంటర్‌ప్రైజెస్ అమెరికా ట్రెజరీకి 275 మిలియన్ డాలర్లు చెల్లించడానికి ఒప్పుకుంది.

# నేడు పల్స్ పోలియో కార్యక్రమం

# చిన్నారులకు పోలియో చుక్కలకు ఏర్పాట్లు

హైదరాబాద్,జూన్ 27 (ప్రజా వీక్షణం)

తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 28వ తేదీ ఆదివారం పల్స్ పోలియో నిర్వహించనున్నారు. అయిదేళ్లలోపు పిల్లలందరికీ తప్పనిసరిగా పల్స్ పోలియో చుక్కలు వేయించాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 28వ తేదీ నుంచి నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లు పూర్తయ్యాయి. రాష్ట్రంలోని నవజాత శిశువులు మొదలుకుని 5 సంవత్సరాల వయస్సు గల ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు అందేలా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. జూన్ 28న రాష్ట్రవ్యాప్తంగా పోలియో బూత్‌లలో డ్రాప్స్ వేస్తారు. ఈ నెల 29, 30 తేదీల్లో ఇంటింటికీ వెళ్లి మిగతా చిన్నారులకూ పోలియో చుక్కలు వేసేందుకు ఏర్పాట్లు చేశారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల్లో పట్టణ ప్రాంతాలు అధికంగా ఉండటంతో జులై 1న అదనంగా మరో రోజు కార్యక్రమం కొనసాగుతుంది. ఇకపోతే కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లపై రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఇప్పటికే ఉన్నతాధికారులతో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. రాష్ట్రంలోని 0 నుంచి 5 సంవత్సరాల వయస్సు గల ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు అందేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని, ఒక్కరు కూడా మిగిలిపోకుండా బూత్‌లు, మొబైల్ బృందాలు, ఇంటింటి సర్వేల ద్వారా పోలియో డ్రాప్స్ అందించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా వలస కార్మికుల పిల్లలు, ఇటుక బట్టీలు, నిర్మాణ ప్రాంతాలు, పట్టణ ప్రాంతాల్లోని బస్తీలు, కొత్త కాలనీలు, , గిరిజన ప్రాంతాల్లోని చిన్నారులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. మహిళా శిశు సంక్షేమం, మున్సిపల్, పంచాయతీరాజ్, విద్యాశాఖ, ఆర్టీసీ తదితర శాఖల సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. తెలంగాణలో చివరి పోలియో కేసు 2007లో నమోదైందని, పోలియో రహిత హోదాను ఉమ్మడి రాష్ట్రంలోనే సాధించామని ఈ సందర్భంగా అధికారులు గుర్తు చేశారు.

# ప్రజాపాలనప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యా చరణపై ప్రత్యేక అధికారి సమీక్ష

ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ జూన్ 27 (ప్రజా వీక్షణం న్యూస్)

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్మాత్మ కంగా అమలు చేసిన ప్రజా పాలనప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా మార్చి 6 నుంచి జూన్ 12, 2026 వరకు గ్రామ, నియోజకవర్గ, జిల్లా స్థాయిల్లో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పురోగ తిని సమీక్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతి జిల్లాకు ప్రత్యే క అధికారులను నియమిం చింది. ఈ నేపథ్యంలో వరంగ ల్ జిల్లాకు ప్రత్యేక అధికారి గా నియమితులైన బీసీ సంక్షే మ శాఖ కమిషనర్ ముఖ్య కార్యదర్శి బి. బాలా మాయా దేవి, ఐఏఎస్ శనివారం జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, ఐఏఎస్ అధ్యక్షతన నిర్వహించిన సమీక్ష సమా వేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా అమలు చేసిన 10 థీమ్ లకు సంబంధించిన అంశాలపై ప్రత్యేకంగా రూపొందించిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సంబంధిత శాఖల అధికారులు వివరాలను సమర్పించారు. వివిధ శాఖ ల వారీగా సాధించిన పురోగ తి, లక్ష్యాల సాధన, ఎదుర వుతున్న సమస్యలు, చేప ట్టాల్సిన చర్యలపై జిల్లా ప్రత్యేక అధికారి సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రత్యేక అధికారి బి. బాలా మాయా దేవి మాట్లాడుతూ, ప్రజా పాలనప్రగతి ప్రణాళిక ఒక నిరంతర ప్రక్రియ అని, ప్రజల కు నాణ్యమైన సేవలు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. సంక్షేమ, అభివృద్ధి కార్య క్రమాల అమలులో అన్ని శాఖలు సమన్వయంతో పని చేసి నిర్దేశించిన లక్ష్యాలను సాధించినందుకు జిల్లా యంత్రాంగాన్ని అభినందిం చారు.




ప్రభుత్వ పథకాలు ప్రజలకు పూర్తిస్థాయిలో అందించేందుకు జిల్లా యంత్రాంగం నిరంతరం కృషి చేసి వరంగల్ జిల్లాను అభి వృద్ధిలో ముందుకు తీసుకు వెళ్లాలన్నారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లా డుతూ, ప్రభుత్వం నిర్దేశించి న లక్ష్యాల సాధనకు అన్ని శాఖలు సమిష్టిగా కృషి చేయాలని, ప్రజలకు ప్రభుత్వ పథకాల ఫలాలు వేగంగా అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ జి.సంధ్యా రాణి, అదనపు కలెక్టర్ లోక ల్ బాడీ వైవి గణేష్, జడ్పీ సీఈవో రాంరెడ్డి, ఆర్డీవోలు వరంగల్ సుమ, నర్సంపేట ఉమారాణి, సంబంధిత శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సీషెల్స్ పర్యటనలో వృద్ధ తాబేలును చూడనున్న మోడీ

న్యూఢిల్లీ,జూన్27 (ప్రజా వీక్షణం)

హిందూ మహాసముద్ర ద్వీపం సీషెల్స్‌లో వచ్చే వారం ప్రధాని మోదీ పర్యటించనున్నారు. ఆ పర్యటన వేళ ఆయన అక్కడ నేషనల్ బోటానికల్ గార్డెన్స్‌ను సందర్శించనున్నారు. షెడ్యూల్ ప్రకారం ఆయన అక్కడ ఓ వృక్షాన్ని నాటనున్నారు. భారత్, సీషెల్స్ మధ్య 50 ఏళ్ల దౌత్య బంధానికి ప్రతీకగా ప్రధాని మోదీ ఈ పర్యటన చేపట్టనున్నారు. సీషెల్స్ జాతీయ దినోత్సవ సంబరాల్లో మోదీ గౌరవ అతిథిగా పాల్గొంటారు. ఇక ప్రపంచంలో ప్రాణాలతో ఉన్న అతి వృద్ధ జంతువును కూడా ప్రధాని మోదీ దర్శించుకోనున్నారు. 1832లో పుట్టిన తాబేలును ఆయన వీక్షించనున్నారు. ఆ తాబేలు పేరు జోనాథన్. ఇప్పుడు అది సుమారు 194 ఏళ్లు ఉంటుందని గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ అంచనా వేసింది. సుమారు రెండు శతాబ్దాలకు చేరుకున్న ఆ జంతువు ఎన్నో చరిత్రాత్మక సందర్భాలకు సాక్షీగా నిలిచింది. వయసు మీరినా ఆ తాబేలు మాత్రం ఆరోగ్యకరంగా ఉన్నట్లు తెలుస్తోంది. వెటరర్నీ డాక్టర్లు దాని ఆరోగ్యాన్ని ఎప్పటికప్పుడు పరీక్షిస్తున్నారు. అయితే వయసు రీత్యా ఆ తాబేలుకు కంటి చూపు మందగించింది. వాసన గుర్తుపట్టే గుణాన్ని కూడా కొంత కోల్పోయినట్లు తెలుస్తోంది.

# శంషాబాద్‌ల ప్రాంతంలో చిరుత సంచారం

## - స్థానికుల సమాచారంతో అధికారుల వేట

హైదరాబాద్,జూన్27 (ప్రజా వీక్షణం)

హైదరాబాద్‌లోని శంషాబాద్ ప్రాంతంలో చిరుత సంచరిస్తోందనే ప్రచారం స్థానికంగా కలకలం రేపుతోంది. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం పరిసరాల్లోని చిన్మయ స్కూల్ సమీపంలో చిరుత కనిపించిందంటూ స్థానికులు సమాచారం ఇచ్చారు. ఈ క్రమంలో అధికారులు అప్రమత్తమయ్యారు. సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. చిరుత ఆనవాళ్లు, పాదముద్రలు లేదా ఇతర ఆధారాలు ఉన్నాయా అనే దానిపై అధికారులు గాలింపు చర్యలు చేపట్టారు. అవసరమైతే ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేసి పరిస్థితిని పర్యవేక్షిస్తామని అధికారులు తెలిపారు. చిరుత కనిపించిందనే వార్తతో స్థానిక ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ముఖ్యంగా స్కూల్ పరిసర ప్రాంతాలు, నివాస కాలనీల్లో నివసించే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. అయితే ఇప్పటివరకు చిరుత సంచారంపై అధికారికంగా ఎలాంటి నిర్ధారణ కాలేదు. అటవీశాఖ అధికారులు పూర్తిస్థాయిలో పరిశీలించి, చిరుత ఆనవాళ్లు లభించిన తర్వాతే స్పష్టమైన సమాచారం అందజేస్తామని తెలిపారు. ప్రజలు వదంతులను నమ్మకుండా, ఏదైనా అనుమానాస్పద జంతువు కనిపిస్తే వెంటనే అటవీశాఖ లేదా స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని అధికారులు సూచించారు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.

# గుట్ట ఇవోగా మరో ఏడాది పాటు భవానీ శంకర్

## - పదవీకాలాన్ని పొడిగించిన ప్రభుత్వం

యాదగిరిగుట్ట,జూన్27 (ప్రజా వీక్షణం)

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థాన కార్యనిర్వహణ అధికారి భవానీశంకర్ మరో ఏడాదిపాటు కొనసాగనున్నారు. ఆయన ఇవోగా ఈ నెల 30న పదవీ విరమణ చేయాల్సి ఉంది. అయితే ప్రభుత్వం ఆయన పదవీకాలాన్ని ఏడాది పొడిగించింది. ఇవో పదవీ కాలాన్ని పొడిగిస్తున్నట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణారెడ్డి ప్రకటించారు. ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 30న ఆయన పదవీ విరమణ పొందుతుండటంతో ఆయన పదవీకాలంలో మరోఏడాది వరకు పొడిగించిన్నట్లు వెల్లడించారు. 2027 జూన్ 30 వరకు ఆయన దేవస్థాన ఈవోగా కొనసాగుతారని స్పష్టం చేశారు. పదవీ విరమణ పొందే వరకు పొందిన వేతనంలో పింఛన్ మినహాయించగా మిగిలిన మొత్తం ఆధారంగా వేతనాన్ని నిర్ణయించిన్నట్లు చెప్పారు. గతంలో గవర్నర్‌కు జాయింట్ సెక్రెటరీగా పని చేసిన భవానీశంకర్‌ను దేవస్థాన ఈవోగా నియమిస్తూ ఈ ఏడాది జనవరి 17న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేయగా అదే నెల 29న పదవీ బాధ్యతలు స్వీకరించారు. తాజాగా మరోసారి ఆయన ఈవో పదవిని పొడిగించారు. సమర్థుడైన అధికారిగా భవానీ శంకరుకు పేరుంది.

# రాజధానిలో రౌడీయిజం చేసే యత్నం

## అమరావతితో మీకేం పని వెళ్లారు

## వైకాపా నేతల తీరుపై మండిపడ్డ హోంమంత్రి అనిత

అమరావతి,జూన్27 (ప్రజా వీక్షణం)

వైసీపీ నేతలకు అమరావతిలో పర్యటించే నైతిక అర్హత లేదని హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. రైతులను పరామర్శించడానికి వెళ్లారా లేక రాజధానిలో రౌడీయిజం చేయటానికి వెళ్లారా అని ప్రశ్నించారు. వైసీపీ నేతలను రాజధాని రైతులు అడ్డుకోవడంపై హోం మంత్రి అనిత స్పందించారు. 'మీరు వెళ్తే సమస్య వస్తుందని పోలీసులు ముందే చెప్పారు. మీరు వెళ్లిన పెనుమాకలో 90శాతం రైతులు రాజధానికి భూములు ఇచ్చినవారే. రైతులపై రౌడీయిజం చేయడానికి గూండాలని వెంటబెట్టుకుని వెళ్లారు' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులే తప్పు చేసినట్టు ఇప్పుడు వైసీపీ నేతలు మాట్లాడటం సరికాదన్నారు. వైసీపీ నేతల వెంట వెళ్లినవారిలో ఎంతమంది రౌడీషీటర్‌లు ఉన్నారో డిపా÷-టం÷-మెంట్ దగ్గర మొత్తం సమాచారం ఉందన్నారు. వైసీపీ నేతలు ఇచ్చిన ఫిర్యాదుపై విచారణ చేస్తామన్నారు. అమరావతి ప్రజల కలల రాజధాని ఈరోజు శరవేగంగా ముందుకు వెళుతోందని అన్నారు. 2027 నాటికి అమరావతి పూర్తి కావాలని అందరం అహర్నిశలూ కష్టపడుతున్నామని హోం మంత్రి వెల్లడించారు. ఆనాడు అమరావతి రాజధాని అని ఒప్పుకొని తర్వాత మూడు రాజధానుల డ్రామాలాడారని విమర్శించారు. మరలా ఇప్పుడు మావిగాన్ అంటూ ఏ ముఖం పెట్టుకొని రాజధానిలో పర్యటిస్తారని ప్రశ్నించారు. అమరావతి పూర్తయితే తమకి మనుగడ కూడా ఉండదని వైసీపీ ఈ డ్రామాలు చేస్తోందని మండిపడ్డారు. ఇది ముమ్మాటికీ అమరావతి రైతులపై రౌడీ మూకలతో చేసిన దాడే అని అన్నారు. జరిగిన ఘటనపై అధికారులను అడిగి సమాచారం తెలుసుకున్నట్లు తెలిపారు. అమరావతి రైతులు కడుపు మంటతో ఉన్నారన్నారు. అమరావతి రైతులకు అండగా ఉన్నందుకు గతంలో చంద్రబాబుపై భావ ప్రకటన స్వేచ్ఛ అంటూ దాడులు చేశారని.. కానీ మేము అలాంటి వాటిని ప్రోత్సహించడం లేదని అనిత అన్నారు. ప్రభుత్వం ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకుంటుందని.. విచారణ కూడా చేస్తామన్నారు. వైసీపీ నేతలను అడ్డుకుంది అమరావతి రైతులేనని.. టీడీపీ కార్యకర్తలు కాదని స్పష్టం చేశారు. ఆనాడు టీడీపీ కార్యాలయంపై దాడి చేసిన రౌడీలు, గూండాలు నేడు రాజధాని రైతులపై దాడికి వచ్చారన్నారు. వారందరి విజువల్స్ కూడా ఉన్నాయని హోం మంత్రి అనిత పేర్కొన్నారు.

ప్రజావీక్షణం దినపత్రిక

GENERAL NEWS

28 సోమవారం, జూన్ 2026



www.prajaveekshanam.in

ప్రజావీక్షణం దినపత్రిక

ఎడిటర్ : కె. శావన్ కుమార్

# సంపాదకీయం

## ప్రజల్లో ప్రశ్నించే తత్వం చచ్చిపోయిందా ?

దృశ్యం సినిమాలో హీరో ఓ వ్యక్తిని చంపి మాయం చేస్తాడు. పోలీస్ అధికారి కొడుకైన అతడి ఆచూకీ కోసం పోలీసులు ఎంతగా ప్రయత్నించినా పట్టుకోలేక పోతారు. శవాన్నా మాయం చేసినా గుర్తించలేక పోతారు. ఆధారాలు లేకుండా చంపేసి, పోలీస్ స్టేషన్‌లోనే పాతిపెట్టినా కనిపెట్టలేక పోతారు. ఇప్పుడు అచ్చంగా ఇలాంటి కథే ఒకటి విజయవాడలో చోటుచేసుకుంది. సాయకృష్ణ కస్టోడియల్ డెత్ జరిగి దాదాపు నెలదాటినా ఆచూకీ కనిపెట్టడం లేదు. ఎందుకంటే మాయమైన వ్యక్తిపై రౌడీషీట్ ఉంది. అందులోనూ ఓ సామాన్యుడు. ఘనత వహించిన చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం సాధించిన విజయమిది. జగన్ హయాంలోనూ ఓ డాక్టర్‌ను పిచ్చోడిని చేసి చంపారు. పిల్లలు మాయం అయ్యారు. పట్టించుకోలేదు. ఇకపోతే సాయికృష్ణ ఏమయ్యాడో అన్న సందర్భంలోనే తునిలో జ్ఞానేశ్వరి అనే ఓ చిన్నారి కూడా మాయం అయ్యింది. ఇప్పటికీ ఆమె ఆచూకీ కనుక్కోలేక పోయారు. నిజంగా ఇలాంటి ఘటనలు జరుగుతున్నా ప్రజలు స్పందించడం లేదు. మనుషులు చస్తున్నా, మాయం అవుతున్నా సమాజాం ఎందుకో నిస్తేజంగా మారిపోయింది. హక్కుల గురించి మాట్లాడే నేతల నోళ్లు మూతపడ్డాయి. ఆందోళన చేసేవారు కనిపించడం లేదు. ఎర్రజెండాల వాళ్లకు ఏమయ్యిందో కనిపించడం లేదు. పౌరహక్కుల కోసం అంటూ మాట్లాడే వారు మాయం అయ్యారు. అన్యాయాలు జరుగుతున్నా ప్రజలు ప్రశ్నించే శక్తని కోల్పోయారు. ఈ మధ్యే పుట్టిన కాక్రోచ్ జనతా పార్టీ వారు కూడా ఎక్కడా కిమ్మనడం లేదు. కొందరు ఆ మధ్య హైదరాబాద్ లో తామంతా కాక్రోచ్ అంటూ బయలుదేరారు. విజయవాడలో కస్టోడియల్ డెత్‌కు గురయ్యాడంటూ సిట్ చెప్పినా సాయికృష్ణణ వ్యవహారం గురంచి ఒక్కరు కూడా మాట్లాడడం లేదు. రాజకీయ లబ్ది కోసం వైకాపా నేతలు మాట్లాడినా అది ప ఎద్దగా ప్రభావం చూపడం లేదు. ఆంధ్రప్రదేశ్‌లో సాయకృష్ణ అనే వ్యక్తి ఇప్పటికీ కనిపించడం లేదు. పోలీసుల అదుపులో ఉన్న వ్యక్తిని కొట్టి చంపేశారు. చంపితే శవాన్ని ఇవ్వాలి. కానీ శవాన్ని ఇవ్వలేదు. మాయం చేశారు. కాల్చేశారా పాతరేశారా లేక కృష్ణానదిలో ఉన్న మొసళ్లకు ఆహారంగా వేశారా అన్ని తెలియదు. సిట్ మాత్రం కస్టోడియల్ డెత్ అంటూ కోర్టుకు నివేదించింది. అయితే మరి శవం ఏమయ్యిందనేదే ప్రశ్న. వియజవాడలో తీవ్ర సంచలనం సృష్టిస్తున్న సాయికృష్ణ మిస్సింగ్ కేసులో, తన కుమారుడు సాయి కృష్ణ చనిపోయాడని ధృవీకరిస్తూ సిఐ నాగరాజుపై చర్యలు తీసుకోవాలని ఈ నెల 19న అతని తల్లి విజయలక్ష్మి సీపీ రాజశేఖర్ బాబుకు ఫిర్యాదు చేసింది. పోలీసులు పట్టుకెళ్లినట్లు గుర్తించిన ఆమె సాయి కృష్ణ ఎక్కడున్నాడనే ప్రశ్నలకు తెరదించుతూ అతను చనిపోయడని తల్లి విజయలక్ష్మి తన ఫిర్యాదులో దృవీకరించినట్టు తెలస్తోంది. సిఐ నాగరాజు తన కుమారుడిని తన కళ్ళెదుటే కొట్టినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. మే నెల మొదటి వారంలో సాయికృష్ణను పెండింగ్‌లో ఉన్న నాన్ బెయిలబుల్ వారంట్‌తో కృష్ణలంక, మాచవరం పోలీసు స్టేషన్లో తీసుకొని వచ్చారని.. కృష్ణలంక స్టేషన్‌కు తెచ్చాకా సిఐ నాగరాజు తన కోడుకుని చంపేస్తాం దండ రెడీ చేసుకో అన్నారని ఆమె చెప్పుకొచ్చింది. అయితే సిఐ నాగరాజు సాయికృష్ణను మార్కాపురం నుంచి తీసుకొచ్చి కోర్టులో హాజరు పరచలేదని.. సాయి కృష్ణను అక్రమంగా నిర్బంధించి చిత్ర హింసలకు గురిచేసి తీవ్రంగా కొట్టారని ఆమె ఆరోపించింది. సిఐ నాగరాజు కొట్టిన దెబ్బలకు సాయి కృష్ణ చనిపోయాడని.. లాకప్ లో సాయి కృష్ణను కొట్టినప్పుడు అరుపులు కేకలు తాను విన్నానని ఆమె చెప్పుకొచ్చింది. తన కొడుకుని తనతో పంపమని అడిగితే.. తనపై సీఐ నాగరాజు గట్టిగా అరిచాడని ఆమె ఆరోపించింది. దీంతో ఏం చేయాలో తోచక తన చెల్లెలు ద్వారా హై కోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ ఫైల్ చేశామని.. సాయి కృష్ణ చనిపోయాడనే విషయం ఇబ్బందవుతుందని తన కుమారుడు శవాన్ని నామరూపాలు లేకుండా తగలబెట్టారని కూడా విజయలక్ష్మి ఫిర్యాదులో పేర్కొంది. సాయి కృష్ణను చంపి ఆధారాలు లేకుండా చేసిన సిఐ నాగరాజుపై చర్యలు తీసుకోవాలని విజయలక్ష్మి డిమాండ్ చేసింది. విజయలక్ష్మీ ఫిర్యాదు ఆధారంగా సిఐ నాగరాజుపై అక్రమంగా నిర్బంధించడం, ఆధారాలు ధ్వంసం చేయడం,హత్య చేసిన సెక్షన్ల కింద కేసులు నమోదు చేసిన పోలీసులు సాయికృష్ణ కస్టోడియల్ డెత్ చెందాడంటూ కోర్టుకు నివేదించారు. ఈ కేసు ప్రత్యేక విచారణ బృందం అధికారులు, నిందితుడైన సీఐ నాగరాజు రిమాండ్ రిపోర్టును విజయవాడ రెండవ అదనపు జుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టుకు సమర్పించారు. చట్టవిరుద్ధంగా నిర్బంధించడం, పోలీస్ స్టేషన్‌లోనే దారుణంగా థర్డ్ డిగ్రీ ప్రయోగించడం, ఆపై ఆధారాలు దొరకకుండా శవాన్ని తగలబెట్టి మాయం చేయడం వంటి విషయాలను సిట్ నిర్ధారించింది. పోలీసుల థర్డ్ డిగ్రీ వల్లే సాయికృష్ణ చనిపోయాడని, ఆ తరువాత మృతదేహాన్ని సీఐ నాగరాజు వేరే చోటుకు తరలించి దహనం చేశారని రిమాండ్ రిపోర్టులో తెలిపింది. డిజిటల్ సాక్ష్యాలను సైతం మాయం చేయడంతో పాటు విచారణలోనూ సహకరించలేదని సిట్ కోర్టుకు తెలిపింది. నిజంగా ఇంత జరిగినా సిఎం చంద్రాబు పెద్దగా స్పందించలేదు. సిట్ వేసి మిన్నకున్నారు. ఓ మహిళ హోంమంత్రిగా ఉన్నా ఓ తల్లికి న్యాయం జరగలేదు. సాయికృష్ణ రౌడీషీటర్ అయితే, కేసులు పెట్టి బొక్కలో తోయాలి. కానీ ఉగ్రవాదిని చంపినట్లు చంపేశారు. తగులబెట్టేశారు. ఆధారాలు మాయం చేశారు. ఇంత జరుగుతున్నా, పోరాటాల గడ్డ బెజవాడ కిమ్మనడం లేదు. ఎర్రజెండా పార్టీల నోళ్లు మూతలు పడ్డాయి. దీనిని ఓ కేసుగా పెద్దగా ఎవ్వరూ పరిగణించడం లేదని తేలింది. దీంతో ఎలాంటి సందేశాన్ని ఇవ్వాలనుకుంటున్నరో కూటమి పెద్దలు చెప్పాలి. ఓ వ్యక్తి కస్టోడియల్ డెత్ ఇప్పుడు సామాన్య వార్తగా మారడం విషాదం.

# సంజీవిని గేమ్‌ఛేంజర్ పథకం

- ఆగస్ట్ 15 నుంచి అన్ని జిల్లాల్లో అమలు
-మార్కాపురంను జిల్లా చేసి మాట నిలబెట్టాం
- రైతులు సేంద్రియ వ్యవసాయం దిశగా సాగాలి
- సంజీవని డిజిటల్ నెర్వ్ సెంటర్ ప్రారంభించిన చంద్రబాబు

మార్కాపురం,జూన్ 27 (ప్రజా వీక్షణం)

ప్రజల అండ ఉంటే కొండనైనా ఢీ కొట్టే శక్తి తనకు వస్తుందని సీఎం చంద్రబాబు అన్నారు. మార్కాపురంను ప్రత్యేక జిల్లాగా చేసి ఇచ్చిన హామీ నిలబెట్టుకున్నామన్నారు. కిష్టంశెట్టిపల్లిలో పర్యటించిన ఆయన.. సంజీవని డిజిటల్ నెర్వ్ సెంటర్‌ను ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.. ప్రజలు ఆనందంగా ఉండేందుకు ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తోందన్నారు. ప్రతి ఒక్కరి ఆరోగ్యం కోసం సంజీవని లాంటి వినూత్న కార్యక్రమాలు అమలు చేస్తున్నాం. సంజీవని పథకం ఒక గేమ్ ఛేంజర్ అని అన్నారు. ఆగస్టు 15 నుంచి అన్ని జిల్లాల్లో సంజీవని పథకాన్ని అమలు చేయనున్నట్లు వెల్లడించారు. యోగా, ధ్యానం వంటి మంచి అలవాట్లతో మీ ఆరోగ్యం.. మీ చేతుల్లోనే ఉంటుంది. పిల్లలకు పౌష్టికాహారం పెట్టాలి.. తాజా ఆహారం తీసుకోవాలి. జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలి. వీలైనంత వరకు ఎరువులు తక్కువగా వాడాలి. యూరియా ఎక్కువ వేస్తే పంటను కొనేందుకు సిద్ధంగా లేరు. చాలా మంది ప్రకృతి సేద్యం వైపు అడుగులు వేస్తున్నారు. రాష్ట్రంలో 20 లక్షల మంది రైతులు ప్రకృతి సేద్యం చేస్తున్నారు. భవిష్యత్‌లో పెద్ద కుటుంబాలను ఆదరిస్తాం. ఇంటి కోసం, రేషన్ కార్డు కోసం పిల్లలు, తల్లిదండ్రుల నుంచి విడిపోతున్నారు. చాలా దేశాల్లో జనాభా తగ్గిపోతోంది. జనాభా పెరగాల్సిన అవసరం ఉంది. 40 ఏళ్ల తర్వాత ఏం జరుగుతుందో దాని గురించి ఇప్పుడే ఆలోచిస్తాను. నా కంటే ఇన్నోవేషన్ తెచ్చేవారు ఎవరూ ఉండరు. ఇటీవల జెన్ జీ... జెన్ జీ మాట ఎక్కువగా వినిపిస్తోంది. నేనే అందరికంటే పెద్ద జెన్‌జీని. నా కంటే ఇన్నోవేటివ్‌గా ఆలోచించేవారు ఎవరూ ఉండరు. ఇన్నోవేషన్‌తో ముందుకు వస్తే అండగా ఉంటానని అన్నారు. పోలవరం ప్రాజెక్టు రాష్ట్రానికి జీవనాడి. వెలిగొండ ప్రాజెక్టు.. ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాలకు జీవనాడి. ఈ రెండు ప్రాజెక్టులను పూర్తి చేసి తీరుతాం. గొడ్డలి పార్టీకి మద్దతు ఇచ్చేవారు ఆత్మవిమర్శ చేసుకోవాలి. అమరావతిపై వైకాపా కుట్రలు జరుగుతూనే ఉన్నాయి. అమరావతిని నంబర్ 1 నగరంగా, రాజధానిగా తీర్చిదిద్దుతాం. అమరావతి మా రాజధాని అని కాలర్ ఎగరేసి చెప్పుకొనేలా నిర్మిస్తాంఅని చంద్రబాబు అన్నారు. వైసీపీ హయాంలో వ్యవస్థలన్నీ నిర్వీర్యమయ్యాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విమర్శలు గుప్పించారు. ప్రజల కోసమే కూటమి ఏర్పడిందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామన్నారు. ఎంతమంది పిల్లలుంటే అంతమందికీ తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించామని తెలిపారు. 3 వంట గ్యాస్ సిలిండర్లను ఉచితంగా ఇస్తున్నామన్నారు. అన్నదాతలకు అండగా నిలుస్తున్నామని.. ఏటా రైతులకు రూ.20 వేలు ఇస్తున్నామని చెప్పారు. మనసున్న ప్రభుత్వం కాబట్టే ప్రజలకు అన్నీ చేస్తున్నామని వెల్లడించారు. ప్రభుత్వ బడుల్లో ప్రవేశాలు పెరిగాయని.. ప్రైవేటు స్కూళ్ల నుంచి లక్ష మంది ప్రభుత్వ బడుల్లో చేరారని తెలిపారు. అందరికీ సంపూర్ణ ఆరోగ్యం కోసమే సంజీవని పథకాన్ని తీసుకొచ్చామని సీఎం చెప్పుకొచ్చారు. ఎవరికైనా ఆరోగ్యం ఉంటేనే ఆనందమని.. సంజీవని ద్వారా వేగవంతంగా వైద్య సేవలు అందజేస్తామన్నారు. మన మిత్ర ద్వారా ఇంటి దగ్గరకే సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. 'భవిష్యత్తులో పిల్లలే మన ఆస్తి. ఒకరు వద్దు.. ముగ్గురు ముద్దు. చాలా దేశాల్లో జనాభా తగ్గిపోతోంది' అని అన్నారు. ప్రతిఒక్కరూ క్వాంటమ్, ఎఐ నేర్చుకోవాలని సూచించారు. ఏపీకి పోలవరం జీవనాడి అని ముఖ్యమంత్రి తెలిపారు. వైసీపీ హయాంలో పోలవరాన్ని గాలికొదిలేశారని విమర్శించారు. పనులు పూర్తికాకుండానే వెలిగొండను జాతికి అంకితం చేశారన్నారు. దిక్కుమాలిన పార్టీ.. గొడ్డలి పార్టీ అంటూ విరుచుకుపడ్డారు. వైసీపీ పాలనలో మూడు ముక్కలాట ఆడారని మండిపడ్డారు. కుక్కతోక వంకర అన్నట్లు.. వైసీపీ బుద్ధి ఇంకా మారలేదన్నారు. ఇప్పుడు మావిగన్ అంటున్నారంటూ ÷ర్ అయ్యారు. అమరావతిపై వైసీపీ కుట్రలు ఆగడంలేదన్నారు. మోసాలు చేయడంలో గొడ్డలి పార్టీ దిట్ట అంటూ వ్యాఖ్యానించారు. మన రాజధాని అమరావతి అని కాలర్ ఎగరేసే పరిస్థితి తీసుకొస్తామన్నారు. అమరావతిని నంబర్‌వన్‌గా తీర్చిదిద్దుతామని అన్నారు. నదుల అనసంధానం తన జీవిత లక్ష్యమని స్పష్టం చేశారు. నీటి సమస్యలను అన్ని రాష్ట్రాలు కలిసి పరిష్కరించు కోవాలని సూచించారు. నదుల అనుసంధానమే అన్ని రాష్ట్రాలకు శ్రీరామ రక్ష అని తెలిపారు. వైసీపీ కుల రాజకీయాలు చేస్తోందని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. విజయవాడ సాయికృష్ణ కేసు అంశంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను లాగి కుట్రలు చేయాలని చూశారని ఆరోపించారు. హోం మంత్రి అనితను ఉద్దేశించి వైసీపీ మాజీ మంత్రి చేసిన వ్యాఖ్యలపై సీఎం స్పందిస్తూ.. 'మహిళల మేకప్ గురించి మాట్లాడతారా? ఆడబిడ్డలను అవమానిస్తారా? హోం మంత్రి అనితపై అనుచిత వ్యాఖ్యలు చేస్తారా? ఎవరైనా ఆడబిడ్డల జోలికొస్తే వారికదే చివరిరోజు. రాజకీయాలకు అర్హత లేని పార్టీ.. గొడ్డలి పార్టీ. ఎప్పటికైనా ఏపీకి గొడ్డలి పార్టీ వల్ల చేటే' అంటూ సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు.

# అమరావతికి వైకాపా నేతల రాకతో ఉద్రిక్తత

- వారి పర్యటనను అడ్డుకుని తిప్పిపంపిన రైతులు
- అమరావతిలో పర్యటించే అధికారం లేదని ఉద్ఘాటన
- అప్పుడేమో మూడు రాజధానులు..ఇప్పుడేమో మావిగన్
- వైకాపా నేతలు క్షమాపణలు చెప్పాలని డిమాండ్
- పరస్పర దాడులతో పోలీసుల రంగప్రవేశం

అమరావతి,జూన్27 (ప్రజా వీక్షణం)

అమరావతి ప్రాంతంలో వైసీపీ నేతల పర్యటన ఉద్రిక్తతకు దారితీసింది. శనివారం పెనుమాక సందర్శనకు వచ్చిన వైసీపీ నేతల బృందాన్ని ఉండవల్లి వద్ద రాజధాని రైతులు అడ్డుకున్నారు. వాహనాలు ముందుకు వెళ్లకుండా రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా 'రాజధాని ద్రోహి జగన్, గో బ్యాక్' అంటూ రైతులు నినాదాలు చేశారు. వైసీపీ నేతలు ఏ మొహం పెట్టుకుని రాజధానికి వస్తారని ప్రశ్నించారు. మావిగన్ వ్యాఖ్యలను వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నల్లబ్యాడ్జీలు ధరించి వైసీపీ నేతల పర్యటనకు వ్యతిరేకంగా ఆందోళన చేపట్టారు. ఈ క్రమంలో ఇరు వర్గాల మధ్య తోపులాట జరిగింది. వైకాపా నేతలు గో బ్యాక్ అంటూ పెనుమాక, కృష్ణాయపాలెంలో రైతులు ర్యాలీ నిర్వహించారు. రాజధానిగా అమరావతిని అంగీకరించాకే పర్యటించాలని డిమాండ్ చేశారు. రాజధాని ప్రాంతంలో రైతుల మధ్య విభేదాలు సృష్టించేందుకు వైకాపా ప్రయత్నిస్తోందని ఆ ప్రాంత వాసులు ఆరోపించారు. ఇందులో భాగంగానే గుంటూరు, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల నాయకులతో ఆ పార్టీ.. రాజధాని పరిరక్షణ కమిటీ ఏర్పాటు చేసిందని విమర్శించారు. ఈ కమిటీ శనివారం రాజధాని ప్రాంతంలోని పెనుమాక పర్యటనకు రావడంతో రైతులు ఎక్కడికక్కడ అడ్డుకున్నారు. అమరావతి జేఏసీ ఆధ్వర్యంలో ఉండవల్లి, పెనుమాక ప్రాంతాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. వైకాపా నేతలు ప్రకాశం బ్యారేజీ నుంచి ఉండవల్లి వద్దకు రాగానే రైతులంతా వెళ్లి అడ్డుగా నిల్చున్నారు. పేర్ని నాని, లేళ్ల అప్పిరెడ్డి, దేవినేని అవినాష్ తదితరులపై రైతుల తిరుగుబడ్డారు. మూడు రాజధానుల పేరుతో ఐదేళ్ల పాటు కాలయాపన చేసి, అమరావతిని విధ్వంసం చేసిన వైకాపా నేతలకు రాజధాని గురించి మాట్లాడే అర్హత లేదని మండిపడ్డారు. అధికారంలో ఉన్నప్పుడు మూడు రాజధానులు .. అధికారం పోయాక మావిగన్ అని గందరగోళం చేసే చర్యలు మానుకోవాలని హితవు పలికారు. రాజధానిగా అమరావతిని అంగీకరించిన తర్వాత మాత్రమే ఇక్కడ అడుగు పెట్టాలని స్పష్టం చేశారు. రైతులను తోసుకుంటూ వైకాపా నేతలు ముందుకువెళ్లేందుకు ప్రయత్నించగా.. ఇరు వర్గాల మధ్య తోపులాట జరిగింది. ఓ దశలో రాళ్లు విసురుకున్నారు. వెంటనే పోలీసులు జోక్యం చేసుకుని పరిస్థితి చక్కదిద్దారు. రైతులను, వైకాపా నేతలను చెరో వైపునకు పంపించారు. రైతులు వైకాపా నేతల వెంటపడటంతో పోలీసులు వారిని నిలువరించారు. వైకాపా నేతలు వెళ్లిపోవాలని.. లేకపోతే ఉద్రిక్తతలు పెరిగే అవకాశం ఉందని చెప్పి అక్కడి నుంచి పంపించి వేశారు. రాళ్ల దాడిలో ఓ కానిస్టేబుల్ గాయాలైనట్లు సమాచారం. అమరావతిని రాజధానిగా అంగీకరించిన తర్వాతే పర్యటించాలని అన్నదాతలు డిమాండ్ చేశారు. రైతులను తోసుకుంటూ ముందుకు వెళ్లేందుకు వైసీపీ నేతలు, కార్యకర్తలు ప్రయత్నించడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. రాజధాని రైతులు, వైసీపీ శ్రేణుల మధ్య తోపులాట చోటుచేసుకుంది. అనంతరం ఇరువర్గాల మధ్య రాళ్ల దాడులు జరిగాయి. ఈ ఘటనలో ఓ కానిస్టేబుల్ గాయపడగా, ఆయనను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చేందుకు పోలీసులు భారీగా మోహరించి భద్రతను కట్టుదిట్టం చేశారు. ఈ సందర్భంగా రాజధాని రైతులు మాట్లాడారు. శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న తమపై వైసీపీ శ్రేణులే కోడిగుడ్లతో దాడి చేశాయని ఆరోపించారు. అలాగే వైసీపీ నేతలు చేసిన వ్యాఖ్యలను వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉండవల్లి సెంటర్‌తో పాటు పెనుమాక, కృష్ణాయపాలెం ప్రాంతాల్లో కూడా రైతులు నిరసన ర్యాలీలు నిర్వహించారు. అమరావతి రాజధాని అంశంపై తమ పోరాటం కొనసాగుతుందని రైతన్నలు స్పష్టం చేశారు. మరోవైపు, ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పరిస్థితి ప్రస్తుతం అదుపులో ఉన్నప్పటికీ, అమరావతి ప్రాంతంలో ఉద్రిక్త వాతావరణం కొనసాగుతోంది.

# 30 ఏళ్ల కల పూర్తయ్యిందన్న రైతులు చంద్రబాబుతో భేటీలో రైతలు భావోద్వేగం

మార్కాపురం,జూన్ 27 (ప్రజా వీక్షణం)

రైతులతో సీఎం చంద్రబాబు సమావేశం భావోద్వేగభరిత వాతావరణంలో సాగింది. వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తి చేసేలా కృషి చేస్తున్నందుకు ముఖ్యమంత్రికి రైతులు ధన్యవాదాలు తెలిపారు.వెలిగొండ ప్రాజెక్టు పరిధిలోని రైతులు, నిర్వాసితులతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమావేశమయ్యారు. మార్కాపురం, ఎర్రగొండపాలెం, గిద్దలూరు నియోజకవర్గాల నుంచి సమావేశానికి రైతులు తరలివచ్చారు. పొలాల మధ్య రైతులు, నిర్వాసితులతో సీఎం సమావేశమయ్యారు. 30 ఏళ్ల కల అయిన వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తి చేస్తున్నందుకు కృతజ్ఞతలు తెలుపుతున్నామంటూ.. రైతులు కన్నీళ్లు పెట్టుకుని భావోద్వేగానికి గురయ్యారు. ప్రాజెక్టు నిర్మాణంతో పాటు ఆర్ అండ్ ఆర్ కూడా సకాలంలో అందించేలా చర్యలు తీసుకుంటున్నందుకు సంతోషంగా ఉందని వెలిగొండ నిర్వాసితులు తెలిపారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేయాలని సీఎం చంద్రబాబును రైతులు కోరారు. ఈ సమావేశానికి మంత్రులు నిమ్మల రామానాయుడు, డీబీవీ స్వామి, గొట్టిపాటి రవి కుమార్, స్థానిక ప్రజాప్రతినిధులు, నేతలు హాజరయ్యారు.

ప్రజావీక్షణం
దినపత్రిక

# ప్రజాసేవలో ప్రత్యేక ముద్ర: శాప్ డైరెక్టర్ కొవ్వాసు జగదీశ్వరి దొర

## - ఏడాదిలోనే ప్రజల గుండెల్లో స్థానం..

## - కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపిన కూటమి నాయకులు!





**పోలవరం, జూన్ 27 (ప్రజా వీక్షణం):**

ఆంధ్రప్రదేశ్ స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన కొవ్వాసు జగదీశ్వరి దొర ఏడాది కాలంలోనే ప్రజల మనసుల్లో చెరగని ముద్ర వేసుకున్నారు. అధికారిక బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూనే, మరోవైపు నిరంతర సేవా కార్యక్రమాలతో ప్రజా క్షేత్రంలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ సారథ్యంలో, శాప్ చైర్మన్ అనిమిని రవి నాయుడు ఆధ్వర్యంలో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ఆమె ముందుకు సాగుతున్నారు. పదవిని కేవలం బాధ్యతగా కాకుండా సేవకు ఒక మార్గంగా ఎంచుకున్న జగదీశ్వరి దొర.. నియోజకవర్గంలోని పేద కుటుంబాలకు ఆర్థిక సహాయం అందిస్తూ అండగా నిలుస్తున్నారు. ముఖ్యంగా అగ్ని ప్రమాదాల బారిన పడి ఇళ్లు, సర్వస్వం కోల్పోయిన బాధితులను తక్షణమే పరామర్శించి, వారికి అవసరమైన సాయం అందిస్తూ కొత్త ఆశలు నింపుతున్నారు. క్రీడల అభివృద్ధికి ఆమె విశేష కృషి చేస్తున్నారు. నియోజకవర్గ పరిధిలోని క్రీడాకారుల సౌకర్యార్థం: స్టేడియంల ఆధునీకరణ, అభివృద్ధికి ప్రాధాన్యత నిచ్చారు. అవసరమైన క్రీడా మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు సమకూర్చడంలో కీలక పాత్ర పోషించారు. అలాగే యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు పలు టోర్నమెంట్లు నిర్వహిస్తూ ప్రతిభావంతులను ప్రోత్సహిస్తున్నారు. మహిళలు ఆర్థికంగా స్థిరపడాలనే సంకల్పంతో జగదీశ్వరి దొర మహిళా సాధికారతకు పెద్దపీట వేశారు. నియోజకవర్గంలోని పలువురు పేద మహిళలకు స్వయం ఉపాధి కల్పించేందుకు ఉచితంగా కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం స్థానిక మహిళల్లో గొప్ప ఆత్మవిశ్వాసాన్ని నింపడమే కాకుండా సర్వత్రా ప్రశంసలు అందుకుంటోంది. ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ, నిత్యం ప్రజల్లో ఉండే నాయకురాలిగా గుర్తింపు తెచ్చుకున్న కొవ్వాసు జగదీశ్వరి దొర శాప్ డైరెక్టర్‌గా ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా కొయ్యలగూడెంలో కూటమి నాయకులు, అభిమానులు ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఆమె సేవలను కొనియాడుతూ కేక్ కట్ చేసి, శుభాకాంక్షలు తెలియజేశారు. రాబోయే రోజుల్లో ఆమె మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు.

# కాగజ్ నగర్ పట్టణంలో ఎస్ ఐ ఆర్ ఓటర్ జాబితా సవరణ

## - ఇంటింటికీ ఫారాలు పంపిణీ


**కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా జూన్ 27 (ప్రజా వీక్షణం న్యూస్)**

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ పట్టణంలోని ఇర్ఫాన్ నగర్ కాలనీలో ఎస్ ఐ ఆర్ కార్యక్రమంలో భాగంగా ఓటర్ జాబితాలో ఉన్న ఓటర్లకు ఇంటింటికీ వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాలు ఇస్తున్నారు. ఓటర్లు తమ ఫారాలను ఇంటింటికి బి ఎల్ వో లు తీసుకొచ్చి ఇస్తారు ఎవరు కూడా తొందర పడాల్సిన అవసరం లేదు అని తెలిపారు.

1. బి ఎల్ ఓ, బి ఎల్ ఎ సిబ్బంది ఇంటికి వచ్చినప్పుడు సహకరించండి
2. పాస్‌పోర్ట్ సైజు ఫోటోలి రెడీగా ఉంచుకోండి
3. చనిపోయిన వాళ్లు, వలస వెళ్లిన వాళ్ల పేర్లు ఉంటే తొలగించండి
4. 18 ఏళ్లు నిండిన కొత్త ఓటర్లులిపేరు నమోదు చేసుకోండి

మీ ఓటు – మీ హక్కు – మీ బాధ్యత ఎవరికైనా బిఎల్‌ఓ కి సంబంధించిన సమాచారం కావాలంటే ఆన్లైన్లో వారికి సంబంధించిన ఫోన్ నెంబరు అందుబాటులో ఉంది వారిని సంప్రదించి తమ సందేహాలు నివృత్తి చేసుకోవచ్చని తెలిపారు.

ఎస్ ఐ ఆర్ కార్యక్రమం వేగంగా జరుగుతోంది. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటర్ లిస్టులో పేరు నమోదు చేసుకోవాలి అని అధికారులు కోరారుఈ కార్యక్రమంలో అన్వర్ సాబ్రి కాంగ్రెస్ పార్టీ నాయకులు,మున్సిపల్ మేనేజర్ ప్రవీణ్ కుమార్,శ్రవణ్, కోఆర్డినేటర్ నవీన్ మరియు మునిసిపల్ సిబ్బంది బిఎల్వోలు బి ఎల్ ఎ లు ఓటర్లు పాల్గొన్నారు.



# పోలీసుల సమక్షంలోనే అరాచకాలు

## వైఎస్సార్‌సీపీ మైనార్టీ నేత కమల్ తీవ్ర ఆగ్రహం

**నందిగామ, జూన్ 27 (ప్రజావీక్షణం న్యూస్):**



రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాజకీయ కక్షలతో అరాచక పాలన సాగిస్తోందని వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం నేత కమల్ తీవ్రంగా మండిపడ్డారు. ఎన్టీఆర్ జిల్లా నందిగామలో పోలీసుల సమక్షంలోనే అధికార పార్టీ నేతలు, గూండాలు దాడులకు తెగబడుతున్నారని ఆయన ధ్వజమెత్తారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రస్తుతం ప్రజాస్వామ్యబద్ధమైన పాలన కాకుండా 'రెడ్ బుక్' పాలన సాగుతోందని ఆరోపించారు. శాంతిభద్రతలను కాపాడాల్సిన పోలీసుల ముందే యథేచ్ఛగా దాడులు జరుగుతుండటం ఘోరమని, ఇది ముమ్మాటికీ ప్రజాస్వామ్య హత్యేనని ఆయన అభివర్ణించారు. ఈ విధ్వంసక చర్యలకు పాల్పడుతున్న వారిపై ప్రభుత్వం వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా, గుంటూరు జిల్లా పెనుమాకలో శనివారం తీవ్ర ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. భూములివ్వని రైతులపై చంద్రబాబు ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని, ఇందులో భాగంగానే ఇటీవల అధికారుల చేత రైతుల పొలాల్లోకి నీళ్లు వదిలించారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో నష్టపోయిన పొలాలను పరిశీలించేందుకు వెళ్లిన 'రైతు పరిరక్షణ కమిటీ' నేతలపై టీడీపీ శ్రేణులు రాళ్లు, కర్రలతో ఒక్కసారిగా దాడికి తెగబడ్డాయి. ఈ దాడిలో రైతు పరిరక్షణ కమిటీ నేతల వాహనాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ముఖ్యంగా దళిత సామాజికవర్గానికి చెందిన వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్ వాహనాన్ని టార్గెట్ చేస్తూ రాళ్లు, కర్రలతో దాడి చేయడంతో ఆ కారు పూర్తిగా ధ్వంసమైంది. ఈ ఘటనతో పెనుమాక ప్రాంతంలో అదనపు బలగాలను మోహరించారు. నిందితులపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ నేతలు డిమాండ్ చేస్తున్నారు.

# కిట్స్ వరంగల్‌లో జాతీయ స్థాయి 'వరంగల్ కౌశల్ మహోత్సవ్' ప్రారంభం

**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ జూన్ 27 (ప్రజా వీక్షణం న్యూస్)**

కిట్స్ వరంగల్‌లో జాతీయ స్థాయి 'వరంగల్ కౌశల్ మహోత్సవ్' శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. నేషనల్ స్కిల్ డెవలప్ మెంట్ కౌన్సిల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమా న్ని ఎమ్మెల్యేలు కె.ఆర్. నాగరాజు, నాయిని రాజేంద ర్ రెడ్డి ప్రారంభించారు. యువత ఉపాధి కోసం నైపుణ్యాలు, ఏఐ పరిజ్ఞానం, సృజనాత్మకత పెంపొందిం చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో 101 కంపె నీలు పాల్గొనగా, 6,000 ఉద్యోగ అవకాశాలు కల్పించ నున్నట్లు నిర్వాహకులు తెలిపారు. తెలంగాణ నలు మూలల నుంచి 7,000 మందికి పైగా విద్యార్థులు, ఉద్యోగార్థులు పాల్గొన్నారు.




# బీఆర్ఎస్ ఆరోపణలు అవాస్తవం

## ఇనగాల వెంకట్రామ్ రెడ్డి

**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ జూన్ 27 (ప్రజా వీక్షణం న్యూస్)**

బీఆర్ఎస్ నేతలు కాంగ్రెస్ ప్రభుత్వం, కుడాపై చేస్తున్న ఆరోపణలు పూర్తిగా నిరాధారమని హనుమకొండ డీసీసీ అధ్యక్షుడు, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి అన్నారు. కుడా భూములపై మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ చేస్తున్న వ్యాఖ్యలను ఖండిస్తూ, ఆధారాలతో చర్చకు రావా లని సవాల్ విసిరారు. కాంగ్రె స్ ప్రభుత్వం కుడాకు 225 ఎకరాల భూములు కేటా యించి రూ.500 కోట్ల ఆదా య వనరులు కల్పించిందని తెలిపారు. గత బీఆర్ఎస్ పాలనలో కుడా నిధుల దుర్వినియోగం జరిగిందని ఆరోపిస్తూ, నగర అభివృద్ధిని అడ్డుకునే రాజకీయాలు మానుకోవాలని బీఆర్ఎస్ నాయకులకు సూచించారు.




# పల్స్ పోలియో కార్య క్రమాన్ని విజయవంతం చేయాలి

## - కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి

**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ జూన్ 27 (ప్రజా వీక్షణం న్యూస్)**




ఈ నెల 28, 29, 30 తేదీల్లో నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమంలో ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయిం చాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి పిలుపునిచ్చారు. జిల్లాలో 84,301 మంది చిన్నారులకు వ్యాక్సిన్ అందించేందుకు 460 పోలియో బూత్‌లు, 27 మొబైల్ బృందాలు, 12 ట్రాన్సిట్ బృందాలు, 27 పర్యవేక్షణ బృందాలు ఏర్పాటు చేసి 1,804 మంది సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. మొదటి రోజు బూత్‌లలో, అనంతరం ఇంటింటికీ వెళ్లి మిగిలిన చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తామని, ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని కోరారు..


# కౌకుంట్ల మండల కేంద్రానికి నూతన ఎమ్మార్వో కార్యాలయం మంజూరు

## - ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి కృషి ఫలితం..

**దేవరకద్ర జూన్ 27 ప్రజా విక్షణం**



నియోజకవర్గ పరిధిలో కౌకుంట్ల మండల కేంద్రానికి నూతన ఎమ్మార్వో కార్యాలయ భవనం మంజూరు అయినది. ఈ ఉత్తర్వులు ప్రభుత్వము శనివారము విడుదల చేసింది. స్థానిక ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి నిరంతర కృషి ఫలితంగా కౌకుంట్ల మండల కేంద్రానికి నూతన ఎమ్మార్వో (తహసీల్దార్) కార్యాలయ భవనం మంజూరైంది. దీంతో మండల ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత సౌకర్యవంతంగా అందుబాటులోకి రానున్నాయి. ప్రస్తుతం ఉన్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, ప్రజలకు మెరుగైన పరిపాలనా సేవలు అందించాలనే ఉద్దేశంతో ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి, ప్రభుత్వ దృష్టికి ఈ అవసరాన్ని తీసుకెళ్లి, కార్యాలయ భవనం మంజూరుకు ప్రత్యేకంగా కృషి చేశారు. ఈ సందర్భంగా కౌకుంట్ల మండల ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ, మండల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ కౌకుంట్ల మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని, ప్రజలకు అవసరమైన ప్రభుత్వ మౌలిక సదుపాయాలను దశలవారీగా కల్పిస్తూ, అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగవంతం చేస్తామని పేర్కొన్నారు. ప్రజలకు నాణ్యమైన ప్రభుత్వ సేవలు అందేలా ప్రతి అంశంపై నిరంతరం కృషి కొనసాగిస్తామని తెలిపారు.



GOVERNMENT OF TELANGANA
ABSTRACT

Revenue (DA. CMRF) Department – Construction of new office buildings of RDO offices (10) and Tahsildar Offices (107) which are located in rented/ dilapidated condition buildings – Administrative sanction for an amount of Rs.263.25 Crores – Orders – Issued.

REVENUE (DA. CMRF) DEPARTMENT

G.O.Rt.No.375 Dated:25.06.2026

Read the following:-

1.From the CCLA., TG, Hyderabad, Lr.No.Budget/ 3507093/ 2026, dated 21.01.2026.
2.From the CCLA., TG, Hyderabad, Lr.No.Budget /3507093/ 2026, dated 10.03.2026

****

ORDER:

In the circumstances reported by the Chief Commissioner of Land Administration, Telangana, Hyderabad in the references read above, Government hereby accord administrative sanction for an amount of Rs.263.25 Crores (Rupees Two Hundred and Sixty Three Crores and Twenty five Lakhs only) for Construction of new office buildings of RDO offices (10) and Tahsildar Offices (107) (List Enclosed), which are located in rented/ dilapidated condition buildings in Telangana State, at the rate of Rs.2.25 Crores (Rupees Two Crores Twenty Five Lakhs only), per each building under Head of Account 4070-800-25(08) Construction of Revenue Buildings – 530/531. The work is entrusted to Telangana Housing Corporation Limited, Hyderabad.

2. The Chief Commissioner of Land Administration, Telangana, Hyderabad is requested to take necessary action in the matter.

3. This order issues with the concurrence of Finance (EBS.VII) Department, vide their U.O.No.474/110/A1/EBS.VII/2026, dated 23.04.2026.

(BY ORDER AND IN THE NAME OF THE GOVERNOR OF TELANGANA)

LOKESH KUMAR D.S.
SECRETARY TO GOVERNMENT

To
The Chief Commissioner of Land Administration, Telangana,Hyderabad
The Telangana Housing Corporation Ltd., Hyd.
Copy to:
The Finance (EBS.VII) Department.
SC / SF

// Forwarded by order //



ANNEXURE
G.O.Rt.No.375 Revenue (DA.CMRF) Department Dated: 25-06-2026

| Name of the District | RDO Office | TDR Office |
|---|---|---|
| Adilabad | | Utnoor |
| | | Sonala |
| | | Bhoraj |
| | | Sathnala |
| Bhadradri Kothagudem | | Ashwaraopeta |
| | | Manuguru |
| | | Chadrugonda |
| | | Tekulapally |
| | | Laxmidevipally |
| Hanumakonda | | Athmakur |
| | | Shayampet |
| | | Kazipet |
| Jagtial | Jagtial | Endapalli |
| | Metpally | Bheemaram |
| Jangaon | | Ghanpur |
| | | Chipur |
| | | Tharigoppula |
| Jayashankar bhoopalpally | | |
| Jogulamba-Gadwal | Gadwal | Undavalli |
| | | Rajoli |
| Kamareddy | | Domakonda |
| | | Yellareddy |
| | | Nagireddypet |
| | | Madnoor |
| | | Pitlam |
| Karimnagar | | Gannerruvaram |
| | | Ellandakunta |
| Khammam | | Tirumalayapalem |
| | | Singareni |
| | | Madhira |
| | | Mudigonda |
| KumuramBheemAsifabad | Kagaznagar | Wankidi |
| | Asifabad | Lingapur |
| | | Tiryani |
| | | Kerameri |
| | | Koutala |
| | | Chintalamanepally |
| | | Penchikalpet |
| Mahabubabad | | Danthalapalli |
| | | Inguriti |
| | | Seerole |
| Mahabubnagar | | Rajapur |
| | | Mohammedabad |
| | | Koukuntla |
| | | Kolkonda |
| Mancherial | Mancherial | Dandepalli |
| | | Kothapalli |
| | | Bheemaram |
| | | Nennel |
| | | Kanepalli |
| Medak | | Gahnpur |
| | | Chillpched |
| | | Nizampet |
| Medchal-Malkajgiri | Malkajgiri | |
| Mulugu | | Mulugu |
| | | Mallampally |
| NagarKurnool | | Koder |

# విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

## - తాడేపల్లిగూడెం ఆర్డీవో సూర్యారావు

**తాడేపల్లిగూడెం ప్రతినిది, జూన్ 27 (ప్రజా వీక్షణం)**

విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆర్డిఓ ఎం సూర్యారావు తెలిపారు. తాడేపల్లిగూడెం పురపాలక సంఘం ఆధ్వర్యంలో విభిన్న ప్రతిభావంతుల కోసం ప్రత్యేక పబ్లిక్ గ్రీవెన్స్ కార్యక్రమాన్ని స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యారావు మాట్లాడుతూ పింఛన్లు, రైల్వే బస్ పాస్‌లు, ఉపకరణాలు, సదరం సర్టిఫికెట్లు, ఉపాధి అవకాశాలు వంటి అన్ని సమస్యలను ఈ ప్రత్యేక గ్రీవెన్స్ ద్వారా వేగంగా పరిష్కరిస్తామని వివరించారు. పురపాలక సంఘ కమిషనర్ ఎం.ఏసుబాబు మాట్లాడుతూ పురపాలక సంఘం పరిధిలో ఉన్న విభిన్న ప్రతిభావంతులందరినీ గుర్తించి, వారికి అర్హత ఉన్న అన్ని పథకాలను అందిస్తామని చెప్పారు. కార్యాలయానికి రాలేని వారి కోసం సచివాలయాల ద్వారా అర్జీలు సేకరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం ద్వారా 40 మందికి పైగా విభిన్న ప్రతిభావంతులు తమ తల్లిదండ్రులతో హాజరై అర్జీలు సమర్పించారని తెలిపారు. వీల్‌చైర్లు, ట్రైసైకిళు ,, పెన్షన్ మంజూరు, ఆధార్–సదరం అనుసంధానం వంటి సమస్యలపై అర్జీలు ఇచ్చారని వివరించారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ రవి సుధాకర్, మున్సిపల్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, రెవెన్యూ, వైద్య ఆరోగ్య శాఖ, సచివాలయ సిబ్బంది సిబ్బంది పాల్గొన్నారు.



## గిరిజన ఆశ్రమ పాఠశాలల క్లాసుల కుదింపును వెనక్కి తీసుకోవాలి: పీడీఎస్‌యూ

**ఏలూరు, జూన్ 27: (ప్రజా వీక్షణం)**

పశ్చిమ ఏజెన్సీ పరిధిలోని గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో తరగతుల కుదింపు నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) జిల్లా అధ్యక్షుడు కాకి నాని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక పీడీఎస్‌యూ కార్యాలయంలో నిర్వహించిన పత్రికా సమావేశంలో ఆయన మాట్లాడారు. లంకపాకల, పులిరాములగూడెం, రెడ్డికోపల్లి, రెడ్డికుంకాల గ్రామాల్లోని ఆశ్రమ పాఠశాలల్లో తరగతులను కుదించడం వల్ల గిరిజన విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై గత 15 రోజులుగా తల్లిదండ్రులు, విద్యార్థులు ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడం దారుణమన్నారు. జీవో నెంబర్ 1 ప్రకారం స్కూళ్ల పేర్లలో 'గ్లోబల్, ఇంటర్నేషనల్, టెక్నో' లాంటి పదాలు వాడకూడదనే నిబంధన ఉన్నప్పటికీ, జిల్లాలో ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల అక్రమాలను అరికట్టడంలో విద్యాశాఖ అధికారులు పూర్తిగా విఫలమయ్యారని (పీడీఎస్‌యూ) జిల్లా అధ్యక్షుడు కాకి నాని విమర్శించారు.




## విద్యతోనే ఉజ్వల భవిష్యత్

### - తెదేపా రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి గొర్రెల శ్రీధర్

**తాడేపల్లిగూడెం ప్రతినిధి, జూన్ 27 (ప్రజా వీక్షణం)**

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు సొంతమవుతుందని తెదేపా రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి గొర్రెల శ్రీధర్ అన్నారు. స్థానిక మాగంటి అన్నపూర్ణాదేవి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివి పదో తరగతి పరీక్ష ఫలితాల్లో అద్భుత ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు శనివారం సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ గొర్రెల శ్రీధర్, ఉప విద్యాశాఖ అధికారి తాడేపల్లిగూడెం డివిజన్ కెవిఎస్ రామాంజనేయులు, ఎంఈవో 2 పీఎంకే.జ్యోతి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించే ఇటువంటి కార్యక్రమాలు మరింత మందికి స్ఫూర్తినిస్తాయని పేర్కొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి సహకరించిన ప్రతి దాతకు, అతిథులకు, ఉపాధ్యాయులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం పదో తరగతిలో పి.అనంతలక్ష్మి ప్రథమ, ఆర్.ఆకాంక్ష ద్వితీయ, సిహెచ్.మీనాక్షి తృతీయ స్థానాలు సాధించగా, టి. జైశ్రీ, సిహెచ్. కృష్ణవేణి ఎన్.ఎం.ఎం.ఎస్.లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు. తెదేపా యూనిట్ ఇన్‌చార్జ్ వర్రీ వాసు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు రూ.10,000 నగదు బహుమతిని అందజేశారు. ప్రధానోపాధ్యాయులు స్కూల్ కమిటీ నుంచి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలతో పాటు ఎన్ఎంఎంఎస్ విద్యార్థులకు సుమారు రూ.7,500 నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. కాకరపర్తి మురళి 500కు పైగా మార్కులు సాధించిన 16 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.500 చొప్పున మొత్తం రూ.10,000 నగదు బహుమతిని అందజేశారు. మహిళా గోయెంకా ఉమెన్స్ కాలేజ్ ప్రిన్సిపాల్ గణపతిరావు ప్రథమ స్థానం సాధించిన విద్యార్థికి రూ.1,000 నగదు బహుమతిని అందించారు. అనంతరం దాతలు, అతిథులను శాలువాలు, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు. విద్యార్థులకు గొర్రెల లక్ష్మీనారాయణ ఫౌండేషన్ వారి సహకారంతో 260 డైరీలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సేవా సంకల్ప్ ఆర్గనైజేషన్ స్థాపకురాలు, అధ్యక్షురాలు శ్రీలీల,18 వార్డ్ ఇంచార్జ్ భాస్కర్ రెడ్డి, మానేపల్లి భార్గవ్, రామకృష్ణ, కాకరపర్తి మురళి,, వరి వాసు, మహిళా గోయింకా ఉమెన్స్ కాలేజ్ ప్రిన్సిపాల్ గణపతిరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.








# ప్రకృతికీ ప్రతిరూపమే - ఏరువాక..

### - దండు మోహన్ బాబు.. ఓయూ ఉస్మానియా విశ్వవిద్యాలయం.. పరిశోధకుడు

**దేవరకద్ర జూన్ 27 ప్రజా వి క్షణం**

అన్నదాత.... సుఖీభవ!, రైతే రాజు, రైతు లేనిదే రాజ్యం లేదు, జై కిసాన్ లాంటి నినాదాలతో రైతులను ప్రశంసిస్తుంటాం. అని ఓయూ ఉస్మానియా విశ్వవిద్యాలయం పరిశోధకుడు పాలమూరు జిల్లా దండు మోహన్ బాబు అన్నారు. ఏరువాక పౌర్ణమి గురించి కొన్ని విషయాలను ఆయన శనివారము ప్రజా విక్షణం విలేకరికి తెలిపారు. వ్యవసాయ పనులు ప్రారంభ సమయం నుండి పంట పండే వరకు ఆరుగాలం పాటు ప్రకృతితో పడగాపు పడే ఏకైక వ్యక్తి రైతు. ఆది కాలము నుండి వ్యవసాయ ప్రధానమైన మన దేశంలో హిందూ సంప్రదాయ ప్రకారం సాగు పనులను రైతులు ఏరువాక పున్నమి / జ్యేష్ఠ శుద్ధ పూర్ణిమ సందర్భంగా జ్యేష్ఠ నక్షత్రం శ్రేష్టము కనుక ఈ రోజున ఎడ్లను, నాగలిని, వ్యవసాయ పరికరాలను పరిశుభ్రంగా అలంకరించి ఉషః కాలయందు ప్రకృతిలో పుడమితల్లి పూజతో పొలము దున్ని విత్తనాలు చల్లడంతో పంట ప్రారంభమయ్యేదని ఋగ్వేదం ద్వారా తెలుస్తుంది. ఈ పండుగ వర్షాకాల శుభసూచకంగా రైతులు పేర్కొంటారు. ఈ పండుగ విశిష్ట అర్థం ఏరు అంటే నాగలి, ఏరువాక అంటే దుక్కి కి ప్రారంభ దినము. ఈ పున్నమి నుండి విత్తనాలు వేసేదాకా ఉన్న సమయాన్ని ముంగారు అంటారు. ఈరోజు ప్రకృతి దేవుళ్ళైన సూర్యచంద్రులను పూజిస్తే తమ పంట పొలాలను కాపాడుతారని జానపదుల నమ్మకం. సంస్కృత సాహిత్యంలో ఉద్వృషభ యజ్ఞంగా, తెలుగుసీమలో ఏరువాకగా, కన్నడ సాహిత్యంలో కారణి పబ్బగా వివిధ పేర్లతో ఈ పండుగను పిలుస్తారు. నేటికీ గ్రామీణ ప్రాంత నేపథ్యంలో రైతులందరూ గోధూళి వేళలో (సంధ్యాకాల సమయం) గుమ్మాలకు తోరణాలు కట్టి చర్నాకోలతో త్రాడు తెంపే సంప్రదాయంతో పాటు, దేవాలయాల చుట్టూ డప్పు,డోలు వాయిద్యాలతో ఎడ్లబండ్ల ప్రదక్షణ కార్యక్రమాలు జరుపుతూ, వర్షానికి ఆధిదేవత అయిన ఇంద్రుని పూజిస్తూ, నైవేద్యాలను సమర్పించే ఆనవాయితీ చూడవచ్చు. సాహిత్య గ్రంథాలను పరిశీలిస్తే ఈ పండుగ విశిష్టత – విష్ణు పురాణంలో సీతా యజ్ఞంగా. శాతవాహన రాజకవిగా పేరుగాంచిన హాలుడు రాసిన గాథాసప్తశతిలో ఏరువాక కథల ప్రాచుర్యం, 6వ శతాబ్ది కాలంలో వరహామిహిరుడు రచించిన బృహత్ సంహితలో ఏరువాక ఉదంతం, 12వ శతాబ్దంలో శైవ కవిగా పేరుగాంచిన పాల్కురికి చివరి కృతి పండితారాధ్యచరిత్ర అనే ద్విపద కావ్యంలో దవన పున్నమగా /ఏరువాక ప్రస్తావనలు కనిపిస్తున్నాయి. అన్నదానమే సకల దానములలో ఉత్తమము అని అనంతమాత్యుడు భోజరాజీయం కావ్యంలో రైతులను



ప్రశంసించిన తిరు అద్భుతం. దేశ సౌభాగ్యానికి పునాదిరాళ్లు, సాగుదారులైన రైతులకు దళారీల ధరల వ్యవస్థ నుంచి విముక్తి కల్పించాల్సిన అవసరం ఉంది, పచ్చని పంట పొలాలను, జై కిసాన్ నినాదంతో రైతుల్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రస్తుత తరుణంలో ఉంది.

# ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల రాజ్యాధికారమే లక్ష్యం భువనగిరి సభకు తరలిరావాలని పిలుపు

### - కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో 'రాజ్యాధికార సమరభేరి' సభ పోస్టర్ ఆవిష్కరించిన..

### - రాష్ట్ర కార్యదర్శి కొమ్ముల ప్రవీణ్ రాజ్ ..





**సిర్పూర్ కాగజ్ నగర్ ప్రతినిధి: జూన్ 27 (ప్రజా వీ క్షణం న్యూస్)**

కుమురం భీమ్ ఆసిఫాబాద్, తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్‌పీ) ఆధ్వర్యంలో జరగనున్న "రాజ్యాధికార సమరభేరి" బహిరంగ సభను జయప్రదం చేయాలని, ఈ సభకు బహుజన వర్గాలు భారీగా తరలి రావాలని పార్టీ రాష్ట్ర కార్యదర్శి మరియు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇంచార్జ్ కొమ్ముల ప్రవీణ్ రాజ్ పిలుపునిచ్చారు. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో శనివారం జరిగిన కార్యక్రమంలో భాగంగా, జిల్లా అధ్యక్షులు గాడిపల్లి వెంకటేశ్వర్లు, ఆధ్వర్యంలో సమరభేరి సభకు సంబంధించిన పోస్టర్లను కొమ్ముల ప్రవీణ్ రాజ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ , దశాబ్దాలుగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు కేవలం ఓటు బ్యాంకుగానే మిగిలిపోయారు. వారి బతుకులు మారాలంటే రాజ్యాధికారం దక్కాలి. రాజ్యాధికార సమరభేరి సభ, అణగారిన వర్గాల ఆత్మగౌరవాన్ని చాటిచెప్పే చారిత్రాత్మక ఘట్టం కానుంది అని అన్నారు. రాష్ట్ర పాలనలో సామాజిక న్యాయం జరగాలంటే బహుజనులంతా ఏకం కావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బిక్షపతి, పార్టీ నాయకులు రమేష్, హనుమంతు, ఇతర ముఖ్య నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# ఏలూరులో జులై 3 నుంచి రైతు సంఘం రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలని బి. బలరాం పిలుపు

**టి. నరసాపురం:జూన్ 27(ప్రజా వీక్షణం)**

ఏలూరులో జులై 3, 4, 5 తేదీల్లో జరగనున్న ఏపీ రైతు సంఘం 23వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఏపీ కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బి. బలరాం పిలుపు నిచ్చారు. శనివారం మండలంలోని అల్లూరి సీతారామరాజు నగర్‌లో రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జూలై 3న ఏలూరులో అన్ని రకాల పంటలు పండించే రైతులతో భారీ ప్రదర్శన, కలెక్టరేట్ వద్ద మహాసభ ఉంటాయని, 4, 5 తేదీల్లో ప్రతినిధుల సభలు జరుగుతాయని తెలిపారు. పెట్టుబడులు పెరిగినా పంటలకు సరైన ధరలు రావడం లేదని, అన్ని పంటలకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్, ఎరువులు, పురుగుమందులు, రొయ్యల మేత ధరలను, విద్యుత్ ఛార్జీలను వెంటనే తగ్గించాలి. ఉచిత విద్యుత్‌కు ఎసరు పెట్టేలా మోటార్లకు స్మార్ట్ మీటర్లు బిగించే ప్రయత్నాలను ప్రభుత్వం విరమించుకోవాలి. అంతేకాకుండా పొలాల బాటలు నిర్మించాలని, పోలవరం నిర్వాసితుల సమస్యలు తీర్చాలని, చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేయాలని మరియు కొల్లేరు ప్రజల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ మహాసభల్లో 500 సంఘాలను




ఏకతాటిపైకి తెచ్చిన అఖిల భారత కిసాన్, రైతు సంఘం రాష్ట్ర నాయకులు పాల్గొంటారని బలరాం పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు పిల్లి రామకృష్ణ, గుడెల్లి వెంకట్రావు, మడకం కుమారి, శిరీష తదితరులు పాల్గొన్నారు.

# బస్వాపూర్ గ్రామ శివారులో చిరుత సంచారం

### - మేకను ఎత్తుకెళ్లిందంటున్న గ్రామస్థులు

**నిజామాబాద్,జూన్ 27 (ప్రజా వీక్షణం)**

జుక్కల్ మండల పరిధిలోని బస్వాపూర్ గ్రామ శివారులో చిరుత సంచారం కలకలం రేపింది. గ్రామ శివారులో మేత మేస్తున్న గొర్రెల గుంపులోకి వచ్చిన చిరుత.. ఓ మేకపిల్లను ఎత్తుకెళ్లినట్లు గ్రామస్థులు తెలిపారు. ఈ ఘటనతో అప్రమత్తమైన స్థానికులు వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఫారెస్ట్ అధికారులు అక్కడ కనిపించిన అడుగుజాడలను పరిశీలించి అవి చిరుత పాదాలేనని నిర్ధారించారు. ఈ నేపథ్యంలో రైతులు, పశువుల కాపరులు, గ్రామ ప్రజలు ఒంటరిగా పొలాలు, అటవీ ప్రాంతాలకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో అప్రమత్తంగా ఉండాలని, చిరుత కనిపించినా లేదా ఆనవాళ్లు గుర్తించినా వెంటనే అటవీ శాఖకు సమాచారం ఇవ్వాలని కోరారు. గ్రామ పరిసరాల్లో చిరుత సంచారం నేపథ్యంలో స్థానికుల్లో ఆందోళన నెలకొంది. అటవీ శాఖ అధికారులు పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, అవసరమైతే చిరుతను బంధించేందుకు తగిన చర్యలు చేపడతామని తెలిపారు.

ప్రజావీక్షణం
దినపత్రిక

# మున్నూరు కాపు సంఘ భవనానికి స్థలం కేటాయించాలని

## ఆత్రం సుగుణక్కకు వినతి...

**సిర్పూర్ కాగజనగర్ ప్రతినిధి: జూన్ 27**

**(ప్రజావీ క్షణం న్యూస్)**

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్కను ఆసిఫాబాద్ పట్టణ మున్నూరు కాపు సంఘం కార్యవర్గ సభ్యులు, కులబాంధవులు డీసీసీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పలు సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఏర్పడి ఎన్నో సంవత్సరాలు గడిచినా అన్ని కుల సంఘాలకు సంఘ భవనాలు ఉన్నప్పటికీ మున్నూరు కాపు సంఘానికి ఇప్పటికీ సొంత భవనం లేకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఆసిఫాబాద్ పట్టణంలో 5 వేల మందికి పైగా మున్నూరు కాపు సామాజిక వర్గానికి చెందిన ప్రజలు నివసిస్తున్నప్పటికీ తమ సంఘానికి భవనం ఏర్పాటు చేయలేదని వివరించారు. మున్నూరు కాపు సంఘ భవన నిర్మాణం కోసం 10 గుంటల స్థలాన్ని కేటాయించి, భవన నిర్మాణానికి ప్రత్యేక చొరవ తీసుకోవాలని డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్కను కోరారు. అదేవిధంగా, తమ సంప్రదాయ వృత్తి వ్యవసాయాన్ని గుర్తిస్తూ జిల్లా కేంద్రంలోని ప్రధాన చౌరస్తాల్లో ఒకదానికి “కిసాన్ చౌక్“గా నామకరణం చేయాలని వినతిపత్రంలో అభ్యర్థించారు. ఈ అంశాలపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని మున్నూరు కాపు సంఘం ప్రతినిధులు ఆత్రం సుగుణక్కను కోరగా, సమస్యలను పరిశీలించి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం ముఖ్య సలహాదారులు అనిశెట్టి సదాశివ్, పట్టణ అధ్యక్షులు డెగల సత్య



నారాయణ, ప్రధాన కార్యదర్శి వోరగంటి సంతోష్ కుమార్, కోశాధికారి గోనే వినేష్,గౌరవ మహిళ అధ్యక్షులు కొండు భారతి, గౌరవ అధ్యక్షులు గడ్డల వెంకటేశం, సైదం రవి ఉపాధ్యక్షులు , తుపాకుల సాయి ప్రసాద్,పుట్ట వెంకటేశ్వర్ సలహాదారులు బోరింగాం సీతారాం, తాటిపల్లి సుభాష్, జాపతి రమేష్, రెగుల బాలేష్,కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాద వేణి మల్లేష్, కార్యదర్శి నాంపల్లి శంకర్,సీనియర్ నాయకులు గుర్నూలే మెంగాజీ, యువజన కాంగ్రెస్ కోఆర్డినేటర్ ఏలగల సాయికుమార్,శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ఉండవల్లి ఘటన ప్రజాస్వామ్యంపై టీడీపీ దాడికి నిదర్శనం

## - వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వడ్డి రఘురాం నాయుడు

**తాడేపల్లిగూడెం ప్రతినిది జూన్ 27**

**(ప్రజా వీక్షణం)**

అమరావతిలోని ఉండవల్లిలో వైఎస్సార్‌సీపీ నాయకులు, సీఆర్డీయే రైతు పరిరక్షణ కమిటీ ప్రతినిధులుపై టీడీపీ కార్యకర్తలు దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నానని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త వడ్డీ రఘురాం నాయుడు శనివారం తెలిపారు. రైతు సమస్యలపై మాట్లాడేందుకు వెళ్లిన ప్రతిపక్ష నాయకులపై రాళ్లు, కోడిగుడ్లతో దాడులు చేయడం టీడీపీ గూండాయిజ రాజకీయాలకు నిదర్శన మని ఎద్దేవా చేశారు. వైఎస్సార్‌సీపీ బృందం రైతుల ఆహ్వానం మేరకే పెనుమాక ప్రాంతానికి వెళ్లిందని, రైతుల సమస్యలను తెలుసుకుని వారికి అండగా నిలవడమే ఆ పర్యటన ఉద్దేశమని చెప్పారు. రైతుల గోడు వినిపించకుండా దాడులతో భయ భ్రాంతులకు గురి చేయాలని టీడీపీ ప్రయత్నించడం అత్యంత దుర్మార్గమని మండిపడ్డారు. దాడిలో పలువురు వైసీపీ నాయకుల వాహనాలు ధ్వంస మయ్యాయని,ఇది ముందస్తు ప్రణాళికతో చేసిన దాడేనని స్పష్టంగా కనిపిస్తుందన్నారు. శాంతి భద్రతలు కాపాడాల్సిన పోలీసులపైనా దాడి చేసి గాయపరచడం టీడీపీ గూండాయిజానికి నిదర్శనమని తెలిపారు. .చట్టాన్ని చేతుల్లోకి తీసుకున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బలవంతపు భూసేకరణకు వ్యతిరేకంగా కొన్ని రోజులుగా ఉద్యమిస్తున్న పెనుమాక రైతుల ఆవేదనను ప్రభుత్వం పూర్తిగా విస్మరిస్తోందని, భూములు ఇవ్వడానికి నిరాకరించిన రైతులను బెదిరించడం, వేధించడం, వారి భూముల చుట్టూ మట్టి తవ్వేసి వ్యవసాయం చేయకుండా అడ్డుకోవడం అత్యంత అమానుషమని ఆగ్రహం వ్యక్తంచేశారు. వైఎస్సార్‌సీపీ బృందంపైనే దాడి జరగడం వెనుక ప్రభుత్వ కుట్ర స్పష్టంగా కనిపిస్తోందని తెలిపారు. ప్రజల సమస్యలను ప్రస్తా వించే ప్రతిపక్షాన్ని అణచివేయాలనే ధోరణిని ప్రజలు ఎప్పటికీ అంగీ కరించరని చెప్పారు. అధికార పార్టీకి చెందిన కొందరు నాయకులు గూండాలను ప్రోత్సహిస్తూ ప్రజా స్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని మండిపడ్డారు..దాడికి పాల్పడిన టీడీపీ కార్యకర్తలు, కుట్రదారులను వెంటనే గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని



పోలీసు శాఖను డిమాండ్ చేస్తున్నామన్నారు. రైతుల హక్కుల పరిరక్షణ కోసం వైఎస్సార్‌సీపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, ఎన్ని దాడులు, బెదిరింపులు చేసినా రైతుల పక్షాన మా పోరాటం ఆగదని వివరించారు.

# పోలవరం నిర్వాసిత పెళ్లైన ఆడబిడ్డలకు న్యాయం చేయాలి

## తహసీల్దార్ కార్యాలయం ఎదుట భారీ ధర్నా

**పోలవరం జూన్ 27 (ప్రజా వీక్షణం )**

పోలవరం ముంపు ప్రాంతానికి చెందిన పెళ్లైన ఆడబిడ్డలకు పునరావాస ప్యాకేజీ అందించాలని డిమాండ్ చేస్తూ శనివారం పోలవరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట బాధిత మహిళలు భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ, ప్యాకేజీ కోసం దరఖాస్తు చేసుకున్న సుమారు 375 మందిలో కేవలం 40 మందికే నోటీసులు జారీ చేసి విచారణకు పిలవడం సరైన విధానం కాదని ఆవేదన వ్యక్తం చేశారు. మిగిలిన అర్హులైన మహిళలను కూడా విచారణకు పిలిచి, అందరికీ సమానంగా న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. అర్హత ఉన్న ప్రతి పెళ్లైన ఆడబిడ్డకు పునరావాస ప్యాకేజీ మంజూరు చేయాలని, ఈ విషయంలో ఐటీడీఏ అధికారులు, రెవెన్యూ అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఆడబిడ్డల పట్ల వివక్ష చూపకుండా అందరికీ సమాన న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ధర్నాలో పాల్గొన్న మహిళలు నినాదాలు చేస్తూ తమకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. తమ సమస్యను అధికారులు వెంటనే పరిష్కరించకపోతే భవిష్యత్తులో మరింత ఉధృతంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.





# శీలం వెంకటేశ్వరరావు, శీలం సాయి వినయ్ ఆధ్వర్యంలో నేడు వెలగపాడులో ‘పల్స్ పోలియో’ కార్యక్రమం

**వెలగపాడు, జూన్ 27:(ప్రజా వీక్షణం)**

ఏలూరు జిల్లా టీ. నర్సాపురం మండలం వెలగపాడు పంచాయతీ పరిధిలో నేడు (ఆదివారం) ఉదయం 7.00 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు పల్స్ పోలియో చుక్కల కార్యక్రమం నిర్వహించనున్నట్లు హెల్త్ డిపార్ట్మెంట్ సిబ్బంది తెలిపారు. తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు శీలం వెంకటేశ్వరరావు మరియు మల్లుకుంట్ల సొసైటీ చైర్మన్ శీలం సాయి వినయ్ ప్రత్యేక ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరగనుంది.






**ముఖ్య సమాచారం ప్రకారం :**

కేంద్రాలు: వీరభద్రవరం సచివాలయం మరియు వెలగపాడు స్కూల్.
సమయం: ఉదయం 7:00 గంటల నుండి సాయంత్రం 5:00 గంటల వరకు.
వయోపరిమితి: అప్పుడే పుట్టిన పిల్లల దగ్గర నుండి ఐదు సంవత్సరాల లోపు పిల్లలందరికీ. తప్పనిసరి గమనిక: పోలియో చుక్కల కేంద్రానికి వచ్చేటప్పుడు ప్రతి చిన్నారి యొక్క ఆధార్ కార్డు మరియు ఫోన్ నెంబరు తప్పకుండా తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో వెలగపాడు హెల్త్ డిపార్ట్మెంట్ సిబ్బంది అయిన సరదా (సి హెచ్ వో ), పార్వతి (ఏ ఎన్ ఎం ), మరియు ఆశా వర్కర్లు నాగేశ్వరి, జ్యోతి తదితరులు పాల్గొని పిల్లలకి పోలియో చుక్కలు వేయనున్నారు. వెలగపాడు పంచాయతీలోని ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, అలాగే ఈ సమాచారాన్ని పొరుగువారికి కూడా తెలియజేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నాయకులు శీలం వెంకటేశ్వరరావు మరియు శీలం సాయి వినయ్ పిలుపునిచ్చారు.

# పోలియో రహిత భారతదేశమే మన లక్ష్యం

## - జనసేన పార్టీ నాయకులు ఏఎంసీ డైరెక్టర్ జట్లా సత్యనారాయణ పిలుపు

**టీ. నర్సాపురం మండలం : జూన్ 27(ప్రజా వీక్షణం)**



“నిండు జీవితానికి రెండు చుక్కలు“ అనే నినాదంతో నేడు (జూన్ 28, ఆదివారం) దేశవ్యాప్తంగా పల్స్ పోలియో కార్యక్రమాన్ని భారీ ఎత్తున నిర్వహించనున్నట్లు ఏలూరు జిల్లా టీ. నర్సాపురం మండలం జనసేన పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులు ఏఎంసీ డైరెక్టర్ జట్లా సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ, పుట్టిన శిశువుల నుండి 5 ఏళ్ల లోపు పిల్లలందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమానికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి:
తేది: జూన్ 28, 2026 (ఆదివారం)
సమయం: ఉదయం 7:00 గంటల నుండి సాయంత్రం 6:00 గంటల వరకు
వేదికలు: మీ సమీప ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు మరియు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పోలియో బూత్‌లు.

“భారతదేశాన్ని పోలియో రహిత దేశంగా నిలబెట్టడం మనందరి బాధ్యత. గతంలో పోలియో చుక్కలు వేయించినప్పటికీ, రేపు జరిగే కార్యక్రమంలో ఐదేళ్ల లోపు పిల్లలందరికీ మళ్లీ తప్పనిసరిగా చుక్కల మందు వేయించాలి. ఒక్క శిశువు ని కూడా విస్మరించబడకూడదు,“ అని జట్లా సత్యనారాయణ స్పష్టం చేశారు.
అలాగే తప్పనిసరిగా తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని, తమ పిల్లల ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు బాటలు వేయాలని ఆయన కోరారు. ఆరోగ్య కార్యకర్తలు, స్వచ్ఛంద సంస్థలు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# పేర్ని నాని వ్యాఖ్యలు అవాస్తవం: ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం మానుకోవాలి

## - రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి తోట లక్ష్మీనారాయణ మండిపాటు

**అమరావతి, జూన్ 27:(ప్రజా వీక్షణం)**



అమరావతి ఘటనపై మాజీ మంత్రి పేర్ని నాని చేసిన వ్యాఖ్యలు పూర్తిగా నిరాధారమైనవని, కేవలం రాజకీయ దురుద్దేశంతో కూడుకున్నవని ఏలూరు జిల్లా టీ నర్సాపురం మండలం తిరుమలదేవిపేట గ్రామ పంచాయతీ కి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి తోట లక్ష్మీనారాయణ తీవ్రంగా ఖండించారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ, వైకాపా నాయకుల తీరుపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. అసలు ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు, నిజానిజాలు ఇంకా బయటకు రాకముందే.. కేవలం రాజకీయ లబ్ధి కోసమే తెలుగుదేశం పార్టీపై నిరాధారమైన ఆరోపణలు చేయడం బాధ్యతారాహిత్యమని లక్ష్మీనారాయణ విమర్శించారు. “ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరికీ శాంతియుతంగా తమ అభిప్రాయాలను వ్యక్తం చేసే హక్కు ఉంది. తెలుగుదేశం పార్టీ ఎప్పుడూ హింసను ప్రోత్సహించదు, హింసకు మద్దతు ఇవ్వదు.“ అని తోట లక్ష్మీనారాయణ, రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి తెలిపారు. వాస్తవాలను వక్రీకరించి రాజకీయ ప్రయోజనం పొందాలని వైకాపా చూస్తోందని, వారి కుయుక్తులను ప్రజలందరూ గమనిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. చట్టం తన పని తాను చేసుకుపోతుందని, నిజాలు త్వరలోనే పూర్తి ఆధారాలతో వెలుగులోకి వస్తాయని ధీమా వ్యక్తం చేశారు. అలాగే రాజకీయ స్వార్థం కోసం అసత్య ప్రచారాలు చేస్తూ, ప్రజలను తప్పుదోవ పట్టించే చౌకబారు ప్రయత్నాలను వైకాపా నాయకులు ఇకనైనా వెంటనే మానుకోవాలని తోట లక్ష్మీనారాయణ ఈ సందర్భంగా హెచ్చరించారు.

# వాసవి క్లబ్ సేవా కార్యక్రమాలకు విశేష స్పందన

**తాడేపల్లిగూడెం ప్రతినిది, జూన్ 27 (ప్రజా వీక్షణం)**

వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ ఆదేశాల మేరకు వాసవి క్లబ్ తాడేపల్లిగూడెం ఆధ్వర్యంలో శనివారం ‘డాన్ టు డస్క్‘ కార్యక్రమంలో భాగంగా పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఇంటర్నేషనల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ వేద మధుసూదన్, ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ మానేపల్లి నాగేశ్వరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా కోడే వెంకట్రావు మున్సిపల్ హైస్కూల్‌కు సిమెంట్ బెంచ్ అందజేయడంతో పాటు వృద్ధాశ్రమానికి ఫస్ట్ ఎయిడ్ కిట్, గోశాలకు పశుగ్రాసం, ప్రతిభావంతులైన విద్యార్థులకు శాలువాలు, నిఘంటువులు, రైటింగ్ ప్యాడ్లు పంపిణీ చేశారు. రక్తదాతల వివరాలను ప్రభుత్వ ఆసుపత్రులు, పీహెచ్‌సీలలో అందుబాటులో ఉంచడంతో పాటు వాసవి క్లబ్‌లో కొత్త సభ్యులను చేర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు ఆలపాటి కృష్ణకుమార్, కార్యదర్శి ముత్తా శ్రీధర్ గుప్తా, పలువురు సభ్యులు పాల్గొన్నారు.



# సెప్టెంబర్ 15 నాటికి తొలి విడత ఇందిరమ్మ ఇళ్లు పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి

**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ జూన్ 27 (ప్రజా వీక్షణం న్యూస్)**

జిల్లాలో తొలి విడతలో మంజూరైన 3,243 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను సెప్టెంబర్ 15 నాటికి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి అధి కారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్లతో పాటు ఉపాధి హామీ, వన మహో త్సవం, స్వచ్ఛ భారత్ మిషన్ కార్యక్రమాలను సమన్వయంతో వేగవంతం చేయాలని సూచించారు. అర్హులైన గుడిసె వాసులను గుర్తించి గృహాలు మంజూరు చేయాలని, నిర్మాణ దశల వారీగా బిల్లులు సకాలంలో చెల్లించి పనులు త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసు కోవాలని అధికారులను ఆదేశించారు.




# అమీనాపూర్‌లో మహిళ, ఇద్దరు పిల్లలతో అదృశ్యం

## - జాగదొరక్కపోవడంతో కటుఉంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు

**నిజామాబాద్,జూన్ 27 (ప్రజా వీక్షణం)**

వేల్పూర్ మండలం అమీనాపూర్‌లో మహిళ సహా ఇద్దరు చిన్నారులు అదృశ్యం కావడం తీవ్ర కలకలం రేపుతోంది. ఓ మహిళ తన కుమారుడు, కుమార్తెతో కలిసి ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాకపోవడం సంచలనం సృష్టిస్తోంది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 25న వేల్పూర్‌కు వెళ్తున్నట్లు చెప్పి ఇద్దరు పిల్లలతో సదరు మహిళ ఇంటి నుంచి వెళ్లిపోయింది. అయితే రాత్రి అయినా ఆమె ఇంటికి తిరిగి రాలేదు. మహిళ సెల్‌ఫోన్‌కు పలుమార్లు కాల్ చేసినా స్విచ్‌ఆఫ్ వస్తుండటంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఎంత వెతికినా ఎక్కడా ఆమె జాడ తెలియరాలేదు. దీంతో బంధువులు, పరిచయస్తుల వద్ద ఆరా తీసినా ప్రయోజనం లేకుండా పోయింది. చివరికి వేల్పూర్ పోలీసులను బాధిత కుటుంబ సభ్యులు ఆశ్రయించారు. ఘటనపై మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. మహిళ, చిన్నారుల ఆచూకీ కోసం తీవ్రంగా గాలిస్తున్నారు. వివిధ కోణాల్లో విచారణ చేపట్టారు. వారి వివరాలు తెలిస్తే వెంటనే తమకు సమాచారం అందించాలని వేల్పూర్ పోలీసులు విజ్ఞప్తి చేశారు. కాగా, ఈ ఘటన స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

# భాగ్యరాజ్ మృతి పట్ల పవన్ దిగ్భ్రాంతి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థన

**అమరావతి,జూన్27 (ప్రజా వీక్షణం)**

ప్రముఖ దర్శకుడు, నటుడు, రచయిత కె. భాగ్యరాజ్ మృతిపట్ల ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ సంతాపం తెలిపారు. భాగ్యరాజ్ కన్నుమూశారని తెలిసి చింతించానని చెబుతూ.. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. రచయితగా, సహాయ నటుడిగా భాగ్యరాజ్ సినీ జీవితాన్ని ప్రారంభించారన్నారు. అనంతరం తమిళ చిత్ర పరిశ్రమలో దర్శకుడిగా, హీరోగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారని కొనియాడారు. ఆయన దర్శకత్వం వహించిన, కథ-స్క్రీన్‌ప్లే అందించిన అనేక చిత్రాలు తెలుగు, హిందీ, కన్నడ భాషల్లో రీమేక్ అయి ఘనవిజయం సాధించాయని గుర్తు చేశారు. ప్రేమ, కుటుంబ కథలను ఆయన మలిచిన తీరు ఒక తరం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుందని పవన్ తెలిపారు. తన సినిమాల ద్వారా భారతీయ సినీ రంగంలో చెరగని ముద్ర వేశారని అన్నారు. ఈ సందర్భంగా కె. భాగ్యరాజ్ కుటుంబ సభ్యులకు పవన్ కల్యాణ్ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# కేతన్ మర్డర్ కేసులో రోజుకో కొత్త విషయం

## - చేతన్‌తో సియాగోయల్ ప్రేమయకు క్రికెటే కారణం

**ముంబై,జూన్27 (ప్రజా వీక్షణం)**

పుణెకు చెందిన యువ వ్యాపారవేత్త కేతన్ అగర్వాల్ మర్డర్ కేసులో రోజుకో కొత్త విషయం వెలుగులోకి వస్తోంది. తాజాగా, క్రికెట్ కోణం వెలుగులోకి వచ్చింది. కేతన్ హత్య కేసులో నిందితులైన సియా గోయల్, చేతన్ చౌదరీల మధ్య ప్రేమ చిగురించడానికి కారణం క్రికెట్ అని తెలుస్తోంది. సియా గోయల్ సోదరుడు సాహిల్ గోయల్‌ను పోలీసులు 10 గంటలకుపైగా విచారించారు. విచారణ సందర్భంగా గోయల్ పలు ఆసక్తికర విషయాలు బయటపెట్టినట్లు సమాచారం. ఆ వివరాల ప్రకారం..సాహిల్ క్రికెట్ మ్యాచ్‌లు ఆడేవాడు. క్రికెట్ మ్యాచ్‌లు చూడ్డానికి సియా తరచూ వెళుతుండేది. ఈ నేపథ్యంలోనే చేతన్‌తో ఆమెకు పరిచయం ఏర్పడింది. ఓ సారి కామన్ ఫ్రెండ్స్ ఏర్పాటు చేసిన దివాళీ పార్టీలోనూ ఇద్దరూ కలిశారు. దీంతో ఇద్దరి మధ్యా స్నేహం బలపడి ప్రేమగా మారింది. సియా, చేతన్ ప్రేమించుకుంటున్న సంగతి సాహిల్‌కు తెలుసు. కేతన్‌తో సంబంధం మాట్లాడుతున్నపుడు సియా అభ్యంతరం వ్యక్తం చేస్తుందని సాహిల్ అనుకున్నాడు. కానీ, సియా అలా చేయలేదు. కేతన్ అంటే ఇష్టం లేనట్లు ఆమె అస్సలు ప్రవర్తించలేదు. కేతన్‌తో పెళ్లి కుదిరిన తర్వాత సియా.. చేతన్‌తో మాట్లాడటం కానీ, తిరగటం కానీ, సాహిల్ చూడలేదు. ఇవే విషయాలు సాహిల్ పోలీసులకు చెప్పాడు. పోలీసులు సియా, చేతన్‌ల కాల్ రికార్డ్స్ పరిశీలించగా.. జనవరి నెల నుంచి మర్డర్ జరిగిన తేదీ వరకు ఇద్దరూ 2 వేలకుపైగా ఫోన్ కాల్స్ చేసుకున్నట్లు గుర్తించారు. దాదాపు 238 గంటల పాటు ఇద్దరూ మాట్లాడుకున్నారు. అయితే, సియా లాయర్ మాత్రం సియా, చేతన్‌లు స్నేహితులు మాత్రమేనని అంటున్నాడు.

# కడుపునొప్పితో బాధపడుతున్న మహిళకు లాప్రోస్కోపీ మిషన్ ద్వారా ఆపరేషన్

## - ఆసుపత్రి వైద్యులకు, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ కు కృతజ్ఞతలు తెలియజేసిన కుటుంబ సభ్యులు

**తాడేపల్లిగూడెం ప్రతినిది జూన్ 27 (ప్రజా వీక్షణం)**

కడుపు నొప్పితో బాధపడుతున్న మహిళకు తాడేపల్లిగూడెం ప్రభుత్వా సుపత్రికి చెందిన వైద్యులు లాప్రోస్కోపీ మిషన్ ద్వారా ఆపరేషన్ చేసి మహిళను ప్రాణాపాయ స్థితి నుంచి కాపాడారు. ఈ ఘటనకు సంబంధి చిన వివరాలీలా ఉన్నాయి. నల్లజర్ల కు చెందిన ఎండపాటి గొయ్యమ్మకు కడుపునొప్పి రావడంతో కుటుంబ సభ్యులు ఆమెను తణుకు పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లి చూపించారు. ఆపరేషన్ చేయాలని, ఇందుకు రూ 2 లక్షలు ఖర్చు అవుతుందని చెప్పారు. డబ్బులు చెల్లించి ఆపరేషన్ చేయించుకునే స్థోమత లేకపోవడంతో వారు తాడేపల్లిగూడెం ప్రభుత్వ ఆస్పత్రికొచ్చి డాక్టర్ నవీన్ ను కలిశారు. ౹ా4 లో భాగంగా ఇటీవల తాడేపల్లిగూడెం శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్, డాక్టర్ కళ్యాణ్ సుమారు రూ 15 లక్షల రూపాయలుతో అధునాతన సాంకేతిక పరిజ్ఞానం కలిగిన లాప్రోస్కోపీ మెషిన్ ను ప్రభుత్వ ఆసుపత్రికి అందజేశారు. ఈ లాప్రోస్కోపీ మిషన్ అందుబాటులో ఉండడం వల్ల మహిళకు ఆపరేషన్ చేసి ఆమెను ప్రాణాపాయ స్థితి నుంచి కాపాడారు. ఈ సందర్భంగా మహిళ కుటుంబ సభ్యులు మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యులు, తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియచేయటంతో పాటు వారికి తమ జీవితాంతం రుణపడి ఉంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జనసేనపార్టీ పట్టణ అధ్యక్షులు వర్తనపల్లి కాశీ, ఏఎంసి చైర్మన్ చాపల మంగ రమేష్, టీడీపీ పట్టణ అధ్యక్షులు పట్నాల రాంపండు, జనసేన పార్టీ గౌరవ అధ్యక్షులు అడబాల నారాయణమూర్తి, జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి మద్దాల మణికుమార్, కాళ్ళ గోపికృష్ణ గవర్నమెంట్ హాస్పిటల్ మెంబర్ పెంటా రాజేశ్వరి, యర్రా శ్రీను, యజ్జడ అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# సంక్షేమంతో పాటు...అభివృద్ధి కూడా ముఖ్యమే

## - కేవలం సంక్షేమంతో అభివృద్ధిని సాధించలేం- రోడ్లు, ఆస్పత్రులు, స్కూళ్లను అభివృద్ధి చేయాలి- కులాల పేరుతో హాస్టళ్ల ఏర్పాటు సరికాదు
## - కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఇదే చేస్తున్నాం
## - కేవలం బటన్ నొక్కితే వైకాపా గతేమయ్యిందో చూశాం
## - అభివృద్ధిపై గ్రామస్థాయిలో జనసేన ఆధ్వర్యంలో చర్చ సాగాలి
## - వైకాపా కులరాజకీయాలతో భ్రష్టు పట్టించే యత్నం
## - 11 సీట్లు వచ్చినా తిట్ల దండకం ఆపని వైకాపా నేతలు
## - జనసేన నిర్మాణ సారధుల కార్యాచరణ సమావేశంలో పవన్

**అమరావతి,జూన్27 (ప్రజా వీక్షణం)**

ఒక్క సంక్షేమ పథకాలే కాదు..అభివృద్ధి కూడా ముఖ్యమన్నది జనసేన విదానమని ఆ పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. సంక్షేమ పథకాల విషయంలో జనసేన పార్టీకి ఎలాంటి వ్యతిరేకత లేదని అన్నారు. నిజంగా నిస్సహాయ పరిస్థితుల్లో ఉన్నవారికి ప్రభుత్వ సహాయం, ఉచిత పథకాలు అవసరమేనని ఆయన పేర్కొన్నారు. అయితే సంక్షేమం పేరుతో మాత్రమే ప్రభుత్వాన్ని నడపడం సాధ్యం కాదని, ప్రజలు అభివృద్ధిని కూడా కోరుకుంటారని వ్యాఖ్యానించారు. మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జనసేన నిర్మాణ సారధుల సమాచార సేకరణ కమిటీ కార్యాచరణ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. రోడ్లు, ఆసుపత్రులు, స్కూళ్ల అభివృద్ధి కూడా చాలా ముఖ్యమని అన్నారు. దీనిపై గ్రామస్థాయిలోనే చర్చ సాగాలని పార్టీ నేతలకు పవన్ సూచించారు. కేవలం బటన్ నొక్కి నగదు బదిలీలు చేస్తే ప్రజలు ఎప్పటికీ ఓట్లు వేస్తారనే భావన సరికాదని అన్నారు... అలాంటి రాజకీయాలకు నిలువెత్తు ఉదాహరణ గత ప్రభుత్వం అని, సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన కూడా సమానంగా ఉండాలని ఆయన చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ ఆసుపత్రుల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన, రోడ్ల నిర్మాణం వంటి అంశాలు నిర్లక్ష్యానికి గురయ్యాయని పవన్ విమర్శించారు. ప్రస్తుతం ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు మెరుగైన రహదారులు, మౌలిక వసతులు అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఎంతసేపు బటన్ నొక్కి డబ్బులు పంపించామని చెప్పడం కంటే, ప్రజలు ప్రయాణించే రోడ్లు ఎవరు వేశారు? దశాబ్దాలుగా నిర్మించని రహదారులు ఇప్పుడు ఎలా నిర్మితమయ్యాయి? అనే విషయాలను కూడా చూడాలని పవన్ కల్యాణ్ అన్నారు.. ప్రజలకు సంక్షేమం ఎంత అవసరమో, నాణ్యమైన రహదారులు, ఆసుపత్రులు, ఇతర మౌలిక వసతులు కూడా అంతే అవసరమని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వాలు తమ బాధ్యతగా అభివృద్ధిపై దృష్టి పెట్టకపోతే, ఎన్ని ఉచిత పథకాలు అమలు చేసినా ప్రజలు పూర్తిస్థాయిలో సంతృప్తి చెందరని పేర్కొన్నారు. వైకాపా నేతలు ఎప్పుడూ విధానాలపై మాట్లాడరని.. తిట్ల దండకం అందుకుంటారని జనసేన అధినేత, అన్నారు. గతంలో కాకినాడకు చెందిన వైకాపా నేత ఎంత దారుణంగా దూషించారో అంతా చూశారన్నారు. 11 సీట్లు వచ్చిన తర్వాత కూడా వైకాపా నేతలు ఏమాత్రం తగ్గకుండా మాట్లాడుతున్నారని అన్నారు. జనసేన నేత పంతం నానాజీ మాట్లాడిన మాటలు తాను విన్నానన్న పవన్.. అలాంటి వాటిని ప్రోత్సహించ నని చెప్పారు. కుల రాజకీయాలను ఎప్పటికీ ప్రోత్సహించనని, దేశ వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీల పేరిట వేర్వేరు హాస్టళ్లు ఉండకూడదని పవన్ కల్యాణ్ అన్నారు. పిల్లలందరికీ ఒకటే హాస్టల్ ఉండాలని కోరుకుంటున్నట్టు చెప్పారు. కులాలతో రాజకీయాలు చేయను, చేయబోనని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో పనిచేసిన వారి వివరాలు ఎప్పటికప్పుడు సేకరిస్తా. సమాచారాన్ని పారదర్శకంగా సేకరించడమే కమిటీల బాధ్యత. కమిటీల ఎంపికపై కొందరు విమర్శలు చేస్తున్నారు.. అది సరికాదు. ఎన్ని ఏళ్లుగా కష్టపడుతున్నారనే దాన్ని బేరీజు వేసుకున్నాం. కమిటలో ఉన్న వారికి విధివిధానాలు అందిస్తాం. సేకరించిన సమాచారాన్ని నా దృష్టికి తేవాలి. ఎన్నో ఏళ్లుగా కష్టపడుతున్న వారిని గుర్తించాలని పవన్ సూచించారు. గాదె సాయికృష్ణ వివాదంపై పవన్ కల్యాణ్ స్పందించారు. కృష్ణలంకలో ఒక గొడవ జరిగితే క్రిమినల్‌కు కులాన్ని ఎలా అంటగడుతున్నారని ప్రశ్నించారు. తప్పు ఎవరు చేసినా.. ఏ కులం వారు చేసినా.. తప్పే కదా అని నిలదీశారు. కాపు అయితే ఒప్పు.. ఇంకొకరు అయితే తప్పు అవుతుందా అని ప్రశ్నించారు. తనకు పేపర్లు, ఛానళ్లు లేవని.. జనసైనికులే తన మీడియా అని వ్యాఖ్యానించారు. ఇలాంటి అంశాలను బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. అన్నివర్గాలను సమానంగా చూడటమే సామాజిక న్యాయమని తెలిపారు. కుల రాజకీయం పొలిటికల్ విక్టరీ అవుతుందేమో గానీ.. సామాజిక విక్టరీ కాదని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. అధికారం ఎప్పుడూ జగన్ అండ్ కో చేతిలోనే ఉండాలా అని ప్రశ్నించారు. వైసీపీ వాళ్లను చూడాలి.. ప్రతి అంశంలోనూ కులాన్ని, మతాన్ని కూడా వాడతారని ఎద్దేవా చేశారు. వైసీపీలో పనిచేసిన నాయకులు మన వేదిక మీద ఉన్నారని ప్రస్తావించారు. వీరు దిగజారి మాట్లాడిన దాఖలాలు ఎప్పుడైనా చూశారా అని ప్రశ్నించారు. వైసీపీలో ఇతర నేతలు నోరు తెరిస్తే అసభ్య వ్యాఖ్యలే చేస్తారని.. వ్యక్తిత్వ హననాలు చేస్తారని చెప్పుకొచ్చారు. బాలినేని శ్రీనివాసరెడ్డి కాంగ్రెస్ మనిషి.. ఆయన విలువలతో మాట్లాడారని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. 18వేల మంది సాధక్‌లను కలవాలనేది తన భావన అని పవన్ కల్యాణ్ చెప్పుకొచ్చారు. ప్రతి ఊరిలో బాధ్యతలు అప్పగించిన నాయకుడు.. అక్కడ 2వేల మంది ప్రజలకు తెలిసి ఉండాలని తెలిపారు. ఎమ్మెల్సీ నాగబాబును అరకుకు పంపించామని.. ఆయన జనాలతో మాట్లాడతారని.. ప్రకృతిని సంరక్షిస్తారని అన్నారు. పల్నాడుకు బాలినేని శ్రీనివాసరెడ్డి కరెక్టు అని భావించి.. ఆ బాధ్యత అప్పగించామని చెప్పారు. కాకినాడను తట్టుకోవాలంటే.. సామినేని ఉదయభాను కరెక్టు అని భావించామని తెలిపారు. మంత్రి కందుల దుర్గేశ్‌ని అమలాపురం పంపితే బంధువులు ఎక్కువ అని అన్నారని చెప్పారు. మొహమాటానికెళ్లి.. ఎవరినైనా పెట్టాల్సి వస్తుందేమేనని ఆయన అన్నారని చెప్పారు. కానీ ఈ విషయంలో పని చేసే వారికే ప్రాధాన్యం అనేది ప్రజల్లోకి వెళ్లాలని సూచించారు. 'పుష్కర కాలం పాటు మీరంతా నలిగారని.. మీరు ఏపని చేస్తున్నారో కాదు.. దేశానికి సేవ చేసే వారిని ప్రోత్సహిస్తా' అని స్పష్టం చేశారు. తనకు దేశం తర్వాతే ఏదైనా.. కులం అనేది సోషల్ రియాలిటీ అని చెప్పుకొచ్చారు. తాను ఈ విషయాన్ని మార్చాలనో, సరిదిద్దాలనో ప్రయత్నం చేయనని పేర్కొన్నారు. తాను కులాల గురించి మాట్లాడతానని కొంతమంది అంటారని.. తాను కులం కార్డు తీసుకుని ఎప్పుడూ పాలిటిక్స్ చేయనని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. రాష్ట్రం బాగుండాలని, దేశం బాగుండాలని.. మానవత్వం ఉండాలనేదే తన ఆలోచన అని వ్యాఖ్యానించారు. కులం ఎప్పుడూ ఇంటి గడప లోపలే ఆగిపోవాలని.. గడప దాటాకా మన సంస్కృతి, ధర్మాలు ఉండాలని సూచించారు. ఇంకో పది అడుగులు వేస్తే.. దేశం, మానవత్వం గుర్తుకు రావాలని తెలిపారు. స్థాయికి దిగజారి మాట్లాడే వారికి కూడా కౌంటర్‌గా తాను మాట్లాడాల్సి వస్తుందని అన్నారు. క్షేత్రస్థాయిలోకి మీరంతా ఓ మెసేజ్ తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ హాస్టల్స్ కాకుండా పిల్లలు అందరికీ ఒకే హాస్టల్ ఉండాలనేది తన కోరిక అని ఉద్ఘాటించారు. ఆయా ప్రభుత్వాలే దశాబ్దాలుగా ఈ కులాల పేరుతో పిల్లలను విడదీస్తున్నాయని చెప్పుకొచ్చారు. ఓట్ల కోసం ప్రజల్లోకి వెళ్తే.. ఇటు దళితులు, అటు కాపులు, ఈ రోడ్డులో బీసీలు అంటూ విడగొట్టి మాట్లాడతారని అన్నారు. రాజకీయం ఇలానే నడుస్తుందనేది తనకు తెలియదని.. తనకు కులాల ఐక్యత ముఖ్యమని స్పష్టం చేశారు.కులం ఐడెంటిటీని తాను మార్చలేనని... లింగమనేని రమేశ్‌కు రాజ్యసభ ఇస్తే.. ఆ కులం మీద కొంతమంది చర్చ, రచ్చ చేశారని పవన్ కల్యాణ్ ప్రస్తావించారు. శివ లాగానే రమేశ్‌ని గుర్తించి.. ఆయన పడిన కష్టానికి తాను బాధ్యతలు అప్పగించానని అన్నారు. కొవైసీపీ పొలిటకల్ గేమ్ కోసం తన మీద విమర్శలు చేయడం తగదని హితవు పలికారు. ఇన్ని బలమైన కులాలు ఉండి అధికారంలోకి ఎందుకు రాలేకపోతు న్నాయని ప్రశ్నించారు. బీసీ సామాజిక వర్గాలు 105 కులాలు ఉంటే.. కాపుల్లో బలిజ, ఒంటరి, తెగలు ఉన్నాయని వివరించారు. ఇప్పటి వరకు అధికారం కోసం తాను పని చేయలేదని.. అవకాశాలు అడిగే స్థాయిలోనే ఉన్నానని తెలిపారు. యాభై శాతం బీసీ కులాలు ఉన్నవారంతా కలెక్టివ్‌గా ఉండి అధికారం సాధించుకోవచ్చు కదా అని చెప్పారు. గొడవలు అప్పుడు మాత్రం అందరూ ఏకం అవుతున్నారని అన్నారు. ఓట్ల సమయంలో మాత్రం ముక్కలుగా విడిపోయి వేరే వారికి అవకాశం ఇస్తున్నారని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.



# రాకాలో పవర్‌ఫుల్ రోల్‌లో రష్మిక నెగెటివ్ షేడ్‌లో ఉంటుందని ప్రచారం

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, స్టార్ డైరెక్టర్ అట్లీ కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటున్న భారీ పాన్ ఇండియా చిత్రం 'రాకా' గురించి ప్రస్తుతం సోషల్ మీడియాలో ఒక క్రేజీ అప్‌డేట్ తెగ హల్‌చల్ చేస్తోంది. 'పుష్ప', 'పుష్ప 2' చిత్రాలతో ప్రపంచవ్యాప్తంగా బాక్సాఫీస్ రికార్డులను తిరగరాసిన అల్లు అర్జున్, రష్మిక మందన్న హిట్ కాంబో ఈ సినిమాతో మరోసారి రిపీట్ కాబోతున్నట్లు ఇండస్ట్రీ వర్గాల్లో బలమైన వార్తలు వినిపిస్తున్నాయి. అయితే ఈసారి వీరిద్దరి కాంబినేషన్ మరింత విభిన్నంగా ఉండబోతోందని సమాచారం.ఇప్పటివరకు బన్నీతో కేవలం రొమాన్స్ చేసిన రష్మిక, ఈ సినిమాలో సరికొత్తగా నెగెటివ్ షేడ్స్ ఉన్న పాత్రలో కనిపించబోతుందని ప్రచారం సాగుతోంది. కథను పూర్తిగా మలుపు తిప్పే ఒక కీలకమైన పాత్ర కోసం దర్శకుడు అట్లీ ఆమెను ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. ఇప్పటికే ముంబైలో జరుగుతున్న భారీ యాక్షన్ షెడ్యూల్‌లో రష్మిక కూడా జాయిన్ అయినట్లు బాలీవుడ్ వర్గాల సమాచారం. 'పుష్ప' సిరీస్ బ్లాక్‌బస్టర్ హిట్ అవ్వడంతో అల్లు అర్జున్‌కి రష్మిక ఒక 'లక్కీ చార్మ్' అని, అందుకే ఆమెను ఈ ప్రాజెక్ట్‌లోకి తీసుకున్నారని ఫ్యాన్స్ భావిస్తున్నారు. కాగా, ఈ చిత్రంలో బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకొణె ప్రధాన నాయికగా నటిస్తుండగా, రష్మికతో పాటు మృణాల్ ఠాకూర్, జాన్వీ కపూర్ కూడా కీలక పాత్రలు పోషిస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు బాలీవుడ్ కింగ్ ఖాన్ షారుక్ ఖాన్ కూడా ఈ సినిమాలో ఒక పవర్‌ఫుల్ క్యామియో రోల్‌లో మెరవనున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది. ఈ క్రేజీ తారాగణంతో అంచనాలను పెంచేస్తున్న ఈ ప్రాజెక్ట్‌పై చిత్ర యూనిట్ నుండి త్వరలోనే అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది.






# మైత్రీ మూవీ మేకర్స్‌లో నవీన్ పోలిశెట్టి

టాలీవుడ్ యంగ్ అండ్ టాలెంటెడ్ హీరో నవీన్ పోలిశెట్టి తన తదుపరి క్రేజీ ప్రాజెక్ట్‌ను పట్టాలెక్కించేందుకు సర్వం సిద్ధం చేసుకున్నాడు. 'అనగనగా ఒక రాజు' చిత్రంతో బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకోవడమే కాకుండా, వంద కోట్ల క్లబ్‌లో చేరి తన మార్కెట్ స్టామినాను నిరూపించుకున్న నవీన్.. తన కొత్త సినిమాను లైన్‌లోపెట్టాడు. అగ్ర నిర్మాణ సంస్థ అయిన మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మించబోతుంది. నవీన్ పోలిశెట్టి మార్కెట్ పరిధిని దృష్టిలో ఉంచుకుని ఈ కలయికపై మైత్రీ సంస్థ చాలా నమ్మకంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాకు సంబంధించిన అధికారిక ప్రకటన రాకముందే నవీన్ పోలిశెట్టి సోషల్ మీడియా వేదికగా చేసిన ఒక వినూత్న ప్రమోషన్ ప్రస్తుతం నెట్టింట సంచలనంగా మారింది. సినీ ఇండస్ట్రీలోని నలుగురు టాప్ కమర్షియల్ డైరెక్టర్స్ ప్రశాంత్ నీల్, సుకుమార్, లోకేష్ కనగరాజ్, మరియు రిషబ్ శెట్టిలతో కలిసి దిగిన ఒక అదిరిపోయే ఫన్నీ రీల్‌ను ఆయన షేర్ చేశాడు. ఈ దర్శకుల సినిమాల బాక్సాఫీస్ వసూళ్లను ఉద్దేశిస్తూ.. దీనిని తన కెరీర్‌లోనే అత్యంత ఖరీదైన 'రూ. 5000 కోట్ల ఫ్రేమ్' అని నవీన్ చమత్కరించాడు. ఈ వైరల్ వీడియో ద్వారా మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌లో తన తదుపరి చిత్రం రాబోతోందని నవీన్ క్లారిటీ ఇచ్చాడు. దీనికి స్పందనగా మైత్రీ మూవీ మేకర్స్ కూడా నవీన్‌ను తమ ప్రొడక్షన్ ఫ్యామిలీలోకి ఆహ్వానిస్తూ.. ఒక ఫుల్-ఆన్ ఎంటర్‌టైనర్ లోడింగ్ అవుతోందని వెల్లడించింది. అయితే ఈ సరికొత్త ప్రాజెక్ట్‌ను పూర్తి స్థాయి క్లీన్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కించ నున్నారు. 'సైరన్' సినిమాతో గుర్తింపు తెచ్చుకున్న తమిళ దర్శకుడు ఆంటోనీ భాగ్యరాజ్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించనున్నట్లు సినీ వర్గాల్లో గట్టి ప్రచారం సాగుతోంది. ప్రస్తుతం స్క్రిప్టింగ్, ప్రీ-ప్రొడక్షన్ పనులను వేగవంతం చేసిన చిత్ర బృందం, త్వరలోనే షూటింగ్‌ను ప్రారంభించి, వచ్చే ఏడాది ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి ప్లాన్ చేస్తోంది. నవీన్ పోలిశెట్టి అద్భుతమైన కామిక్ టైమింగ్, ఆంటోనీ భాగ్యరాజ్ టేకింగ్, మరియు మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాణ విలువల కలయికలో రాబోతున్న ఈ చిత్రంపై ఇండస్ట్రీలో భారీ అంచనాలు నెలకొన్నాయి.

# ఇడుపు కాయితం మూవీ టైటిల్‌పై రచ్చ టైటిల్ మార్చేది లేదన్న దర్శకుడు బన్నీవాసు

ఒక సినిమా విడుదలైన తర్వాత అందులోని పాత్రలు, సన్నివేశాలు, సంభాషణలపై చర్చ.. వివాదాలకు దారి తీయడం ఇప్పటివరకూ చూశాం. ఇటీవల కాలంలో టైటిల్‌తోనే చర్చకు దారితీసిన మూవీ 'ఇడుపు కాయితం'. సోషల్ మీడియాలో పనిగట్టుకుని కొందరు పెట్టిన పోస్టులు వివాదానికి దారితీశాయి. సినిమా భాష, యాస, టైటిల్స్ విషయంలో రెండు వర్గాలుగా విడిపోయి.. ఒకరిపై ఒకరు ఆరోపణలు, విమర్శలకు దిగారు. ఈ క్రమంలో చిత్ర నిర్మాత బన్ని వాస్ స్పందించారు. ఇది ఒక ప్రాంతానికి పరిమితమయ్యే కథ కాదని, కథను బట్టే టైటిల్ ఉంటుందని తెలిపారు. ప్రస్తుతం వివాదం నేపథ్యంలో టైటిల్, కథను మార్చే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు. ఏ సినిమాకైనా కథ, దాని నేపథ్యం బట్టే టైటిల్ ఉంటుంది. దీనిపై ఇక చర్చ అనవసరం. షూటింగ్ పూర్తయి విడుదలైన తర్వాత సినిమానే మాట్లాడుతుంది. ఆంధ్రా, తెలంగాణ ఎవరైనా సరే సినిమా నచ్చితేనే చూస్తారు. నచ్చకపోతే చూడరు. నేను చేయాల్సింది సినిమాను బాగా తీయడంపై దృష్టి పెట్టడమే. ప్రస్తుతం ఈ వివాదం వల్ల సినిమాకు కొంత ఇబ్బంది కలిగిన మాట వాస్తవం. రేపు సినిమా బాగుంటే అన్నీ సర్దుకుంటాయి. ఇది ఒక ప్రాంతానికి పరిమితమయ్యే కథ కాదు. నాకు పూర్తి నమ్మకం ఉంది. దర్శకుడు వచ్చిన ప్రాంతం, చూసిన వాస్తవ సంఘటనల నుంచి రాసుకున్న కథ ఇది అన్నారు. ప్రియదర్శి, నాగదుర్గ కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ మూవీకి వంశీరెడ్డి దొండపాటి దర్శకుడు. ఇడుపు కాయితం అంటే విడాకుల పత్రం.. భార్యాభర్తలు విడిపోవడానికి పెద్దల సమక్షంలో కుదుర్చుకున్న ఒప్పంద పత్రం. ఇప్పుడు దంపతులు విడిపోవాలనుకుంటే కోర్టులు చుట్టూ తిరుగుతున్నారు. కానీ, కొద్ది కాలం కిందట కలిసి బతకలేమని నిర్ణయించుకున్న దంపతులు పెద్ద మనుషుల సమక్షంలో విడిపోవడానికి ఒక ఒప్పందం చేసుకునే వారు. దీన్నే ఇడుపు కాయితం అని పిలిచేవారు. ఇప్పటికీ తెలంగాణలోని గ్రామీణ ప్రాంతాల్లో ఇడుపు కాయితం రాసుకొని విడిపోతున్న జంటలున్నాయి. ప్రస్తుతం సోషల్ మీడియాలో ఎక్కువగా వినిపిస్తున్న పదాల్లో 'ఇడుపు కాయితం' ఒకటి. ప్రియదర్శి హీరోగా తెరకెక్కుతున్న కొత్త సినిమా టైటిల్‌గా ఈ పదాన్ని ప్రకటించిన తర్వాత దీనిపై పెద్ద ఎత్తున చర్చ మొదలైంది. కొందరు ఈ పదానికి అర్థం ఏమిటని వెతుకుతుండగా, మరికొందరు దీనిపై సోషల్ మీడియాలో చర్చలు, వాదోపవాదాలు మొదలుపెట్టారు. దీంతో 'ఇడుపు కాయితం' అనే పదం ఒక్కసారిగా ట్రెండింగ్‌లోకి వచ్చింది.




# ఇరుముడి కట్టు పాట 29న విడుదల

మాస్ మహారాజా రవితేజ కథానాయకుడిగా టాలెంటెడ్ డైరెక్టర్ శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కుతున్న డివోషనల్ డ్రామా 'ఇరుముడి'. మైత్రీ మూవీ మేకర్స్, టి-సిరీస్ సంయుక్తంగా ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి సంబంధించిన క్రేజీ అప్‌డేట్‌ను చిత్ర బృందం ప్రకటించింది. ఈ సినిమా నుంచి మొదటి పాట 'ఇరుముడి కట్టు' పాటను జూన్ 29వ తేదీన ఉదయం 11:07 గంటలకు విడుదల చేయబోతున్నట్లు ప్రకటించింది. జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రాన్ని ఈ ఆగస్ట్ 21న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయనున్నారు. రవితేజ సరసన ప్రియా భవానీ శంకర్ కథానాయికగా నటిస్తుండగా, సాయి కుమార్, బేబీ నక్షత్ర, విష్ణుశర్మ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ సినిమాలో రవితేజ సరికొత్త డివోషనల్ లుక్‌లో కనిపించనున్నారు. ఒక తండ్రి, కూతురి మధ్య ఉండే ఎమోషనల్ బాండింగ్, అయ్యప్ప స్వామి మాల ధారణ ద్వారా ఒక వ్యక్తి జీవితంలో వచ్చే ఆధ్యాత్మిక మార్పుల చుట్టూ ఈ కథ తిరగనుంది. రవితేజ కెరీర్‌లోనే ఇదొక విభిన్నమైన చిత్రంగా నిలవబోతోంది.






# తమిళ చిత్ర పరిశ్రమలో మరో విషాదం నటుడు, దర్శకుడు భాగ్యరాజ్ హఠాన్మరణం

తమిళ చిత్ర పరిశ్రమలో మరో విషాదం చోటుచేసుకుంది. ప్రముఖ నటుడు, దర్శకుడు కె.భాగ్యరాజ్ (73) కన్నుమూశారు. గుండెపోటుతో శనివారం ఉదయం చెన్నైలో తుదిశ్వాస విడిచారు. తమిళ, తెలుగు భాషల్లో 75కు పైగా చిత్రాల్లో ఆయన నటించారు. 25 సినిమాలకు దర్శకత్వం వహించారు. అంతేకాదు.. సంగీత దర్శకుడిగా సింగర్‌గా కూడా ఆయన అలరించారు. చివరిగా ఆయన '35 చిన్న కథ కాదు', శేఖర్ కమ్ముల దర్శకత్వం వహించిన 'కుబేర' చిత్రంలో సాధు పాత్రలో కనిపించారు. తమిళనాడులోని ఈరోడ్ జిల్లా వెల్లాంకోయిల్‌లో ఆయన జన్మించారు. 1981లో నటి ప్రవీణను వివాహం చేసుకున్నారు. కామెర్ల వ్యాధితో ఆమె 1983లో మరణించారు. ఆ తర్వాత 1984లో పూర్ణిమ జయరామ్‌ను పెళ్లాడారు. వీరిద్దరికీ ఇద్దరు సంతానం. కొడుకు శంతను భాగ్యరాజ్ హీరోగా చేస్తున్నారు. కూతురు శరణ్య 'పారిజాతం' వంటి కొన్ని సినిమాల్లో హీరోయిన్‌గా నటించారు. ప్రముఖ దర్శకుడు భారతీరాజా వద్ద '16 వయదినిలే' (తెలుగులో పదహారేళ్ల వయసు) చిత్రానికి సహాయ దర్శకుడిగా కెరీర్ ప్రారంభించారు భాగ్యరాజ్. ఆ సినిమాలో ఒక చిన్న పాత్రలోనూ మెరిశారు. 1979లో 'సువరిల్లాద చిత్రంగళ్' సినిమాతో దర్శకుడిగా మారారు. ఆ తర్వాత హీరోగా, దర్శకుడిగా ఆయన చేసిన ప్రయోగాలన్నీ సక్సెస్ అయ్యాయి. 'అన్రా 7 నాట్కళ్' (రాధా కళ్యాణం), 'ముంధానై ముడిచ్చు' (మూడు ముళ్లు), 'దూరల్ నిన్ను పోచ్చు' వంటి చిత్రాలు బ్లాక్‌బస్టర్స్‌గా నిలిచాయి. తమిళంలో ఆయన రూపొందించిన ఎన్నో కథలు తెలుగు, హిందీ భాషల్లోకి రీమేక్ అయ్యాయి. అమితాబ్ బచ్చన్ నటించిన 'ఆఖరి రాస్తా' చిత్రానికి కథ, స్క్రీన్ ప్లే భాగ్యరాజ్ అందించడం విశేషం. భాగ్యరాజ్ కేవలం సినీ రంగానికే పరిమితం కాలేదు. ఆయన 'భాగ్యవారపత్రిక'కు సంపాదకుడిగా వ్యవహరించడమే కాకుండా పలు నవలలు కూడా రచించారు. కథా రచయితగా, దర్శకుడిగా, నటుడిగా బహుముఖ ప్రజ్ఞను ప్రదర్శించి దక్షిణ భారత సినీ పరిశ్రమలో ప్రత్యేక స్థానం సంపాదించారు. భాగ్యరాజను ఇండియన్ సినిమాలో 'కింగ్ ఆఫ్ స్క్రీన్ ప్లే' అని పిలుస్తుంటారు. భాగ్యరాజ్ మరణంతో తమిళ సినీ పరిశ్రమలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఆయన మృతిపట్ల సినీ ప్రముఖులు, అభిమానులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ నివాళులు అర్పించారు. ఆయన సేవలను స్మరించుకుంటూ సోషల్ మీడియా వేదికగా సంతాపం ప్రకటించారు.

Printed & published owned by K.SRAVAN KUMAR. Printed Published RK PRINTING PRESS at 6-1-948 Boyawada Street Nalgonda.Pin : 508001. Head office: 2-66-121/122 near ramky one Marvel gajullaramaram Quthbulapur medchal Malkajgiri district. RNI.NO.APTEL/2009/29433.(CELL ) 9866330400 prajaveekshanam@gmail.com